
భీమన్న పేరడీలు
చివరి మెట్టు మీది
శిష్యుడు
బోయి భీమన్న

| | |
|---|---|
| ప్రథమ ముద్రణ | సెప్టెంబర్, 1998 |
| ప్రతులు: | 1000 కాపీలు |
| హక్కులు | రచయితవి |
| మూల్యం | రూ॥ 125/- |

ప్రతులకు
భీమన్న సాహితీ నిధి,
ఐ.సి. 85, ఇరంమంజిల్ కాలనీ,
హైదరాబాదు - 500 004

ముఖచిత్రం
రవిచంద్ర పొన్నాడ

లేజర్ టైప్ సెట్టింగ్ మరియు ప్రింటింగ్
రవిచంద్రజవ గ్రాఫిక్స్ మరియు క్రియేషన్స్
1-80/2, కూకట్ పల్లి,
హైదరాబాదు - 72
ఫోన్: 3068708

# అంకితం

## జాతిరత్న డా॥ ఎస్. ఎన్. బూసి గారికి

గాంధీ అంబేద్కర్ ల గ్రంథాల సారంబు
కలబోసి నిండు పాల్కడలి జేసి,
వ్యాసుని రీతిగా స్వాతంత్ర్య సమరేష్టి
గీతా సుధను తీసి జాతి కొసగి,
కృతక భాషా వర్ణ కుల శృంఖలలు త్రెంచి
ఆసేతు శీతాద్రి కభయ మిచ్చి,
గతమెల్ల గతము, ఆగతమెల్ల ప్రగతిగా
గమ్యైక్యము నకు స్వాగతము పలికి,

నేటి రాజనీతికి లక్ష్యనిధిగ వెలయు
ప్రాజ్ఞ గ్రంథము వ్రాసిన పండిత మణి
శ్రీ సుభామణి నాగన్న బూసి ద్యుమణి
కిచ్చు వాడ నీ కృతి నమస్కృతుల తోడ!

## 2

వైది కార్ష తపో వాటి, వ్యాస వనము,
బాల యోగుల కనిపెంచు పాలవెల్లి,
కోటి తారల హరివిల్లు కోనసీమ,
గౌతమీ తీర పినపళ్ల గ్రామ భూమి!

సాంఘిక న్యాయమునకు నిస్సంగ సేవ,
బూసి వంశాగ్ర గామియై వాసి గాంచె;
భారతీయత నొక జాతిగా రచించి
ఘనత గొనె నేడు శ్రీ సుభామణి మనీషి

## 3

మూర్తి, కూర్మయ్య, ధర్మన్న, పున్నయాది
ఆది ఆంధ్రోద్య మాగ్ర నాయకుల స్ఫూర్తి
మూర్తిగొన్న సుభామణి బూసి నేడు
దళిత జనతా ప్రభాస విద్యా ప్రకీర్తి!

–భీమన్న

## ప్రవేశిక

ఇప్పుడు జ్ఞాపకం వస్తున్నది 1934లో, అంటే 64 వసంతాల క్రితం, నేను కాకినాడ కాలేజీలో విద్యార్థిగా వుంటున్నప్పుడు దేవులపల్లి వారి ఏడుపు కవితలపై నేను వ్రాసిన హేళన. అప్పుడు నాకు తెలియలేదు కాని ఇపుడనిపిస్తున్నది – అదే నా తొలి పేరడీ అనవచ్చునని!

ఆ రోజుల్లో కాలేజీలో రెండు వర్గాలుండేవి. ఒకటి బ్రహ్మ సమాజం, ప్రభుత్వ వర్గం. ఉచిత విద్యా సౌకర్యంగల హరిజన విద్యార్థులు సహజంగా ఈ వర్గానికి చెంది వుండేవాళ్లు. ఈ వర్గానికి నాయకుడు కృష్ణశాస్త్రి గారు.

రెండో వర్గం కాంగ్రెసుకు చేరువుగా ఉండేది. దాని నాయకుడు బోటని లెక్చరరు గోరాగారు. ఆయన నాస్తికుడు.

నేను గోరా గారితో వుండే వాణ్ణి. స్వేచ్ఛగా కవితలు వ్రాసుకొనే వాణ్ణి. కృష్ణశాస్త్రి గారి శిష్యుల కవితలతోపాటు నా కవితలు కూడ పత్రికలలో పడుతుండేవి.

శాస్త్రిగారి శైలి, భావుకత, గాన సరళి నాకు బాగా నచ్చేవి. కాని ఆయన లోని విషాదం, ఏడుపు, భక్తి ప్రదర్శన లోని కౌటిల్యం నాకు గిట్టేవి కాదు.

''కన్నీరు మున్నీరుగా ఏడ్వనీరు నన్ను'' వంటి ఆయన ఒక కవితను ఆక్షేపిస్తూ నేను అప్పుడు వ్రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇవి:

ఏడుపే నీకు ముఖ్యమవునేని తండ్రి
వెక్కి వెక్కి ఎంతో ఏడ్చి వేయగలను
కాని, మగటిమి చచ్చి నీ కాళ్ళను బడి
సేవ చేయు మటన్న నే చేయలేను!

బహుశా ఇదే నా తొలి పేరడీ.

## కృష్ణపక్షానికి శుక్లపక్షం

కృష్ణ శాస్త్రిగారి పాటలకు పేరడీలు వ్రాద్దామనుకొన్నపుడు, నాకనిపించిందీ – అసలు కృష్ణశాస్త్రే ఆ కాలానికి ఒక పేరడీ అని. ఆ సత్యాన్ని ఆనాటి దిఙ్నాగుడు అక్కిరాజు ఉమాకాంత పండితుడు స్పష్టంగానే ప్రకటించాడు. ఆ పండితుడి దృష్టిలో నన్నయాదులు కూడా కవులు కారు. అది వేరే విషయం.

కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్ష కావ్యాన్ని వెక్కిరిస్తూ అనంత పంతులు రామలింగస్వామి శుక్లపక్షం అనే కావ్యం వ్రాశాడు. కృష్ణపక్షానికి శుక్లపక్షం ఒక పేరడీ.

నేను పేరడీలు మొదట విన్నదీ, అలాంటివి వుంటాయని తెలుసుకొన్నదీ జల సూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారి దగ్గర. తెలుగులో పేరడీలకు బహుశా జరుక్ శాస్త్రి గురువేమో?

ఈ మధ్య ఎవరో పేరడీలు మీద రీసెర్చి చేశారని, డాక్టరేటు కూడ తీసుకున్నారనీ, దాని వివరాలు త్వరలో తెలియజేస్తానని ఆ మధ్య ఆచార్య ఆపదరావుగారు నాతో అన్నారు – అది అంతే.

## ధర్మన్న – గరిమెళ్ళ

ఒకసారి ఒక చిత్రం జరిగింది. మైకు ముందుకు వెళ్లి, నా పద్ధతిలో ''సభా సరస్వతికి నమస్కారం'' అంటూ వుంటే సహస్రారంలో ఒక మెరుపు మెరిసి, ఒక కొత్త భావం ఆవిష్కారమయింది. అనుకొన్న పథకం అదృశ్యమైపోగా, కొత్త భావావేశంతో ఫ్రీగా మాట్లాడేశాను – బహుశా, ఒక గంట సేపట! సభలో వున్న మిత్రుడు పి.జె.ఆనంద్ ఆ తర్వాత చెప్పాడు నాతో

నా ఆ ప్రసంగం సార బిందువు లివి –

1. రాజకీయంగా దేశ నాయకులు ఇద్దరు. గాంధి, అంబేడ్కరు.

ఒక ఖైదీ వున్నాడు. అతడు రోగిష్టి వాడు. జైలులో అనేక హింసలకు గురి అవుతూ

వున్నవాడు, అతని కాళ్ళు రెండు చచ్చుబడి పోయాయి. నడవలేడు. "అతన్ని విడుదల చెయ్యండి, మేం బాగుచేసుకుంటాం" అంటాడు గాంధీ.

"ముందుగా అతన్ని బాగు చెయ్యండి. ఆ కాళ్లలోకి కొంతైనా శక్తి రాకుండా అతడెలా నిలబడగలడు? పక్షవాతంతో బైటికి వచ్చి ఏం లాభం?" అంటాడు అంబేద్కరు.

"లోపల అతడికి భద్రతలేదు"

"బైట కుక్క చావు చస్తాడు"

ఆ ఇద్దరి నాయకత్వాలకూ ఇదీ తేడా. మూడవ వాడు సర్దార్ పటేల్. భారత్ అనేక శత్రు దేశాలుగా చీలిపోకుండా కాపాడిన మహా నాయకుడు పటేల్.

ఈ పోలికను స్వాతంత్రోద్యమ సాహిత్యానికి వర్తింపజేశాను.

పోలిక గరిమెళ్ల సత్యనారాయణకు గాంధీతో, కుసుమ ధర్మన్న కవికి అంబేద్కరుతో, బహుశా ఆంధ్రలో స్వాతంత్రోద్యమం గరిమెళ్ల వారి దేశ భక్తి ప్రబోధ గేయాలతోనే ప్రఫుల్లమయిందన్నా అనవచ్చు. తమిళంలో మహాకవి భారతిని మించిన వాడు తెలుగులో గరిమెళ్ళ. 1922 నాటికే వందల కొలదీ గేయాలు వ్రాసి ప్రచారం చేసి, విజాతీ ప్రభుత్వం చేతిలో నరకయాతనలు పడి రెండేళ్ళు జైలు శిక్ష అనుభవించిన స్వాతంత్ర్య మహాకవి ఆయన.

ఆయన గేయాలలో రెండు బహుజన ప్రచారంలో ఉన్నట్టివి.

1. మాకొద్దీ తెల్లదొరతనము 2. దండాలండోయి బాబు దండాలండోయి.

కుసుమ ధర్మన్నగారు ఆ కాలంలో హరిజనోద్ధరణ కృషిలో తలమున్క లవుతున్న హరిజన నాయకుడు. ఆజాను బాహువు. భీమకాయుడు. గొప్పవక్త.

మాల, మాదిగ, రెల్లి మొదలైన అస్పృశ్య కులాలు చండాల, పంచమ, నిమ్న, డిప్రెస్డు, ఆది ఆంధ్ర వగైరా పేర్లతో పిలువబడుతున్న రోజులవి. హరిజన అనేది తర్వాత వచ్చింది. దళిత అనేది అప్పటికి లేదు.

ధర్మన్నగారు తమ ప్రచారోద్యమానికి ఉపన్యాసాలతోపాటు గద్య పద్య గేయ ప్రక్రియలను విశేషంగా వాడుకొన్నాడు. ఆ ప్రక్రియలలో వందలకొలది రచనలను చేశాడు.

ఆశువుగా చెప్పేవాడు. శ్రావ్యంగా పాడేవాడు. అవసరమైనప్పుడు హావ భావ నాట్యాల ద్వారా, హాస్య చమత్కార చాతుర్యాల ద్వారా తన సాహిత్యాన్ని ప్రచారంలో పెట్టేవాడు.

కవి, రచయిత, వాగ్గేయకారుడు, గాయకుడు, నర్తకుడు, వక్త, ఆయుర్వేద వైద్యుడు, సాముద్రికుడు, స్నేహశీలి, కావ్య పురాణేతి హాసాలను గురించి క్షుణ్ణంగా తెలిసిన వాడు. వీటిని సామాజిక స్పృహతో విమర్శించగల పండితుడు, సరసుడు, జనరంజకుడు ధర్మన్నగారు.

శిష్ట కావ్యాల నుంచి కామ శాస్త్రాల వరకు ఆయనకు సుపరిచితాలు. రాజమండ్రికి వచ్చే అన్ని రంగాల నాయకులు ఆయనింటికి వచ్చేవారు. ఆయనింట రాజాస్థానంలో వలె నిత్య గోష్ఠి నిరంతరంగా ఒప్పారేది. తర్వాత పత్రికాధిపతి అయ్యాడు. జయభేరి పత్రికను నడిపి, ఆనాటి కులతత్వ వాదుల గుండెల్లో సింహగర్జనలు చేశాడు.

నిండైన విగ్రహం, కొండంత ఎత్తుమనిషి, పెద్దతల, తలపై కాశ్మీరీటోపీ. ముతక షరాయి, మోగాళ్ళ వరకు గౌను. అనుచరులతో రోడ్డు మీద నడుస్తుంటే ''ఎవరో ఒక పాదుషాహి'' అంటూ రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి గురించి దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారు వ్రాసిన పద్యం సాక్షాత్కరించేది. అయితే, నాయుడుగారి కంటే ధర్మన్నగారు బాగా పొడుగు.

ధర్మన్న కవి వ్రాసిన రెండు సుదీర్ఘ గేయ రచనలలో

ఒకటి ''మాకొద్దీ నల్ల దొరతనం'', రెండు ''దండాలండోయి బాబు, దండాలండి''.

గరిమెళ్లవారు తెల్లదొరతనం వద్దన్నారు. ధర్మన్నగారు నల్ల దొరతనం వద్దన్నారు. అలా వద్దనడానికి ఎవరి కారణాలు వారికుంటై. నేను తెలియగోరిన అంశం ఎవరి గేయం ముందు అనేది. అయితే, రెండూ స్వతంత్రగేయాలే కనుక, వాటి వెనుక ముందులకు ఎక్కువ ప్రాధాన్యముండదు. నాకు కావలసింది ఏది దేనికి పేరడి అని.

ఒకదాని కొకటి పేరడీ. అంతే!

ఇంకా కొన్ని పేరడీలు వ్రాయాలనుకోవడానికి, ఇదివరలో వ్రాసిన హాస్య ఆక్షేపక

కవితలను వాటికి చేర్చి ప్రకటిద్దామనుకోడానికి మూలమైన భావ భూతం నాలో ఇలా ఆవిర్భవించింది.

ఇక మూడో కవి చిలకమర్తి వారు. ఆయనొక్కడే భారతీయులను హిందువులని ధైర్యంగా ప్రకటించిన మహాకవి. ఈ ముగ్గురూ మినహా, ఆకాలంలోని తక్కిన కవులంతా గొప్పలు చెప్పుకున్న డాంబికులే. ధర్మన్న, గరిమెళ్ల ఒకే ప్రాంతానికి చెందిన సమకాలీనులూ, మిత్రులూ కనుక వారి మధ్య నేను కల్పించిన డైలాగు అనుచితం కాదు.

## పేరడీ అంటే

తెల్ల దొరతనానికి నల్ల దొరతనం ఒక పేరడీ. ఎంత గొప్ప సత్యావిష్కారం అది!

ఆకలి మంటలలో దహించుకుపోతున్న వాళ్లు అన్నం కనబడగానే ఎలా ఎగబడి లాక్కుతింటారో, వేల సంవత్సరాలుగా విజాతీయ పాలకులకు దాస్యం చేస్తున్న భారతీయులు అలానే ఎగబడి, స్వతంత్ర భారతిని పీక్కు తినసాగారు.

పేరడీకి ఇంత శక్తి వున్నదని గమనించి తదుపరి, ఆ మాటను గురించి ఆలోచించాను.

పేరడీ అనేది ఆంగ్ల పదం. ప్రసిద్ధమైన ఒక పూర్వ రచనను ఆక్షేపించే ఒక రచన. వక్రానుకరణను కూడా పేరడీ అనవచ్చు. ఒక ప్రసిద్ధ రచయిత రచనకు వంక పెట్టి వెక్కిరించడం పేరడీ. పులిని చూచి నక్క వాతలు పెట్టుకోవడం పేరడీయే.

తెల్ల దొరతనానికి నల్ల దొరతనం ఒక గుడ్డి అనుకరణ. ఒక పేరడి. కాళిదాసు వేషం కట్టిన నటుడికి కాళిదాసు అవార్డు ఇవ్వడం ఒక పెద్ద పేరడీ.

అనువాదాలు పేరడీలు కావు. అనుకరణలు మాత్రం నిజంగా పేరడీలే. ఒక మహా పురాణంలోని కథలను తీసుకొని కావ్యాలుగా వ్రాయడం పేరడీలు కావు. అందరి భావాలను దొంగిలిస్తే అవి పేరడీలు.

రామాయణానికి తెలుగులో సిసలైన అనువాదం లేదు. అనుకర్తల పేర్లతో అనేక రామాయణాలు వెలిసినై. అవన్నీ పేరడీలే.

అలాగే ప్రజాస్వామికంలో వ్యక్తి ఆరాధన ఒక నికృష్టమైన పేరడీ. వ్యక్తుల పేర్లతో వెలసిన రాజకీయ పార్టీలన్నీ పేరడీలే. అలా భాగ్యనగరానికి హైదరాబాదు పేరడీ. క్విట్ ఇండియా పోరాటంలో సాధించుకొన్న స్వాతంత్రాన్ని తిరిగి ''టేక్ ఇండియా'' అంటూ, ఆ దేశాలకు అమ్మివేయడం నిర్వీర్య జాతీయతా పేరడీ. ప్రతిభను అవమానించి పైరవీ సింహాసనమెక్కి, దోచుకొనే స్వార్థ విజయాలన్నీ పేరడీలే.

నిజానికి ఈ అధునిక భారతంలో మెజారిటీ ప్రజలకు బ్రతుకే ఒక పేరడీగా బ్రతుకుతున్నదంటే అది దురపిల్ల వలసిన పరమ సత్యం.

మహా భారత యుద్ధాన్ని అసత్యం జయించింది. రామాయణ యుద్ధాన్ని అధర్మం జయించింది. ఏ యుద్ధాలనైనా జయించేవి సత్యధర్మాలు కావు, వ్యూహాలు.

ప్రజాస్వామ్య ఎన్నికలలోని విజయాలకు రిగ్గింగులు పేరడీలు.

''అబద్ధం అడ గూడదు'' అని పిల్లవాడికి బోధిస్తూ, ''నా కోసం ఎవరైనా ఫోనుచేస్తే ఇంట్లో లేడని చెప్పు'' అని పురమాయించడం నిత్య వ్యవహారంలోనే కదా?

భారత పార్లమెంటులో సుమారు 550 మంది సభ్యులున్నారు. వాళ్లు దేశం మొత్తం మీద 550 నియోజక వర్గాల నుండి తిరిగి ఎన్నుకోబడడానికి తమ నియోజక వర్గ ప్రజల ప్రత్యేకాభిమానం కావలసిన వాళ్లే. ప్రతి ఒక్క సభ్యుడు తన నియోజక వర్గమే మొత్తం దేశం అనుకునేటంత స్వార్థం వుండేవాడే.

అట్టి పరిస్థితిలో ఒక నియోజక వర్గపు ప్రతినిధి మొత్తం దేశాన్ని ఏలా పాలించగలడు?

ప్రతి నియోజక వర్గంలోను ఏదో ఒక మైనారిటీ వర్గపు వోట్లు ఫలితాన్ని నిర్ణయిస్తూ వుంటాయి. అతడు మళ్ళీ మళ్ళీ ఎన్నిక కావాలంటే ఆ మైనారిటీని పోషించుకొంటూ రావాలి. మెజారిటీ ప్రయోజనాలను బలిపెడుతూ రావాలి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకే ఒక క్రూరమైన పేరడీ కాదా? దేశాన్ని పాలించేవాడు దేశంలోని అందరిచేత ఎన్నుకోబడాలి కదా?

## అనౌచిత్యాన్ని సహించలేను

నా చిన్నప్పటి నుంచి ఇప్పటి దాకా నన్ను వదలని ఒకే ఒక గుణం అనౌచిత్యాన్ని సహించలేకపోవడం. ఆత్మీయుడు, అభిమాని, శ్రేయోభిలాషి, యజమాని అనే విచక్షణ లేకుండా, వాళ్ల చర్యల్లో లోపాలు కనిపిస్తే నిస్సంకోచంగా వాటిని ఎత్తిచూపడం.

ఈ సూటిదనం కారణంగా నేను పోగొట్టుకొన్నది అపారం. అయినా అందుకు నేనెప్పుడూ విచారించలేదు.

ఆక్షేపణ, హేళన, విమర్శన నాకాలవాటయిందీ విధంగానే. నేను ఎదిగే కొలదీ ఈ గుణాలు కూడా నాలో ఎదుగుతూ వచ్చాయి. ఇందుకు ఒక ఉదాహరణ-

సరసాక్షర రమ్యంగా పద్యం వ్రాయడంలో నాకు ఆదర్శం బమ్మెరపోతన్నగారు. కొంతకాలం వరకు ఆయన రచనల్లో నాకెలాంటి లోపాలు కనిపించలేదు. ఔచిత్యం, హేతుబద్ధత ఇవి రెండూ సాహిత్యానికి రెండు ప్రాణ నాడులు నా దృష్టిలో.

ఈ దృష్టితో పరిశీలించినపుడు పోతన్నగారి పద్యాలు కొన్నిటిలో మహాఘోరమైన దోషాలు కనిపించినాయి. వాటిని దిద్దుకొని పాడుకోవడమో పేరడీలు వ్రాసుకోవడమో చెయ్యక తప్పలేదు.

పోతన్నగారి ఈ పద్యం చూడండి:

అమ్మలగన్న యమ్మ, ముగు
రమ్మల మూలపుటమ్మ, చాల
పెద్దమ్మ, సురారు లమ్మ, కడు
పారడి పెట్టెడి యమ్మ, తన్నులో
నమ్మిన వేల్పు టమ్మల మ
నమ్ముల నుండెడి యమ్మ, దుర్గ మా
యమ్మ

''చాల పెద్దమ్మ'' అనడం వరకు బాగానే వుంది. ''దుర్గమాయమ్మ'' దగ్గర నుంచి ముగింపూ బాగానే వుంది. ఆ మధ్యలోని రెండు వాక్యాలలో ఒకటి జాతి ద్వేష పూరితమూ, రెండోది స్వజన పక్షపాత దూషమూ కాదా?

పైగా అంతటి పెద్దమ్మ మరొక అమ్మ కడుపులో చిచ్చు పెట్టగలదని పోతన్న గారెలా అనుకొన్నారు? వేలుపుటమ్మలలో కూడా తనను నమ్మిన వారిని మాత్రమే రక్షిస్తుందా?

ఒక అమ్మ శిష్టుల్ని రక్షించవచ్చు, దుష్టుల్ని చంపవచ్చు. సురలకు శత్రువులైతే తనకేం? సుర అసుర ఉభయులకూ జగన్మాత మాతే కదా?

అందుకే ఆ రెండు వాక్యాలనూ నేను ఇలా మార్చి వ్రాసాను.

సురా సుర ప్రకృతి కంతకు జీవ ఘనమ్ము, తన్నులో
నమ్మిన లోకులందరి మనమ్ముల నేలెడి అమ్మ

ఈ విధంగా పరిశీలిస్తూ పోతే పోతన్నగారి చాల పద్యాలలో అనౌచిత్య దోషాలు కనిపిస్తై.

అంతేకాదు పూర్వ కవులందరిలోనూ అనౌచిత్య దోషాలు కనిపిస్తై. ఇక ఆధునికుల రచనలు కులాల వారీగా, వర్గాల వారీగా విభజించబడ్డ కాలనీలు. నిర్మాణాలన్నీ ఒకే అచ్చు. వైవిధ్యం కూడా వుండదు. నాకు తెలిసిన కొన్నిటికి మాత్రమే పేరడీలు వ్రాశాను. ఇందులో కీర్తనలు, సినిమా పాటలు, లలిత గేయాలు ఎన్నోవున్నై.

ఇందులో హాస్య ప్రధానమైన వెక్కిరింపులేకాక ఆక్షేపణలు, నిరసనలు, ఖండనలు, వ్యంగ్యాలు, ధ్వనులు వంటి వనేకం వుంటై. చేదుగా వున్నా కాకర కాయలు ఆరోగ్యకరాలే.

నా వృత్తి సాహితీ చికిత్స. ఇవి పేరడీలైనా సరస కవితలు గానే వ్రాశాను. ప్రజల నాలుకలపై నిత్యం నాట్యమాడే బాణీలను మాత్రమే ఎంచుకున్నాను. మూలాలు అందరికీ తెలిసినవే కనుక ప్రత్యేకంగా పేర్కొనలేదు.

''రామచంద్ర'' అంటే నా చిరకాల మిత్రుడైన స్వర్గీయ తిరుమల రామచంద్ర అనికూడ అనుకోవచ్చు. ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో 1945 నుండి 1955 వరకు కలిసి పనిచేసిన అతి సన్నిహితులం మేము.

## ఇంటి నుంచి ఆసుపత్రికి

భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంవత్సరం కదా ఇది! ఈ సంవత్సరం పొడవునా, 50 ఏళ్ళ స్వరాజ్యం అనే విషయంపై సభలూ, సమావేశాలూ, సమారోహాలూ వగైరా ఉత్సవాలు వేలం వెర్రిగా జరుగుతూ వున్నై. ఆర్గనైజర్లకు డబ్బు కూడా పుష్కలంగానే లభిస్తూ వున్నట్లు వుంది. విషయంలో వైవిధ్యం లేకపోయినా, ఈ యాభై ఏళ్ళలోనూ జరిగిన పురోగమనం గురించి కానీ, తిరోగమనం గురించి కానీ నిష్పక్షపాతంగా చర్చలు జరక్కపోయినా ఉత్సవాలు మాత్రం జరుగుతూనే వున్నై. ఊకదంపుడు ఉపన్యాసాలు సాగుతూనే వున్నై. ఎక్కడో వెనకబడివున్న సంస్థలు కూడా ముందుకి వచ్చి సభలు చేస్తూ వున్నై. నాలాంటి వాళ్ళను కూడా అప్పుడప్పుడూ అలాంటి సభలకు ఏదో స్థానం చూపి పిలుస్తూనూ వున్నై.

మద్రాసులో వుండే అలాంటి ఒక సంస్థ వారు ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమి నుంచి అనుజ్ఞ పొందామంటూ, హైదరాబాదులో ఒక సమావేశం ఏర్పాటుచేసి నన్ను ముఖ్య అతిథిగా పిల్చారు. అది 1998 జనవరి 18వ తేదీ. సభ మధ్యాహ్నం 11 గంటలకు ప్రారంభం. తీసుకువెళ్ళడానికి వస్తున్నామంటూ, సిద్ధంగా వుండమంటూ 10.30 గంటలకు ఫోను చేశారు. అలాగే నేను సిద్ధపడే ప్రయత్నంలో నిలబడి ప్యాంటు వేసుకొంటూ తూలి పడిపోయాను. ప్యాంటులో ఒక కాలు చిక్కుకుని వుండడంవల్ల సదురుకోడానికి వీలులేక అమాంతం కూలపడిపోయాను. తుంటి ప్రాంతం చుట్టూ నలిగి పోయింది. కమిలి పోయింది. నిజానికి వెన్ను విరగవలసింది. అయితే తుంటి చుట్టు సలుపు, బాధ తప్ప బొవికలు విరిగినట్లు కానీ, బెసిగినట్లు కానీ అనిపించలేదు. అలాగే 25వ తేది వరకు మంచం మీద పడివున్నాను.

నన్ను సభకు పిల్చిన వారు కారు తీసుకుని వచ్చి, అయ్యో అనుకుంటూ వెళ్ళి పోయారు. తర్వాత పరామర్శించే తీరిక కూడా వారికి లేక పోయింది.

అలాగే బాధపడుతూ, ఇక భరించలేక ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు గారికి ఫోను చేశాను. నేను డెత్ బెడ్ మీద నుంచి మాట్లాడుతున్నాననీ, నాకొక ఆర్థోపెడిక్ డాక్టర్ సహాయం అవసరమనీ, నాకు జరిగిన ప్రమాదం గురించి వివరించాను. ఆయన జోక్యంతోనూ, వైద్యశాఖ కార్యదర్శిగారి ప్రమేయంతోనూ జంటనగరాలలోని ప్రధాన ఆసుపత్రులన్నీ నాకు తమ సహాయం అందిస్తామంటూ ఫోన్లు చేశారు. గాంధీ ఆసుపత్రి నుంచి ఒక ఆర్థోపెడిక్ డాక్టరు సత్యగౌడ గారు అంబులెన్సుతో సహా వచ్చేశారు. ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మా ఇరంమంజిల్ కాలనీకి దగ్గరగా వుంటుందన్న కారణంగా నన్ను నిమ్స్‌లో చేర్పించారు. నిమ్స్ వారి ప్రత్యేక ఏర్పాట్లతో నేను అదే నెల 27వ తేదీన నిమ్స్ విఐపి వార్డులో మూడవ నెంబరు గదిలో చేరాను. ఆ గది మరీ పొడుగా వుండడంవల్ల 8వ నంబరు గదిలోకి మారాను.

నేను నిమ్స్‌కి వెళ్ళినపుడు నా కూడా చంద్రబాబు అనే విద్యార్థి, రవి చంద్ర అనే కంప్యూటర్ గ్రాఫిక్స్‌కి చెందిన ఒక విద్యార్థి, సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న వాణీపతి, అడ్వకేటు రమేష్, మా ఎదురింటి పిల్లవాడు శ్రావణ్, మా ఆవిడ హైమవతి వున్నారు. ఆ తర్వాత మా అమ్మాయి పల్లవి, అబ్బాయి డా. వర్మ, సెన్సెస్ డిపార్టుమెంటుకు చెందిన సన్నిహితులు రామకృష్ణ, మరియన్న కూడా వచ్చి కొంతసేపుండి వెళ్ళారు. ఆ రాత్రి నాకు సహాయంగా ఆసుపత్రిలో వున్నవారు చంద్రబాబు, రవిచంద్ర.

నేనుంటున్న ఇరంమంజిల్ దగ్గరగా వుంటుందన్న దొకటి తప్పితే నేను నిమ్స్‌లో చేరడానికి మరో కారణం ఏదీ లేదు. పైగా నిమ్స్‌లోని ఏర్పాట్ల పట్లా, చికిత్సా విధానాల పట్లా ప్రజలలో అంత మంచి అభిప్రాయం లేదు కూడా. అయితే నేను అంబులెన్సులో వెళ్ళి ఆసుపత్రిలో దిగిన దగ్గర నుంచీ కూడా, అన్నీ సమస్యలే ఎదుర్కోవలసి వచ్చింది. నిజానికి నేను ఆసుపత్రిలో వున్న నెల రోజుల పాటూ జరిగిన విశేషాలన్నీ చిత్రమైనట్టివీ, ఆసక్తిదాయకమైనట్టివీ, కొన్ని కొన్ని అపూర్వమైనట్టివీ. వీటన్నిటినీ నా శైలిలో వ్రాయాలంటే ఒక చక్కని అవార్డు పొందగల నవలే అవుతుంది. అది వేరే ప్రాజెక్టు. అందుకే ఇక్కడ వివరాలు ఇవ్వడం లేదు. ఒక యాభై, అరవై పేరడీలు ఒక చిన్న గ్రంథంగా

ప్రచురించాలనుకొంటున్న స్థితిలో నాకీ ప్రమాదం జరగడం చాల చిత్రమనిపించింది. పేరడీల వరకూ గతానుభవాలే. ఈ గ్రంథంలో కొత్త అనుభవాలు వుండాలన్న నిర్ణయంతోనే విధి నన్నీ ఆస్పత్రికి పంపిందేమో అనిపించడంలో వింత ఏమీ లేదు. మానవ మనస్తత్వ ప్రవృత్తి ఇది. దేవుడు లేడు పరమాత్మ వుంది అనే వాడికి విధి ఏమిటి అనుకోవద్దు. పరమాత్మలోని వైవిధ్యమే దాని జీవ ప్రవంతికి మూలభూతం. వైవిధ్యంలోని వివిధ శక్తుల ఘర్షణయే ప్రమాదాలకు గానీ, ప్రమోదాలకు గాని హేతువు. అదే విధి, దైవికం అనబడేది.

## ఆసుపత్రి అనుభవాలు

నన్ను ఎక్సరేల దగ్గర నుంచి ఎమర్జన్సీ వార్డుకు తెచ్చినప్పుడు అక్కడ ఒక మంచం మీదకి నలుగురు పట్టి ఎక్కించారు. 'అయ్యా! ఇదెక్కడ మంచం అండీ? మంచం అంటే కూర్చున్నప్పుడు కాళ్ళు నేలకు తగలాలి. ఇదేదో రాక్షస మంచం లాగుంది. నన్ను నలుగురు పట్టి ఎక్కించారు, దింపటానికి నలుగురు మనుషులు కావాలి కదా?' అన్నాను.

''ఇక్కడ మంచాలన్నీ ఇంత ఎత్తుగానే వుంటాయి'' అన్నారెవరో. ఆ మంచం మీద ఉంచే రెండు మూడు టెస్టులు ఏవో చేశారు. నాకు అక్కడి విషయాలు ఏమీ నచ్చక ఇంటికి వచ్చేయ్యాలనుకున్నాను గానీ వాళ్ళు వెంటనే మరొక ఫ్లోరులోని ఒక ప్రత్యేక గదికి పంపించారు. ఒక గంట పోయిన తర్వాత ఇంకొక ఫ్లోరులోని వి.ఐ.పి. రూము నెం.3కి చేర్చారు. ఆ రూము రూపాన్ని వర్ణించడం కష్టం. ఎందుకంటే దానికి ఏ రూపమూ లేదు కనుక. అక్కడా ఒక రాక్షస మంచం, రోగి సహాయుల కోసం ఒక మామూలు (దివాన్) మంచం, ఒక చిన్న టేబులూ వున్నై. నేను దివాన్ మీద కూర్చున్నాను. పెద్ద మంచాన్ని చంద్రబాబు, రవిచంద్రలకు వదిలేశాను. మరునాటికి ఎక్సరేలు వచ్చాయి. అందులో నాకు తగిలిన దెబ్బ సంగతులేవీలేవట. ''ఎముకకూ కండకూ నడుమ వుండే పొర నలిగి వుండవచ్చు'' అన్నారు ఒక యువ ఆర్థోపెడిక్ డ్యాక్టరు జయభారత రెడ్డిగారు. అదే నిజం కావచ్చు అనుకున్నాను. అవసరమైన టెస్టులన్నీ

చేయవలసిందిగా కోరాను. ఆ సాయంత్రమే స్కానింగ్‌కు ఏర్పాటుచేశారు. మూడో రోజున స్కానింగు ఫలితం వచ్చింది. వెన్నెముక చివరిలోని పూసలలోను మొదటి పూసకు చేరివుండే ఎడమవైపు ఎముక వంగినదనీ అది సరికావడానికి పూర్తి బెడ్‌రెస్టు అవసరమనీ చెప్పారు. అది సరికావడానికి కనీసం 3 వారాలు పడుతుందట. ఆస్వాదనలూ, విసర్జనలూ అన్నీ వెల్లకిలా పరుండే జరపాలట. కదలకూడదట.

మూడు వారాలు కాదు కదా మూడు రోజులు కూడా ఆ రూములో వుండలేని దుస్థితి. మూడవ రోజున మరొక రూములోకి మారే ప్రయత్నం చేస్తున్నప్పుడు, ఆ సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావుగారు వచ్చారు. చిన్న మంచం మీద నా పక్కనే కూర్చున్నారు. అప్పటికి నా రూములో ఉన్న నలుగురైదుగురు విజిటర్లలో జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు ఒకరు. మాధవరావుగారు ఒక అరగంటకు పైగా కబుర్లు చెబుతూ కూర్చున్నారు. అక్కడ చేరిన డాక్టర్లకు, నర్సులకు నాగురించి చెప్పారు. ''మా బావగార్ని జాగ్రత్తగా చూసుకోండి'' అన్నారు. ఈ చిన్న మంచం మరీ ఇరుకుగా ఉన్నదనీ, అవసరమైతే రెండు మంచాలు కలిపి వెయ్యమనీ, అందుకు తగిన మరొక రూములోకి మార్చమనీ సలహా యిచ్చారు.

తనకు అందుబాటులో కనిపిస్తున్న ఒక కాగితాన్ని అందుకుని, దానిపై అంతకు ముందే నేను చెప్పగా మా పల్లవి రాసిన ఒక పద్యాన్ని చూస్తూ ''పద్యం చాలా బాగున్నదే'' అన్నారు మాధవరావుగారు. అదేదో పైకి చదవమన్నారు పున్నయ్యగారూ, విజిటర్లూను. అది నా నోటికి వచ్చును గనుక నేనే పైకి చదివాను.

''జలజాతాసన వాసవాది'' – అనే ముక్కు తిమ్మన్నగారి పారిజాతాపహరణ పద్యానికి నేను రాసిన పేరడీ. ఇక్కడ పేరడీ అంటే అధిక్షేపణ కాదు, అభినందన.

నేను పూర్వ కవుల కొన్ని కొన్ని పద్యాలకు, కీర్తనలకు, సినిమా పాటలకు అనౌచిత్యాలను పరిహరిస్తూ పేరడీలను, విమర్శలను వ్రాస్తున్నాను. కొన్ని మంచి పద్యాలకు ఆధునికాలను వ్రాయాలనే సంకల్పం నాకు చాలా కాలంగా వుంది. ఈ మధ్యనే దానిని కార్య రూపంలో పెట్టడానికి పూనుకున్నాను. అందులోదే ఈ పద్యం కూడ.

## నిత్య సత్య పద్యాలు

అయితే, నాలుగు వారాల పాటి మా ఆసుపత్రి అనుభవాలు, పేరడీలను మైనారిటీగా మార్చేసి, నా సొంత అనుభవ పద్యాలను బాగా మెజారిటీగా మార్చేయడం జరిగింది. ఇందుకు పున్నయ్యగారి దైనందిన ప్రోత్సాహం బాగా తోడ్పడింది.

నేను వెల్లకిలా పడుకొని ఉండి, తేనెటీగల్లా ముసురుకుంటున్న అనుభవాలు తేనె బిందువుల వంటి పద్యాలుగా మారుతున్నప్పుడు, కాగితం పైకెత్తి వ్రాయవలసి వచ్చేది. పైకి పట్టుకొని వ్రాస్తే పెన్నులు వ్రాయవు. పెన్సిలుతో వ్రాయవలసి వచ్చేది. వ్రాసిన తరువాత అవి నాకే తెలిసేవి కావు. అట్టి స్థితిలో నాకు సహాయకులుగా ఉండే కుర్రవాళ్ళు తోడ్పడు తూండేవారు. ముఖ్యంగా పొన్నాడ రవిచంద్ర ఎక్కువ ఆసక్తి కనబరచి ఈ పద్యాలన్నిటినీ సాపు రాసుకొని, తన మిత్రుల ప్రెస్సులో ఇస్తూ వచ్చాడు. అవి ఎప్పటికప్పుడు ప్రింటు అవుతూ వచ్చాయి.

ఈ గ్రంథాన్ని తాను అంకితం తీసుకోగలననీ ముద్రణ ఖర్చుల విషయంలో బెంగ పెట్టుకోవద్దనీ డా. ఎస్.ఎన్.బూసిగారు అన్నారు. ఆయన సతీసమేతంగా ఆసుపత్రికి వచ్చినప్పుడు ఈ మాట చెప్పారు. ఈ విషయంలో జస్టిస్ పున్నయ్యగారి ప్రయత్నం చాలా వున్నదని పించింది. ఎందుకంటే నా గ్రంథాల ముద్రణ విషయంలో నాకంటే ఎక్కువ ఆసక్తిని పున్నయ్యగారు కొంతకాలంగా కనబరుస్తూ వస్తున్నారు. కనుక చూస్తూ చూస్తూనే ప్రెస్సుకు వెళుతున్న పద్యాలు మితిమీరుతూ వుండటంవల్ల నేనే వాటికి ఒక పరిధిని, ఒక పరిమితిని నిర్ణయించుకోవలసి వచ్చింది. అప్పుడొక పద్యం ఇలా చెప్పాను.

లేదు గతము, భవిష్యత్తు లేదు నాకు
నాకు గల వర్తమానము నాల్గు నెలలు

దీనితో ఈ కావ్య సంపుటి పేరు ''నాల్గు నెలల నా వర్తమానం'' అంటూ మార్చేశాను. భీమన్న పేరడీలు అనే పేరు చిన్నదైపోయి, ఈ పేరే పెద్దదైంది.

దీనితో నా కావ్య పరిధిని జనవరి 18 మొదలు మే 18 వరకు కుదించానన్న మాట. ఈ నాల్గు నెలల వ్యవధిలోని నా జీవితానుభవాలే ఈ గ్రంథంలో వుంటాయన్నమాట. నేను తూలిపడ్డ గాయంతో ఆసుపత్రిలోనూ ఇంటిలోను నేను తీసుకొన్న పూర్తి బెడ్‌రెస్టు కాలం ఇది.

ఇక్కడొక విషయం చెప్పాలి. పద్యాల సంఖ్య పెరిగిపోతున్నదనీ అందులో నెల్లికంటె పొల్లు ఎక్కువవుతున్నదనీ మా ఆవిడ హైమవతి విమర్శించ సాగింది. అప్పుడీ పద్యం చెప్పాను.

ఈ రచన ఇంత పెరిగిన కారణమ్ము
అదను కందిన పోషకాహార బలమె
కన్న వారలు పెంచ లేకున్న గాని
పెంచువా రున్న వారైన పెరగకేమి?

ఇంత ధైర్యంగా ఈ పద్యాన్ని చెప్పగలిగానంటే, అదనుకు పోషకాహారాన్ని అందజేసిన డా.ఎస్.ఎన్.బూసి గారి ఔదార్యమే అందుకు కారణం. అలా పెరుగుతూ వచ్చిందీ గ్రంథం.

## నాలుగు నెలల వర్తమానం

ఈ నాలుగు నెలల్లోనూ నా సన్నిహితులు ఎందరో పోయారు. నాకు ఏదో సహాయం చేస్తామని, ఏ తైలమో తెస్తామని వెళ్ళిన వాళ్ళు చాలా మంది తిరిగి రాలేదు. తెలిసిన పాతవాళ్ళు వంచించారు. తెలియని కొత్తవాళ్ళు సహకరించారు. ఎన్నో అనుభవాలు. విచిత్ర సంఘటనలు. ముసలితనం, ఒక సారిగా నాపై విరుచుకు పడ్డట్టైంది. ఇదంతా పద్యాలలో వ్రాయడం అపూర్వం అన్నారు సి.నా.రె. ఆ సమయంలో నాకు వచనం కంటే పద్యాలే ధారాళంగా వచ్చిపడ్డెమరి.

నేను నిమ్స్‌లో చేరిన రెండవ రోజునే, జనవరి 28న నన్ను చూడడానికి వచ్చిన డాక్టర్లలో ఒకరు.

''రోజులు బాగులేక పడిపోయారు'' అన్నారు.

''కాదు, రోజులు బాగుండే పడిపోయాను'' అన్నాను. విస్తుపోయారక్కడి వాళ్ళు. ఏది జరిగినా మంచి కోసమే అనుకొనే మనస్తత్వం కలవాణ్ణినీ, నాకు బాధ కలిగినా, మరెవరికైనా మంచి జరిగే వీలుండవచ్చుననీ అన్నాను. నేనక్కడ వున్నన్ని నాళ్ళు ఆసుపత్రి నిర్వహణ లోని లోపాలను ఎత్తి చూపుతూ అభివృద్ధికి సూచనలను చేస్తూ వచ్చాను.

డాక్టర్లలో చాలా మంది నన్నెరిగిన వాళ్ళే. మొత్తం ఆసుపత్రికే ఆపరేటరు అనదగిన వాడు డా. శాంతారామ్. వైద్య శాస్త్రానికి సంబంధించి, ఏ చిన్న విషయం మీదనైనా గంభీరంగా ఉపన్యసించగల సామర్థ్యం గలవాడు. "GOD THE DRUG" అనే నా ఆంగ్ల కవితా గ్రంథాన్ని చదివి ఎంతగానో అభినందించాడు. ప్రతిరోజూ నా వద్దకు వచ్చి పరామర్శించి అనేక విషయాలపై చర్చిస్తూ వుండేవాడు. ఆయన ఆసుపత్రికే ఒక అస్సెట్ అనవచ్చు. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నాకు తరచూ మా చిరకాల మిత్రుడు డా. రఘునందన్ రాజ్ జ్ఞాపకం వచ్చేవాడు. చికిత్సతోపాటు ఆధ్యాత్మికతను చేర్చగలమేధావి ఆయన. ఈ ఆసుపత్రికి నాకు సంబంధించినంతవరకు నాకు నచ్చిన విషయం ముఖ్యమైనదీ ఒకటుంది. నాకేసు బొక్కలకు (ఆర్థోపెడిక్సు) సంబంధించింది. ఎక్సరేలలో కనిపించక పోతే స్కానింగులో కనిపించిందట. వెన్నెముక తుంటి భాగంలోని బొక్క వొంగిపోయిందట. దానికి చికిత్స చేయకపోగా, నన్ను న్యూరాలజీ డాక్టరు కృష్ణారెడ్డిగారి ఆధీనంలో వుంచారు. అలా ఎందుకు చేశారో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. నాది బొక్కల కేసు. ఆయన నరాల డాక్టరు. ఆయన మంచివాడే, గొప్ప డాక్టరే. నన్ను పూర్తి బెడ్ రెస్టులో ఉంచడంకన్నా మరింకేం చెయ్యగలడు? నోరు మూసికొని పడి వుండడం తప్ప నేను మాత్రం చేసేదేముంది?

బొక్కలకు సంబంధించిన జూనియర్ డాక్టరు అంతకుముందు ఒకసారి చూసి వెళ్ళాడు అంతే. నేనేమడిగినా సమాధానం చెప్పిన డాక్టర్లే లేరు. వాళ్ళ సమాధానం ఒక్కటే "Time is your Doctor, Bed Rest is your Treatment" అంతే.

# హిప్నాటిజం - గత జన్మలు

నేను ఆసుపత్రిలో చేరిన మూడవ రోజున బెడ్ రెస్టులో పెట్టబడ్డ మొదటి రోజున మరొక రూమ్‌లోకి మారే ప్రయత్నం చేశాను. వి.ఐ.పి. రూములు పది ఉన్నై. ఏ రూమ్ అయినా ఖాళీగా ఉన్నదేమో అని వెతకడానికి వెళ్ళిన ఒక కొత్త మిత్రుడు అడపా గణేశ్ కుమార్, ఒక యువ డాక్టర్ని పట్టుకువచ్చాడు. ఆ డాక్టరు పేరు న్యూటన్. మరేదో మంచి పేరు వుందిగానీ (మోహన వంశీకృష్ణ), న్యూటన్‌గానే ఆయన ప్రసిద్ధి. ఆయనొక మంచి హిప్నాటిస్టు. ఆ తర్వాత నా 'GOD THE DRUG' చదివి, ప్రభావితుడై నాకు ఆత్మీయుడైన వాడు. గత జన్మల గురించి ఆయన చేసిన పరిశోధనలకు నా జవాబు చక్కగా సరిపోయినందువల్ల ఆయన నాకు ఒక శాశ్వత మిత్రుడైనాడు.

వాస్తవ సంఘటనలకు వలెనే కలలను ఆలోచనలను, ఊహలను, ఆశయాలను కూడ మెదడు రికార్డు చేసుకుంటుందనీ, హిప్నాటిజం ద్వారా ట్రాన్సులోకి పంపబడిన వ్యక్తి అట్టి రికార్డులన్నింటిని సొంత అనుభవాలుగానే పేర్కొంటాడనీ నేను వివరించాను. అంతే తప్ప గత జన్మలనేవి లేవనీ, మృత్యువు లయకారకమనీ, లయ తర్వాత మరేమీ ఉండదనీ పేర్కొన్నాను. కొంత చర్చ తరువాత ఆయన నాతో పూర్తిగా ఏకీభవించాడు. ఈ గ్రంథంలోని "గత జన్మలు" అనే కవిత అలా పుట్టిందే.

నేను మూడవ నెంబర్ రూము నుంచి 8వ నెంబరు రూమ్‌లోకి మారడానికి డాక్టర్ న్యూటన్ సహాయపడ్డాడు.

నాకు మూడు వారాలలో నయమౌతుందన్నారు. ఆలోగా మరొక ప్రధానమైన స్కానింగు జరిపారు. దాని ఫలితాలు ఏమిటో ఎవరూ చెప్పలేదు.

నిమ్స్ డైరెక్టరు డాక్టర్ కాకర్ల సుబ్బారావుగారు. ఆయన అంతర్జాతీయ ఖ్యాతి గల గొప్ప రేడియాలజిస్టు. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ వుండే గంభీరమూర్తి. ఆయన ప్రతిరోజూ వచ్చి, నా యోగ క్షేమాలు కనుక్కొని వెళ్తుండే వారు. అయినా నాకు ట్రీట్‌మెంటు అనేది ఏమీ జరగలేదు. తాను టూరు వెళ్తున్నాననీ, ఈలోగా ఈ పుస్తకం

చదవమని 'జ్వర తరంగిణి' అనే కావ్యాన్ని యిచ్చారాయన. అది దుత్తా బాబూ రావుగారి రచన. ఒక వ్యాధి చరిత్ర.

ఈలోగా ఒక రోజున అనుకోని విధంగా నాకొక కుమార్తె లభించింది. ఆవిడ పేరు డాక్టర్ రూత్ ఏంజల్. నిమ్స్‌లో సైకియాట్రిస్ట్. తన డ్యూటీ ప్రకారం నన్ను చూడడానికి వచ్చి, క్షణంసేపు నిలబడి చూసి 'అయ్యో డాడీ!' అంటూ నా పక్కన కూర్చుంది. వాళ్ళ డాడీ (తండ్రి) అచ్చం నాలాగే ఉండే వాడట. సఖినేటిపల్లి హైస్కూలులో టీచరుగా పనిచేసాడట. తమది నర్సాపురం అట. అన్ని వివరాలూ చెప్పి, ఇక నుండి నన్ను డాడీ అనే పిలుస్తానన్నది. నాలో అనారోగ్యం ఏదీ లేదన్నది. ఎంతో విజ్ఞత, సమయజ్ఞతతో కూడిన పరమౌషధీయ సంభాషణతో నన్నెంతో ఉత్తేజపరిచింది. ఉపశమనం కలిగించింది. తరువాత ప్రతి రోజూ వచ్చేది. నేను యింటికి వచ్చిన తదుపరి కూడ ఫోనులో పరామర్శిస్తున్నది. ఒకసారి వచ్చి చూచి వెళ్ళింది. నిమ్స్‌లో ఉపయోగకరమైందేదీ జరక్కపోయినా, అక్కడ నాకు లభించిన అపూర్వ రత్నాలు రెండు. ఒకరు డాక్టరు న్యూటన్, మరొకరు డాక్టర్ ఏంజల్.

"మీ మనస్సును వెల్డింగ్ నీడిల్‌గా మార్చుకోగలిగితే దానితో దెబ్బ తిన్న మీ తుంటి ఎముకలను వెల్డింగు చేసేయ్యవచ్చు కదా!" అన్నారు డా. న్యూటన్ లోగడ ఒకసారి నాతో మాట్లాడుతూ.

అప్పుడు నేనన్నాను...

"డాక్టరు గారు! నా మనస్సు సంగతి మీకు తెలియదు. అది నా మాట అస్సలు వినదు. నాకు ఊహతెలిసినప్పటి నుంచి ఏకాగ్రత కోసం నేను చెయ్యని ప్రయత్నాలు లేవు. చెయ్యని ప్రయోగాలు లేవు. అయినా సాధ్యం కాలేదు. అది నా మాట ఎప్పుడూ వినలేదు. దానిని కుక్కను, గొర్రెను, గాడిదను మొదలైన సాధు జంతువులనువలె

మచ్చిక చేసుకోవాలను కున్నాను. కనీసం పంజరంలో, బోనులో పెట్టి బంధించాలను కున్నాను. లాభం లేకపోయింది. అదెప్పుడూ అడవి మృగం లాగే ఇష్టం వచ్చినట్టు లోకాలోకాలన్నీ తిరుగుతూ వుంటుంది. ఏవేవో రకరకాల వూహా మధువుల్ని తెచ్చి నా మస్తిష్కంలో కూడబెడుతుంది. అందులో నుండి కొంచెం కొంచెంగా సంగ్రహిస్తున్నట్టివే ఈ కావ్యాలు.

అందువల్లనే నా మనస్సు విననందుకు నేనెప్పుడూ విచారపడలేదు. అందుకే నేనెప్పుడు ఒక పరికరంగా వాడుకోడానికి ప్రయత్నించలేదు. "అది నా నౌకరు కాదు".

"మీరు హిప్నటిస్టు కదా! ఆ పని మీరు చెయ్యవచ్చు" అన్నాను.

"అందుకు మీరు సహకరించాలి కదా" అన్నాడు ఆయన.

## "నేను అంటే నా మనస్సే కదా" అన్నాను నేను.

నన్ను తన డాడీగా దత్తత చేసుకొన్న డా. రూత్ ఏంజల్ ఒకసారి అన్నది – మానవ మస్తిష్కంలో నాలుగు భాగాలుంటాయట. 1. Thinking, 2. Feeling, 3. Behaviour, 4. Cognition.

మొదటి మూడూ సాధారణ మైనట్టివి. మొత్తం మీద మానవులందరూ ఆ మూడు స్థాయిలలోనే తమ జీవితాలను గడుపుకొంటూ వుంటారు. నాలుగవది మహా మేధావుల, ప్రవక్తల స్థాయి. "మీరు ఆ స్థాయిలోని వారు, డాడీ!" అన్నది.

ఇటువంటివన్నీ ఎప్పుడెప్పుడో, ఎక్కడెక్కడో నేను చదువుతూ వస్తున్నట్టివే. అయితే ఈ వాస్తవాన్ని నేను అతి సన్నిహితంగా అనుభూతి పొందింది, నాకు నిమ్స్‌లో దొరికిన ఈ పెద్దమ్మాయి నా మీద చేయివేసి చెబుతున్నప్పుడే.

బెడ్ రెస్టులో నాలుగు వారాల వరకూ చూసి, చికిత్స అనేది ఏమీ లేకపోవడంవల్ల తుంటిలోని గాయం మానకపోవడంవల్ల అదేవిధమైన బెడ్ రెస్టు యింటిలో కూడ

తీసుకోవచ్చున్న వాస్తవాన్ని గుర్తించి నాలుగు వారాల అనంతరం నిమ్స్ నుంచి యింటికి వచ్చేసాను. జనవరి 27న ఇంటి నుంచి అంబులెన్సులో కూర్చుని వెళ్ళాను. ఫిబ్రవరి 23న నిమ్స్ నుంచి ఇంటికి అదే అంబులెన్సులో స్ట్రెక్చర్ మీద పడుకొని వచ్చాను. ఆసుపత్రిలో ఉండగా అక్కడ నాకు సన్నిహితులైన అనేక మందికి, నిత్యమూ నన్ను చూడటానికి వచ్చిన అనేక మందికి, నాకు సేవలందించిన అనేక మందికి నేను సర్వదా కృతజ్ఞుడ్ని. అందులో కొందరి గురించి పద్యాలు కూడ రాశాను. వాటిని ఈ గ్రంథంలో చూడవచ్చు. వ్యక్తుల గురించి మంచిగా చెప్పవలసిన విషయాలున్నప్పుడే వారి పేర్లు రాస్తాను. చెడును జ్ఞాపకం పెట్టుకోను.

ఇంటికి వచ్చిన తర్వాత కూడా అదే పూర్తి బెడ్‌రెస్టు మరొక ఆరువారాల పాటు కొనసాగించాను. ఆసుపత్రిలో రవిచంద్ర, నర్సులూ, ఆయాలూ, వార్డుబోయ్‌లూ చేస్తూ ఉండిన సేవలన్నీ యింటి దగ్గర మా ఆవిడ హైమవతి, మా అమ్మాయి పల్లవీ చేస్తూవచ్చారు. ఈ గ్రంథంలోని అనేక పద్యాలు వాళ్ళ నుంచి కలిగిన అనుభవయోగాలే.

ఇంటికి వచ్చిన తరువాత బెడ్‌రెస్టును పాటిస్తూనే పద్యాలు రాస్తూనే చిరకాల మిత్రులు డాక్టర్ మిత్రాగారితో ఆక్యుపంచర్ చేయించాను. ఆయన సహజంగా దేనినీ సీరియస్‌గా తీసుకోడు. లేచి కూర్చోమన్నాడు, నడిచెయ్యమన్నాడు. కంప్రెషన్ తప్ప మరేమీ లేదన్నాడు. ఆయన సూచనలు నేనంతగా పట్టించుకోలేదు గాని లేచి కూర్చున్నాను. క్రమంగా నిలబడ్డాను. కొద్ది కొద్దిగా నడవసాగాను. గాయము నొప్పి అలాగే వుంది. అయినా ఇంట్లో నే నడవగలుగుతున్నాను. నా పనులు నేను స్వయంగా చేసుకుంటున్నాను.

జనవరి 18 నుండి మే 18 వరకు నాల్గు నెలల నా బెడ్ రెస్టు జీవితాన్ని ఒక చట్రంలో బిగించి, ఈ గ్రంథంలోని అనుభవాలను ఆ నాలుగు నెలలకే పరిమితం చేసాను. "నాల్గు నెలల నా వర్తమానం" అనే శీర్షికను ఈ గ్రంథానికి పెట్టాలనుకున్నాను.

అయితే చివరి నిముషంలో ఆ శీర్షికను కొట్టేసి

"చివరి మెట్టు మీది శివుడు" అనే శీర్షికతో ఇప్పుడీ గ్రంథాన్ని ప్రకటిస్తున్నాను.

# ఆది జాంబవుడు

"భారత జాతికి జాతీయ ఆధ్యాత్మిక సంపదనంతా ఇచ్చినవాడు, వేద విభజన చేసినవాడు, అష్టాదశ పురాణాలను, ఉపనిషత్తులను, వ్రాసి జాతిని ఉత్తేజ పరచినవాడూ అయిన వేద వ్యాసుడు, ఈ పెద్ద మాదిగ వాడే కదా" అని మీరు రాగ వాశిష్టం నాటకం పీఠికలో వ్రాసారంట. ఆ పెద్ద మాదిగ వాడే ఆది జాంబవుడు, అతడే చిందు కళకు మూల పురుషుడు, సంగీతానికి ఆది పురుషుడు, అతని గురించే ఇప్పుడు పరిశోధనకు పూనుకొన్నాం." అంటూ చెప్పుకుపోయాడు అందెశ్రీ మొన్న నన్ను చూడటానికి వచ్చి.

అందెశ్రీ గొప్ప భావుకుడు, వాగ్గేయకారుడు. ఎంత గొప్పగా వ్రాస్తాడో అంత ఉన్నత సంగీత సరళిలో పాడతాడు. రెండు పాటలు పాడాడు. పంచభూతాలు గురించిన పాట, గద్దరు గురించిన పాట నన్ను ముగ్ధుడ్ని చేశాయి.

ఈ గ్రంథములోని ఎవడు దళితుడు అనే నా పాటలో ఆది జాంబవుడెవ్వడు అనే ప్రశ్న కూడా ఉన్నది. మతంగుడు, ధర్మవ్యాధుడు ఈ ఇద్దరూ హరిజనులకు మూలపురుషు లన్న నా ఉద్దేశ్యాన్ని రాగ వాశిష్టంలోను, జన్మాంతర వైరం కావ్యంలోను నేను విపులంగా చెప్పి ఉన్నాను.

ఆది జాంబవుడి గురించి నేను ఆలోచించలేదు. ఆది జాంబవ పురాణం అనేది ఒకటి ఉన్నదని, ఒక ప్రత్యేక కులం కథకులు ఆ పురాణాన్ని రకరకాల జానపద బాణీలలో చెపుతూ ఉంటారని ఎంతో మంది మిత్రులు చెప్పగా విన్నాను. చిందు ప్రదర్శనను కూడా నేను చూడలేదు. అట్టి అవకాశం నాకు కలుగలేదు.

అందెశ్రీ వెళ్లిపోయిన తరువాత నక్కా అమ్మయ్య వచ్చాడు. చిందు గురించి తనకు తెలుసునన్నాడు.

"చిన్నకత్తి పెద్దకత్తి నాదేనయ్యా
చిందేసే మాదిగోడ్ని నేనేనయ్యా"

అంటూ ఈ చిందు ప్రదర్శనను ఎంతో మధుర మనోహరంగా సాగిస్తారట. నక్కా అమ్మయ్య అందమైన పద్యాలు రాసే కవి. తాను వచ్చినప్పుడల్లా ఇలాంటి సాంస్కృతిక విషయాలేవో చర్చిస్తూ ఉంటాము. చిందు కళలో మాదిగలు ప్రవీణులైతే

నేత కళలో మాలలు ప్రసిద్ధులని, ''సాలినేత పలచన, మాలనేత చిక్కన'' అనే సామెత ఉందని నక్కా అమ్మయ్య అన్నాడు.

భారతదేశానికి భాగవత కాలంనాటి పేరు అజనాభం అయితే, అంతకు పూర్వముండే పేరు జంబూ ద్వీపం. జంబూద్వీపంలో వుండే వారు జాంబవులు. జాంబవులు అంటే భారతీయులన్నమాట. మనకు రామాయణ కాలం నాడు జాంబవంతుని గురించి, మహా భారత కాలం నాడు జాంబవతి గురించి తెలుసు. జాంబవ జాతి గురించి వేదాలలోను, సంస్కృత గ్రంథాలలోను ఏమైనా వున్నదేమో తెలియదు. ఈ విషయంలో పరిశోధనలు జరిగినట్లు కూడా తెలియదు. భారతజాతి గత చరిత్రను గురించి పట్టించుకున్నవాడు లేడు. ఇప్పుడు పట్టించుకుంటున్నవాళ్లూ లేరు.

మొదటి అస్పృశ్యుడు చెండుడు మతంగుడు అనే సత్యాన్ని వాల్మీకి, వ్యాసుడు బయట పెట్టినప్పటి నుంచి అస్పృశ్యులలో తెలివైన వాళ్లు తమ మూలపురుషుల్ని గురించి ఆలోచిం చటం మొదలుపెట్టినట్టున్నారు. తాము జాంబవజాతి వాళ్లు కనుక, అస్పృశ్యత అప్పటి నుంచీ వున్నదేమోననుకొని, తాము ఆది జాంబవులం అనుకున్నారు. ఈనాటి ఆది ఆంధ్ర, ఆది హిందు పేర్ల వంటిదే బహుశా ఆది జాంబవ కూడా కావచ్చు. ఇది నా ఊహ మాత్రమే. వాస్తవాలపై ఆధారపడినట్టిది.

భరత మహా చక్రవర్తి పాలించిన భూమి కనుక భారత భూమి అయింది. అనాది నుంచి ఈ భూమి పేరు జంబు, ఈ జాతి పేరు జాంబవజాతి, ప్రజలు జాంబవులు. ఇంత వరకు నిర్వివాదమే.

నా పరిశోధన ప్రకారం హిమాలయ ప్రాంతవాసియైన శివుడు హరిజనుడే, శివుడే ఆది జాంబవుడంటున్నారు కొందరు మిత్రులు. చిందు నృత్యానికి మూలపురుషుడు శివుడే కదా! అంటే, ''చిందేసే మాదిగోడ్ని నేనే కదా''! అనే గేయపాదం సత్యమే చెబుతుందన్నమాట.

శివుడు గిరిజన కన్యను (పార్వతిని) పెండ్లాడటం మతంగ ధర్మవ్యాధుల వియ్యానికి సాంప్రదాయకంగానే వున్నది కూడా! ఈ విషయంలో నిశితమైన పరిశోధన జరగవలసి వుంది.

# అంకితం గురించి

1969లో హరిజనోద్ధరణ కోసం దిట్టమైన యువకులకు ఒక (Militant Organisation) అవసరం అన్న భావనతో ''భీమసేన''ను ఏర్పాటు చేసాము. ఈ ఏర్పాటు చెయ్యడంలో ప్రముఖుడూ, ఈ సేనకు నన్ను సేనాధిపతిగా చేసిన వాడూ, మిత్రుడు యమ్.యన్.బూసి. అంటే బూసి మాచరయ్య. టెలిఫోన్స్ శాఖలో ఒక అధికారిగా ఉంటూ, దానికి రిజైను చేసి పూర్తిగా సాంఘిక సేవకు జీవితాన్ని అంకితం చేసుకున్నవాడాయన. ఆనాటి నుంచీ, మధ్య మధ్య ఎన్నో ఎడబాట్లు ఏర్పడినా, యమ్.యన్.బూసితో నా మైత్రి కొనసాగుతూనే వచ్చింది. వాళ్ళ ఇంటి పేరు బూసి. ఈ బూసి అనేది ''భూషి'' అనే పదానికి తెలుగై ఉంటుందని, అందుచేత భూషి అనే వ్రాసుకోమని నేను తరచూ చెపుతూ ఉండేవాడిని. సందర్భం వచ్చినపుడు నా గ్రంథాలలో భూషి అనే వ్రాసేవాడిని. ఇప్పటికీ అలానే వ్రాస్తున్నాను కూడా.

ఈ యమ్.యన్.బూసి గారి తమ్ముడే, ఈ గ్రంథాన్ని అంకితం తీసుకుంటున్న సాహితీ పోషకుడు ఈ Dr. S.N.Busi. వీరు నలుగురు సోదరులు. సత్యం, గన్నెయ్య, మాచరయ్య, సుభామణి. పేరుతోపాటు తండ్రి పేరును కూడా చేర్చుకునే సాంప్రదాయాన్ని అనుసరించి ఈ నలుగురు సోదరులు తమ పేర్లకు తండ్రిగారు పేరు చేర్చుకుని, ఇంటి పేరును చివర ఉంచుకుని వ్రాసుకుంటూ వుంటారు.

వీరి తండ్రిగారు నాగన్నగారు, తల్లిగారు చిత్తమ్మగారు. ఈ దంపతులు నలుగురు కొడుకులను విద్యావంతుల్ని చేయడానికి అన్ని కష్టాలను భరించి సఫలీ కృతులైన వారు. అందులో అత్యున్నత శిఖరాలకు ఎదిగినవాడు మన డా. సుభామణి నాగన్న బూసి.

పినమళ్ళ గ్రామం గౌతమీ గోదావరికి ఎడమ గట్టున ఆలమూరు మండలంలో ఉంది. ధవళేశ్వరం వద్ద గౌతమి గాను, వశిష్టగాను, చీలిపోయిన గోదావరి మీద రెండు వంతెనలు కట్టబడ్డాయి. ఆలమూరు నుంచి రావులపాలెం వరకు గౌతమి మీద నిర్మించబడ్డ వంతెనలివి. గౌతమి ఎడమ తీరంలోనే ద్రాక్షారామం, కోటిపల్లి ఉన్నవి. ఈ గౌతమి యానాం దగ్గర సముద్రంలో కలుస్తుంది.

గోదావరి కాలువలు ప్రవహించినంత మేర గోదావరి డెల్టాగానే చెప్పుకొంటారు.

కోనసీమ సెంట్రల్ డెల్టా అయితే ఈ గౌతమి ఎడమవైపు అంతా తూర్పు డెల్టా. అందుకే వివరాలలోకి పోకుండా పినపళ్ళను కోనసీమగా పేర్కొన్నాను. మొత్తం మీద ఆ ప్రాంతం అంతా పూర్వ కాలంలో ఋషి వాటికలతోను మునిపల్లెలతోను నిండి ఉండేది. అగస్త్యుడు, వేదవ్యాసుడు మొదలైన పూర్వ ఋషులు తమ వృద్ధాప్యాన్ని ఈ ప్రాంతంలోనే గడిపి ఇక్కడే నిర్యాణం చెందారు.

అంతటి పవిత్ర భూమిలో పుట్టిన మేధావి, విద్యావేత్త, వదాన్యుడు, ప్రజాసేవాతత్పరుడు, ఈ కృతి భర్త డా. ఎస్.ఎన్.బూసి.

## ఒక పద్యానికి కథ

ఈ కావ్య సంపుటిలోగల మూడు వందల తొమ్మిది పద్యాలకూ, గేయాలకు ఒకొక్క కథ వుంది. పద్యానికొక కథ చొప్పున అన్ని కథలు వ్రాయవచ్చు. ఉదాహరణకు ఒక్కటి మాత్రం చెబుతాను.

ఈ గ్రంథం ముద్రణ ముగింపుకు వచ్చిన తరుణంలో, ఒక రోజున జస్టిస్ పున్నయ్యగారడిగారు "మన డెమోక్రసీ గురించి ఏమన్నా వ్రాశారా?" అని. "వ్రాసే వుంటాను. జ్ఞాపకం లేదు" అన్నాను నేను. "జ్ఞాపకం లేదంటున్నారు. ఎందుకైనా మంచిది మరొక పద్యం వ్రాయవచ్చు కదా?" అన్నారాయన.

ఆ రాత్రి నిద్రాలేని, మెలకువా లేని మగతతో ఆలోచిస్తూండగా, నా ఆలోచనలలో సడన్‌గా ఒక పద్యం వచ్చి చిక్కుకుంది. అదే ఇది.

కుక్కలు చింపిన విస్తరి,
నక్కల పాలైన నంది, నాయకులు తలో
ముక్కను తినగా, మిగిలిన
బొక్క, సుమీ జాతి ఈ డెమోక్రసి లోసస్

పద్యం స్పష్టంగా వుంది కనుక మరిచిపోవడం జరగదు.

బ్రహ్మలోకంలో వీణ శబ్దించగా సరస్వతి అందుకుని వేళ్ళు కదపసాగింది. ఒక్క క్షణం తర్వాత ఫకాలున నవ్వింది. బ్రహ్మ తక్కిన మూడు ముఖాలూ సరస్వతికేసి తిప్పి ''ఏమిటి కథ?'' అన్నాడు.

''మనవాడు భలే పద్యం వ్రాశాడండీ'' అంది. ఈ పద్యం వీణ మీద పలికించి వినిపించింది. బ్రహ్మ ముఖాలు గంభీరంగా మారిపోయాయి. వీణ విశ్వమంతా వినిపించింది.

''కుక్కలు చింపిన విస్తరి'' అనే మాటకు అక్కడ విష్ణువు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. విస్తరికి అధిపతి కదా ఆయన? దానిని కుక్కలు చింపాయా?

''ఏనాడో చింపాయి, ఇంకా చింపుతూనే వున్నాయి, మీరు నిద్రపోతూనే వున్నారు'' అన్నది లక్ష్మి.

''నక్కల పాలైన నంది'' అన్న మాటకు గభాలున లేచి నిలబడ్డాడు శివుడు. పక్కనున్న నంది మీద చేయివేసి నిమిరాడు. హాస్య ముఖం పెట్టింది పార్వతి. మెలకువ వచ్చి నేను లేచి కూర్చున్నాను.

ఒక్క భారతదేశంలోనే కాదు, మొత్తం భూ ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ డెమొక్రసీ లన్నీ ఇలానే వున్నై. రాజరికాల కంటే, నియంతృత్వాల కంటే కూడా డెమొక్రసీలు ఘోరంగా వున్నై. త్రిమూర్తులు జాగరూకులయ్యారు మరి! మానవ పరిపాలనా వ్యవస్థలో మార్పేదైనా వస్తుందేమో వేచి చూద్దాం.

సాహిత్య పోషకులకును,
సాహిత్యోపాసకులకు, సాహిత్య కళా
స్నేహితులకు, కే ల్మోడ్తును!
శ్రీ హితముగ విరిసి జగము శ్రేయస్కృతిగా!

❋ ❋ ❋

# 1

## మన అమ్మ

అమ్మలగన్న యమ్మ, ముగు
 రమ్మల మూలపుటమ్మ, చాల పె
ద్దమ్మ, సురా సుర ప్రకృతి
 కంతకు జీవఘనమ్మ, తన్ను లో
నమ్మిన లోకులందరి మ
 నమ్ముల నేలెడి యమ్మ, దుర్గ మా
యమ్మ యొసంగు మాకు విజ
 యమ్ము, యశమ్ము, శుభమ్ము, సౌఖ్యముల్ !

*(పోతన్నగారి పద్యానికి)*

## 2. భారతీ

శ్రుతి నీవు, ధ్రుతి నీవు
భ్రుతి నీవు భారతీ!
    స్థితి నీవు, నా సదా
    స్మృతి నీవు భారతీ! ॥శ్రు॥
ఏ పలుకు పలికినా
నీ నామ కరణమే
చెవి కేది సోకినా
నీ హృదయ నాదమే ॥శ్రు॥
    ప్రకృతి పురుషైక సం
    స్కృతి నీవు భారతీ!
    నాకృతులలో నమ
    స్కృతి నీవు భారతీ! ॥శ్రు॥
నను బోయి ఫ్రెండనుచు
నవ జనత కందించి
అమృతు చేసిన తల్లి, భారతీ!
    నా బాష్పజలముతో
    నీ పాదకములాలు
    కడిగి పూజించేను భారతీ! ॥శ్రు॥

*(బోయిఫ్రెండు = Boy Friend,*
*శ్రుతిలయలలోని పాటకు)*

## 3. కాలక్షేప బఠాణీలు

నా పేరడీలు కాల
క్షేప బఠాణీలు, ఇవియె చివరివి, ఇక మీ
కీ పంటవి దొరకవు, ఇవి
గో పట్టుడు, నములు కొలది క్రొంజవులూరన్!

## 4. రొయ్య మీసాలు

ఇయ్యను ఇప్పించను గల
అయ్యకు మీసమ్ములేల, అస్మిత చాలున్;
రొయ్యకె కావలె మీసము
కయ్యమునకు కాలుద్రువ్వ; కవి చౌడప్పా!

## 5. వలపుల వలలు

తొలి వలపులమృత మధువులు
కల బోసిన కళలు, కలలు, కలహంసలు; ఆ
వల వలలు, గాలి వానలు,
అలకలు, పంచాయితీలు, అమవశ నిశలున్!

## 6. భక్తుల పీడ

ఓ ప్రభూ! నీ కృపాంబోధి నోల లాడ
ఉరుకు చున్నది మనసు తా నోప లేక,
అభయ హస్తము సాచినన్నాదు కోవె
సంకట వినాశ! తిరుపతి వెంకటేశ!

ఇదయ్యా, భక్తుడి ఆకాంక్ష!
ప్రతి భక్తుడి ఆకాంక్షా ఇదే!
ఒంటరిగా నీ నుండి విడిపోయాడు
ఒంటరి గానే నిన్ను తిరిగి పొందాలంటాడు!

ఎవడి భక్తి వాడిది
ఎవడి కోరికలు వాడివి
ఎవడి దారి వాడిది
ఎవడి సుఖం వాడిది!

వ్యక్తిగా ఎవడికి వాడే
ఉమ్మడిగా అందరూ నీ అతిథులే!
నీ ఇంట తింటూ నిన్ను విమర్శిస్తారు
వంకలు పెడతారు
డొంకలు కదుపుతారు

నీవే స్వయంగా వడ్డించాలని
ప్రతి అతిథీ ఆశిస్తాడు!
ముఖానికి బొట్టు పెడతారు
వీపున బురద చల్లుతారు!

భార్యల నేలుకోవడం నీకు చేతకాదన్నట్టు
ఏ భార్యనెలా చూచుకోవాలో
నీకు బోధిస్తాడు ఒక మహాకవి!
ఎలాంటి సమయంలో మీ ఆవిడ
నీకు తమను గూర్చి సిఫారసు చేయాలో
ఆమెకు సూచిస్తారామె భక్తులు!

కింద ఆమె భక్తులు
పైన నీ భక్తులు
మధ్యలో ఏడుకొండలు!
ఎక్కలే నంటున్న దెవరో చూడు!
ఎత్తుకో, చేసేదేముంది!

## 7. రేసులకు పోతావా

రేసులకు పోతావా కిట్టమ్మా ? ఆ
రేసు వార్తలేమి ? కిట్టమ్మా !
పోయే టప్పుడు పర్సు పుల్లు, తిరిగి
వచ్చేటప్పుడు పైన నిల్లు!

అంతా గుఱ్రాలే తింటాయా ? మనకు
అంతో ఇంతో పంచి యీవా ?
అదృష్ట వంతు లుంటారు, వాళ్ళు
హల్వా పుల్వాలు తింటారు !

పోగొట్టు కుంటావా, కిట్టమ్మా ? పైస
పోతే యేడుపు రాదా ? కిట్టమ్మా !
పోతే పోనీ ముండ పైస, పసిడి
కొండె వస్తుందన్న ఆశ !

*(కంచికి పోతావా అనే సినిమా పాటకు)*

## 8. ఎవ్వాడు దళితుడు

ఎవ్వడమ్మా దళితుడు ?
ఎందులోన దళితుడు ? ॥ఎ ॥

వేద విభజన చేసెనొకడు
రామ చరితము వ్రాసెనొకడు
మాన వేంద్రుని కొనియె నొకడు
ఇంద్ర సుతు భీ కొట్టె నొకడు ॥ఎ ॥

శంకరుని కద్వైత మొసగిన
చండ దేవుడు దళితుడా ?
స్వరములకు రూపము ఘటించిన
హరిజ నాఖ్యుడు దళితుడా ? ॥ఎ ॥

విశ్వజననికె జనకుడై, తన
వీణ నిడిన మతంగుడెవ్వడు ?
ఆది జాంబవుడెవ్వడు ?
వేద కారకుడెవ్వడు ? ॥ఎ ॥

భారతకు రాజ్యంగ మిచ్చిన
బాబా సాహెబు దళితుడా ?
కె. ఆర్. నారాయణ దళితుడా !
బాలయోగి దళితుడా ? ॥ఎ ॥

*(ఎక్కడమ్మా చంద్రుడు అనే సినిమా పాటకు)*

## 9. పత్నీ ధర్మం

జల జాతాసన వాసవాది సుర భో
    జ్యం బై మజా గొల్పు సో
మ లతా సారము గ్రోలి, చాలక గుడం
    బా త్రాగి ఇల్జేర - రో
కలి బండన్ గొని మొత్తె పత్ని, అదె ని
    క్కంబైన ధర్మంబు ! మూ
ర్ఖులు దుష్కర్మలు చేయ ఊరక సతుల్
    కూర్చుందురే ఏడ్చుచున్ ?

*(పారిజాతాపహరణం లోని పద్యానికి)*

## 10. కారే మంత్రులు

కారే మంత్రులు ? కార్లనున్ కలుగవే ?
    గర్వోన్నతిన్ చెందరే ?
వా రేరీ ? సిరి మూట కట్టుకొని పో
    వన్ జాలిరే ? భూమిపై
పేరున్ కల్గెనె ? ధీమతుల్ గాంధి అం
    బేడ్కర్‌లు జాత్యర్థమై
ఊరే ప్రాణము ? ఏల చేకొనవు వా
    రిన్ జంట దీపాలుగా ?

*(పోతన గారి పద్యానికి)*

## 11. ఉప్పు కప్పురంబు

ఉప్పు కప్పురంబు ఉపయోగకరములే,
పుణ్య పాపములతొ పోల్క లేదు !
జనత గుడ్డిదైన జను షండుడే నేత !
విశ్వసత్య మెరుగ వేమి, వేమ !

## 12. రామ చంద్రా

తిరుమాల కుల తిలకా
తెరువేదో తెలపావా ? రామ చంద్రా !
బ్రతుకంతా జెయిలేనా
బెయిలైనా దొరికేనా ? రామ చంద్రా ॥ తి ॥

యెంకి పిల్లకు తెస్తే
యెండీ వడ్డాణమ్మూ, రామ చంద్రా !
వడ్డాణముకు పట్టె
నొక యేడు చెరసాల, రామ చంద్రా ! ॥ తి ॥

రాములమ్మకు తెస్తే
రతనాల హారమ్ము, రామ చంద్రా
హారమ్మునకు పట్టె
ఆరేండ్ల చెరసాల, రామ చంద్రా ! ॥ తి ॥

ఎన్నో కొంపలు దోచి
కొన్నాను కద జీపు ? రామ చంద్రా ! ఆ
జీపే కదా మనకు
షిర్డీని చూపింది ? రామ చంద్రా ! ॥తి॥

అన్నపూర్ణలో మొన్న
డిన్నరిచ్చిన దెవరు ? రామ చంద్రా ! భద్రా
చల రామదా సతడె
సర్వ సమతావాది, రామ చంద్రా! ॥తి॥

సీట్లమ్ముకొని కాదె
కోట్ల కెత్తితి జెండా ? రామ చంద్రా! ఆ
జెండాయె అధికార
దండాము మన కిచ్చే ? రామ చంద్రా! ॥తి॥

*(రామదాసు కీర్తనకు)*

## 13. కనక సింహాసనాలు

కనకపు సింహాసనములు
శునకమ్ముల కేల ? ఏల శుభ లగ్నములున్ ?
గుణములు జాతి పరమ్ములు,
కనకమ్ములు కావు, తిండి కావలె సుమతీ!

## 14. బాల రసాల సాల

బాల రసాల సాల నవ
    పల్లవ కోమల కన్యకా మణిన్
కూళల కైన నిచ్చి ఒక
    కొంపకు చేర్చుట నీతి, కానిచో
బాలిక లక్ష్య నైపుణుల
    బట్టి కొనన్ వలె నిష్ట విద్యలన్!
హాలికులన్ మనుష్యు లప
    హాస్యము దోషము, పోతన ప్రభూ!

*(పోతన గారి పద్యానికి)*

## 15. తుది బాల్యం

ఒడలు తెలియకుండ వెడలె శైశవ మెల్ల,
తెలివి వచ్చు సరికి తెల్లవారె!
ఎట్లు గడచు ఇపుడు ఈ తుది బాల్యమ్ము!
కలదు గాని తెలివి, కదల దొడలు!

*(ఆస్పత్రి బెడ్ మీద నుంచి)*

## 16. జిరాక్సు యంత్రం

పికములు పాడు నన్న అది
    పేరడి, తారక లెల్ల చంద్ర నా
యిక లన పేరడీ, ర వుద
    యించుట పేరడి, మంచు బొట్లు మౌ
క్తికము లనంగ పేరడి, ప్ర
    తీ కృతియున్ ఒక పేరడీయె ఈ
ప్రకృతికి; సృష్టియే ఒక జి
    రాక్సు మెషీను, హుసేను సాగరా ?

## 17. పంది బురద

పంది బురద మెచ్చు, నంది పచ్చిక మెచ్చు
పిల్లి ఎలుక మెచ్చు ప్రీతి తోడ,
జీవ నైజ మెరిగి చెప్పాలి కవితలు
చిలుక పలుకు కేమి విలువ ? వేమ!

## 18. కళంకిత అన్నారా ?

కళంకిత అన్నారా, నిన్ను ?
గాయపరుస్తున్నారా ?
  గవ్వ విలువ చేయని పలుగాకులు ?
  పువ్వుల నెరుగని గుడ్లగూబలు ? ॥క॥

కళంకిత అన్నారా
కాని మనుషు లున్నారా ?
  పంకజాలయను కొలిచే వాళ్ళు
  పరభృతముల కొనియాడే వాళ్ళు ॥క॥

అంజనేయుని అవ్వ యెవ్వరు ?
అవనీ జాతకు అమ్మ యెవ్వరు ?
భరతమాత గాంధర్విణి కాదా
సెక్యులరు లో శీలము కలదా ? ॥క॥

భూదేవికి మాలిన్యము లేదా
బురదయె లేని బీచి కలుగునా ?
కౌరవ పాండవ వంశ మెట్టిది ?
కురుక్షేత్రమున ధర్మ మెట్టిది ? ॥క॥

*(ఈ టీవిలో ఒక పాటకు)*

## 19. ఎందరో మహా నృశంసులు

ఎందరో మహా నృశంసులు
అందరికీ వందనాలు !
స్వాతంత్ర్యానంతర ప్ర
జా స్వామిక రాజ్యంలో ॥ ఎం ॥

వేదావని పుట్టినాము
విద్యలేవో నేర్చినాము,
కూడు కోసమే యేమో
పాడుకుంటూ బ్రతికేము,
మా జోలికి రావల దని
మనవి చేయుచున్నాము ॥ ఎం ॥

ఆట పన్ను, పాట పన్ను
అమ్మ పన్ను, కొన్న పన్ను
మింగ మెతుకు లేని మాకు
మీ కీయగ ఏమున్నది ?
మా ప్రార్థన మన్నించి
మా జోలికి రాకండి ॥ ఎం ॥

*(త్యాగరాజు కృతికి)*

## 20. వందే మీ తరం

వందే మీ తరం
మందే ఈ తరం!

దాస్య భారతం మీ తరం
స్వతంత్ర భారత్ మా తరం
సుజలాం సుఫలాం మీ తరం
విఫలాం విరసాం మా తరం ॥వం॥

ధూమ జ్యోత్స్నా కలుషిత యామినీం
దోమల బాధా పీడిత జీవనీం
క్షుధార్తినీం స్వకుక్షి మాత్రిణీం
రౌడీం గూండాం దోపిడీం మా తరం ॥వం॥

నూరు కోట్ల దుర్వీర్య మూర్ఖ దుర్బలే
కోటి కోట్ల రూపాయలు స్వాహా దుర్వ్యయే
మెరిట్ నిషేధే క్రెడిట్ నిషాదే
అసమర్థ నర నారీ మాతే గత ఖ్యాతే మా తరం ॥వం॥

## 21. నీ కొండను నీవే

నీ కొండను నీవే రక్షించుకో
నీ హుండీ నీవే లెక్కించుకో
ఓ తిరుమల వెంకటేశ, ఓ శ్రీనివాస,
నీ గంటను నీవె వాయించుకో ॥నీ॥

నీ కొండకె గుండు కొట్టు
పుండాకోర్లున్నారు,
నీ పైసలు కాజేసే
టోపీ దొర లున్నారు,
అమాయకుని జేసి నిన్ను
విమాన మెక్కిస్తారు ॥నీ॥

ఆపద మొక్కులతో నీ
అప్పు తీర దెన్నటికీ
నల్లధనం పాతరలను
పెల్లగించుకోవలెను
సాటి దొరల కోరికలను
సాయ ముంచుకో ॥నీ॥

కార్లలో వచ్చే దొరలకు
కావలసిన పను లుంటై,
మా దేమిటిలే - క్యూలో
చీదేసిన బీదోళ్ళం,

దొడ్డి తలుపు తెరచి యుంచి
దుడ్డు తీసుకో! ॥నీ॥

కోశాలను నింపుకొనే
దేశభక్తు లున్నారు,
వచ్చిన దాంట్లో నీకూ
వాటా ఇస్తుంటారు
అస్పృశ్యం కాదు డబ్బు
అంది పుచ్చుకో, నీ
మూసుకొన్న కను లట్లే
మూసి ఉంచుకో కాని
క్రీగంటను అపుడప్పుడు
క్రింద చూచుకో! ॥నీ॥

ఒంటి గంట దాటినా
ఒదలరు నిను భక్త జనులు
అంతలోనే సుప్రభాత
ముత్తిష్ఠా అంటుంది!
నిలబడియే నిద్రిస్తూ
నీ భక్తుల కరుణిస్తూ
శ్రీ కరుణా స్వర్ణధార
చిరకాలం మాకిస్తూ ॥నీ॥

*(నీకొండకు నీవే రప్పించుకో-అనే పాటకు)*

# 22. చదువు లెందుకు

చదువు కొన్నవాడ వనీ
పొగరు చూపకు !
    పదవు లొసగు పైస లేని
    చదువు లెందుకు ?

పైస లున్న వాడ వని
పైత్యకారి కాకు!
    ప్రజ్ఞ ఒక్క టేని లేని
    పైస లెందుకు ?

ప్రజ్ఞావంతుడవు కనుక
పర్వాలే దనుకోకు!
ఈర్ష్యా ద్వేషాలు పడగ
లెత్తి చూచు నిను నిత్యము!

*(ఒక సినిమా పాటకు)*

## 23. పోట్ల గొడ్డు

గడ్డివేయ పోట్ల గొడ్డు కొమ్మాడించు
పగిది, హితము గనడు పామరుండు!
భరత పామరుడికి ప్రతినిధి వోటరు,
గొడ్డె మన సమాజ పెడ్డ, వేమ!

## 24. మరో ప్రపంచం

మరో ప్రపంచం, మరో ప్రపంచం
మంచం వేసి పిలిచింది !
 పదండి ముందుకు, పదండి తోసుకు
 పంక్తి గట్టి కదలండి !!

చేతుల నిండా పని ఉందక్కడ
చేలు పండి వున్నాయి
 నిరుద్యోగమే లేదండి
 పరాన్న రాశుల విందండీ !!

ఎముకలు కుళ్ళిన, వయస్సు మళ్ళిన
సోమరులారా చావ రేమండి ?
 చస్తే గాని స్వర్గం లేదను
 సత్య మెరిగి పరిగెత్తండి !!

అదిగదిగో కనబడటం లేదా
అమర లోక భోగాలు !
సారాపాత్రలు, రంభోర్వశులు
కోడి లేడి వేపుడులు !!

సలసల కాగే చమురా, కా దది
ఉష్ణ రక్త కాసారం
దూకండి, దూకండి బిర బిర
నాకాని కదే దారండి!!

*(శ్రీశ్రీగారి పాటకు)*

## 25. గప్ చిప్

అమ్మో, పోలీసులు !
పడుచువాళ్ళు గప్‌చిప్-

అమ్మో, నాన్న !
పొరుగు వాళ్ళు గప్ చిప్ -

అమ్మో, గురువులు!
ఇంట్లో కోళ్ళు గప్‌చిప్-

అమ్మో, ఆఫీసరు!
టేబిలు మీద ఫైళ్ళు గప్ చిప్-

## 26. ఏ దేశమేగినా

ఏదేశ మేగినా ఎందు కాలిడినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని!
లేదురా మనకున్న కుల గజ్జి యెందు
లేదురా మన వంటి బాంచ లింకెందు!!

కుల మొక్క జాతిగా పంచ జాతుల గుంపు
కుత్తుకలు కోసుకుని నెత్తురోడే భూమి
మాదనీ, లోకాన
మరి యొకటి లేదనీ ?

సొంతగోవుల నంట రాదంచు గెంటేసి
పొంత పులులను గోకి ముద్దు చేయుననీ
మా తాటి చెట్లను మంటలకు పారేసి
స్కాచి సారా త్రాగి బ్రతుకు చుండిన దనీ ॥పొగ॥

*(రాయప్రోలు వారి గేయానికి)*

## 27. తక్కువేమి మనకు

తక్కువేమి మనకూ, రాముం
డొక్కడుండు వరకు ?
భద్ర గిరీశుడు ప్రవాస రాముడు
అసలు రాముడా అయోధ్య రాముడు ॥త॥

పరశు రాముడు, బాబ్రీ రాముడు
మల్కిభ రాముడు, ముల్కీ రాముడు
మనీ రాముడు, సినీ రాముడు
సిక్కు రాముడు, బిక్కు రాముడు ॥త॥

అడవి రాముడు, ఆత్మా రాముడు
దొంగ రాముడు, దోబీ రాముడు
పంట రాముడు, సెంటు రాముడు
పిరికి రాముడు, మురికి రాముడు

అంతా రామమయం, జగ
మంతా రామ జయం ॥త॥

*(రామదాసు కీర్తనకు)*

## 28. రామ చంద్రుడి కినుక

రామ చంద్రుడు తిరిగి
రాను పొమ్మంటాడు
సీతమ్మా, చెప్పవమ్మా!
రామ నామము విడిచి
చంద్రుడైనాడు
వీర బాణం విరిచి
విసిరేసినాడు! ॥సీ॥

జన్మ భూమిని మించి
స్వర్గమే లే దనడా?
భువి లోన నిన్నొదిలి
దివి కెందు కెళ్ళాడో! ॥సీ॥

రామ రాజ్యమే కాదు
రామ చంద్రుడె లేని
భరత భూమి తో తనకు
పని యేమి టంటాడు ॥సీ॥

*(రామదాసు కీర్తనకు)*

## 29. ఈ జగత్పరిణామ గతి

ఈ జగత్పరిణామ గతి ఎవు
డెందు పాడై నిలిచి పోయెనో!
ప్రగతి శకటం ఆగిపోయెను
పరిసరమ్ములు కుళ్ళ సాగెను !

నరుని బుద్ధికి నివురు గప్పెను
నాచు గట్టెను, నీచు పట్టెను
ముచ్చు దోమలు పుచ్చి మనుజుని
పచ్చి నెత్తురు పీల్చ సాగెను !

ఎవడి దేవుడి పేర వాడు
ఇరుగు పొరుగుల దోచ సాగెను
హింస ఆయుధ మయ్యె, గూండా
యిజమె మానవ నైజ మయ్యెను !

ఈ బృహత్ భారత జడ మ్మెపు
డెట్లు బాగై సాగు ముందుకు ?
ఈ జగత్పరిణామ విధికి
ఏది గమ్యమో ! ఏది రమ్యము !

*(బాపురెడ్డి గారి పాటకు)*

## 30. మా భరత మాతకు

మా భరత మాతకు మల్లె పూదండ
మా జాతి చరితకు మంగళారతులు !

కడుపులో స్వార్థాగ్ని
కను చూపులో కులము
పంక్తిలో తనవారి
కంచాలకే రక్ష ! ॥మా॥

గలగలా గంగమ్మ
కిలకిలా కావేరి
మధ్యగౌతమి, కృష్ణ
మణులు పండుతు వుంటె

మా దొరల కడుపులే నింపేటి మాతకు
మా బడుగు బ్రతుకుల తో ముడులు కట్టిన దండ ॥మా॥

*(ఒక దేశభక్తి గేయానికి)*

# 31. కిట్టమ్మ కథ

యమునలో ఆడితివి, కిట్టమ్మా! ఆ
యమున సంగతు లేమి, కిట్టమ్మా ?
రేపల్లె లో రాసలీల, నేడు
న్యూఢిల్లీ లో రాచగోల!

జైలులో పుట్టావు కిట్టమ్మా, ఆ
జైలు పుణ్యమేమి, కిట్టమ్మా ?
స్వాతంత్ర్య యోధులకు బాపూ, నేడు
జార చోరుల వర్కు షాపు !

అవతార మూర్తిని నీవు, మాకు
ఆదర్శ మే మిచ్చి నావు ?
సహజ సుందర లీల వ్రజపురి, దాని
సత్య సాధన కేల గజపురి !

*(కంచికి పోతావా అనే సినిమా పాటకు)*

## 32. రాలి పోయే పువ్వా

రాలి పోయే పువ్వా, నీకు
రంగు లెందుకే ?
గూకి పోయే పొద్దా, నీకు
గూర్ఖా లెందుకే ?

జారి పోయే వయస్సా, నీకు
జాగీ ర్లెందుకో ?
ఊడి పోయే పదవీ, నీకు
హోదా లెందుకో ?

చచ్చి పోయే మనిషీ, నీకు
సౌధా లెందుకో ?
ఆరి పోయే మంటా, నీకు
ఆక లెందుకే ?

*(ఒక సినిమా పాటకు)*

## 33. తుది బాల్యం

ఒడలు తెలియకుండ వెడలె శైశవ మెల్ల
తెలివి వచ్చు సరికి తెల్లవారె !
ఎట్లు గడచు ఇపుడు ఈ తుది బాల్యమ్ము !
కలదు గాని తెలివి, కదల దొడలు !

## 34. తాజ్ మహల్ అందం

తాజ్ మహల్ అందం కాదోయ్
రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు ?
భారతం ఎవరు రాస్తే యేమిటి
తాళ పత్రాలు నరికిన కార్మికు డెవ్వరు ?

వంకాయ కూర ఎలా వుంటే నేం
వంగ చెట్టుకు వేసిన పెంట ఏ పందిది ?
ఆవు నెయ్యి కమ్మదనం మా టెందుకు
ఆవుకు క్షయరోగం వుందేమో చూడు !

అమ్మాయి ఇస్తున్న వరకట్నం కంటె
ఆమె తెస్తున్న నరకం గొప్పదట !
బంగారం చూచి సంబర పడకు
గని కూలీ ఆకలి అంగారం ఖరీదెంత ?

*(శ్రీశ్రీ గేయానికి)*

## 35. ఏ దేశ చరిత్ర చూచినా

ఏ దేశ చరిత్ర చూచినా
ఏ ముంటుంది గర్వ కారణం ?
    పర పీడన లేకుండా యే
    ప్రాణి కూడ మన లే దన్నా !

గరికను చంపి తినదా గొర్రె ?
గొర్రెను చంపి తినడా మనిషి ?
    మనిషిని చంపి తింటుంది పులి
    సృష్టినే పీక్కు తింటున్నది ఆకలి !

మని షంటే సంఘం కాదా ?
సంఘ మంటె ఘర్షణ కాదా
    జనన మరణ చరిత్ర అంతా
    తనను తాను తినేసు కొనుటే !

*(శ్రీశ్రీ గేయానికి)*

## 36. నీ కొడుకు బ్రహ్మదేవుడు

నీ కొడుకు బ్రహ్మదేవుడు
కాకికి బంగారు రెట్ట కల్పించినచో
నా కేశ రాశి మేరువు
కాకుండునే ? లక్కు లేదు, కవి చౌడప్పా !

*(చౌడప్ప పద్యానికి)*

## 37. మాతృ భూమి అందరిదీ

మాతృభూమి అది అందరిదీ, అది
మాత అందరికీ మాత కదా !
ఎందుకె ధాత్రీ, స్వపర భేదములు ?
లచ్చీ, లక్ష్మి ఒకరు కాదటే ?

వందేమాతర మంటూ ఎందరు
అసువులు నీడిరో ఎరుగ మటే ?
స్వరాజ్య మందరికీ సమమే కద ?
కలిమి లేములకు కారణమేమి ?

స్వాతంత్ర్య సమర వీరులు తెచ్చిరి
స్వరాజ్య లక్ష్మిని పోరాడి!
నాటి విలనులే హీరోలై చెల
రేగుదు రిప్పుడు, చూడవటే ?

*(బృందావన మది అనే సినిమా పాటకు)*

## 38. జుట్టు కింద ఏముంది ?

గోదారి గట్టుందీ
గట్టు మీదా చెట్టుందీ
చెట్టు పైనా పిట్టుందీ
పిట్ట కడుపులో ఏముందీ !!

పిట్ట కడుపులో రెట్టుందీ
రెట్ట కిందా జుట్టుందీ
జుట్టు కిందా మట్టుందీ
మట్టి కడుపులో ఏముందీ ?

మట్టి కడుపులో పుట్టుందీ
పుట్ట లోనా చీ ముందీ
చీమ కడుపులో పాముందీ
పాము నోటిలో ఏముందీ !!

పాము నోటిలో విషముందీ
విషము కొండిలో మనిషుందీ
మనిషి గుండె లో స్వార్థముందీ
స్వార్థ బుద్ధిలో ఏముందీ ??

*(ఒక సినిమా పాటకు)*

## 39. సర్వం పేరడీ మయం

రాతి బండకు చెట్టు పేరడీ
చెట్టుకు జంతువు పేరడీ
జంతువుకు మనిషి పేరడీ
ప్రవక్తకు సైతాను పేరడీ
సైతానుకు దేవుడు పేరడీ
దేవుడికి భక్తుడు పేరడీ-

## 40. తులసీ దళ మాల

దళితు డవు కావు, తులసీ
దళ మాలవు నీవు, అంధతమసున నెపుడో
దళితము లై పోయిన వి
ద్యల నెల్లన్ పొంది, ముందు కడు గిడు, భీమ్నా !

# 41. దేవుని ప్రేమ ఇదిగో

దేవుని ప్రేమ ఇదిగో, జనులారా
తృప్తిగా భోంచేయరే !
    సంతృప్తిగా తినక పోతే, మీ రెట్లు
    స్వర్గాని కెక్క గలరు ?

తిండి గలిగితె కండ గలదు, జనులారా
కండ గలవాడె ఇభ నిభుడు !
    ఇభమునే రంభ వలచు, రంభ
    ఇచ్చునదె స్వర్గ సుఖము !

దేవుని ప్రేమె రంభ, హల్వాలు
పుల్వాలు రంభ అందాలే !
    రంభా ఫలాలు తినుడీ, అమృతమే
    రంభ బింబోష్ఠ మండీ !

*(ఒక భక్తి గేయానికి)*

## 42. అన్యాయ కాలంబు

అన్యాయ కాలంబు దాపరించిం దిపుడు
అందరము మేలు కోవా లండీ !
గరిమెళ్ళ నాటి కంటే నేడు ఇది ఘోర
విష వృక్షమై విరిసె చూడండి !

మాన్యాలు ధాన్యాలు మనుషు లందరకూ స
మానముగ పంచుతా మన్నారు,
స్వాతంత్ర్య లాభాలు దాదాలె పంచుకొని
ముష్ఠి మూకుడు జాతి కిచ్చారు !

తెల్ల దెయ్యాలై తె తోక ముడిచెను కాని
నల్లనివి ఎందు పోగల వండి ?
చీకటి గోదాముల్లో, స్విస్సు బేంకుల్లో
పొంచి యుండును, వెదకి పట్టండి !

అన్యాయ కాలంబు అతిశయించిం దిపుడు
అందరము ప్రతిఘటించా లండీ !
మొగమాట పడవద్దు, స్వపర భేదము వద్దు
న్యాయ పథమే ప్రగతి రథ మండి !

*(గరిమెళ్ళ వారి పాటకు)*

## 43. గరిమెళ్ళ దండాలు

దండా లండోయ్, బాబు, దండా లండోయ్ !
ఉండ లే మండోయ్, మే ముండ లే మండోయ్ !
బుల్లెట్ల తూటాలకు దండా లండోయ్
తెల్లోళ్ళ పాలనలో ఉండలే మండోయ్ !

చిన్న చిన్న రాజ్యాలను
చేత బట్టు కొన్నారు,
భారత దేశం మొత్తం
ఏక రాజ్య మన్నారు! ॥దం॥

అంటరాకు డని మేము
గెంటేసిన మాలోళ్ళకు
తెల్ల బట్ట లిచ్చారు
చదువు నేర్ప వచ్చారు ! ॥దం॥

ఓడలలో వచ్చారు
రైళ్ళను నిర్మించారు
మా పవిత్ర ధర్మాలను
మంట గలిపి వేశారు ! ॥దం॥

# 44. ధర్మన్న దండాలు

దండా లండోయ్, దండా లండోయ్
ఉండ లేమండోయ్ బాబు, ఉండ లేమండోయ్ !
సమత లేని సంఘంలో ఉండ లేమండోయ్
జాతి వర్ణ ధర్మాలకు దండాలండోయ్ !

మాల మాదిగ లంటే
మండి పడి చస్తారు,
చస్తూ కూడా మమ్ము
చంపుకు తింటారు! ॥దం॥

వర్ణాలంటే బాబు,
వృత్తులని అన్నారు
నాల్గు వృత్తులను తామే
స్వాహా చేసు కున్నారు !

పంచము లని మమ్ము వూరు
వంచకు తరి మేశారు
హిందువు లంటే సోదర
హింసకు లండీ బాబు! ॥దం॥

కాళ్ళకు మొక్కే మమ్ము
కడుపు మీద తంతారు,
తన్నే కాళ్ళకు మొక్కే
దా సత్యం నెరపు తారు ! ॥దం॥

అధికారం చేతికొస్తే
అమ్మకు తింటారు, బాబు
ఇంత నీచ సంఘం లో
ఎన్నాళ్ళుంటాము, బాబు ? ॥దం॥

*(కుసుమ ధర్మన్న గారి గేయానికి)*

## 45. చండ దేవుని వంశం

చండదేవుని వంశ వృక్షమ్ము వ్రేళ్ళు
నరికే, జాతి ని దళిత మొనర్ప నేల ?
జాతి మూల మెరుంగని కోతులార !
చదువు కుని యేడ్వగా రాదె శర్మ నైన ?

*(శర్మ= మంగిపూడి వెంకట శర్మ)*

## 46. మా కొద్దీ తెల్ల/నల్ల దొరతనం

గరిమెళ్ళ:

మా కొద్దీ తెల్ల దొరతనము, బాబు
మా సంపదను దోచి
మమ్ము జంపు దొర తనము !
మా కొద్దీ తెల్ల దొరతనము ॥మా॥

ధర్మన్న :

మా కొద్దీ నల్ల దొరతనము, బాబు
మానవత్వమె లేని
దానవుల దొరతనము !
మా కొద్దీ నల్ల దొరతనము ॥మా॥

గరిమెళ్ళ :

ఏడాది కేడాది కెక్కువ పన్నేసి
ఈ భూమి నాదే నన్నాడు, మమ్ము
కూలీకి దున్న మన్నాడు, కడుపు
మంట తో చావు మన్నాడు, మమ్ము
బానిసలను జేసి ప్రభు పై కూర్చున్నాడు ॥మా॥

ధర్మన్న :

భూమి, నీరు, గాలి ఎవడబ్బ సొమ్మండి ?
అందరికి భాగ ముందండి, సర్వ
భూ స్వామి సర్కారే నండి, తెల్ల
దొరలకు న్యాయ ముందండి, వర్ణ
భేదాలు పాటించు నేటివులు మాకొద్దు ॥మా॥

గరిమెళ్ళ :

అగ్ర కులము లార, అజ్ఞానము వీడి
అందరము ఒకటే ననండి !
బ్రాహ్మణా బ్రాహ్మణ, పంచమ బ్రాహ్మణ
భేదాల తెగు లేల నండి, తెల్ల
వాడు పోవాలంటే కలిసి పోరాడాలి ॥మా॥

ధర్మన్న :

వేల యేండ్లనుంచి వెలివేసి, కుక్కల
కంటే హీంటగా చూచినారు, అంట
రాదని గెంటి వేశారు, మేము
ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తుంటిమి, పూర్తిగ
తెల్లారె దాకైనా తెల్లోళ్లుండాలి, బాబు ! ॥మా॥

## 47. అదిగో హరిజన వాసం

అదిగో, అల్లదిగో
హరి జన వాసము !
పది వేల గుడిసెల
ఇడుముల మయమూ ॥అది॥

ప్రతి యేడూ స్వామి బ్ర
హ్మోత్సవాల పంటల వలె
గుడిసె లంటుకు పోయి
మిన్నంటే మంటల మయము ॥అది॥

చద్ది గంజి కూడే
తీర్థ ప్రసాదాలు
గుడి గంటలే మా
పని గంటలూ
సుప్రభాతము లెరగని
పవళింపులే లేని
నిత్య కార్మిక బస్తీ
పస్తుల మయము ॥అది॥

*(అన్నమాచార్య గారి గేయానికి)*

## 48. కాటుక రంగు తల్లి

కాటుక కంటి నీరు చను
    కట్టు పయిన్ బడి నల్లనైన నీ
హాటక శిల్ప మూర్తి అరు
    దైనది! ఆకటి కమ్ము కొందురే ?
మాటలు రాని పోతన అ
    మాయకు డంతియు ! నన్నయాదు లా
పాటి యెరుంగరే ? ధరణి
    పాలుర కావ్య రసజ్ఞు లుండరే ?

*(పోతన్న గారి పద్యానికి)*

## 49. దివాళా కోరుతనం

పలికెడిది మహా కవియై
పలికించెడి వాడు రామ భద్రుం డగు చో
పలుక వలె సొంత మేదో !
తొలి నెవరో పలుక, దాని దొంగిల నేలా !

## 50. పైరవీ శక్తి

పైస ఖర్చు పెట్టి, పైరవీ లోన రించి
పదవి గొనిన తప్పు పట్టరాదు ;
శక్తి కలుగు వాడె సాధించు నేదైన,
ఈసు శక్తి హీను శ్వాస, భీమ్నా !

శక్తి యనగ కార్య సాధనమ్మే శక్తి
దాని ఆయుధములు ధనము, విద్య ;
పైరవీలు దాని ప్రజ్ఞా విశేషాలు
ప్రజ్ఞ లేని వాడు పంద, భీమ్నా !

పేరడీలు వ్రాయ పిత్రార్జితము పోవు,
స్వార్జితమ్ము కవిత వ్రాయ పోవు !
గారడీలు చేసి గడపాలి బ్రతు కెల్ల
నరుని మనసు రంగు నలుపు, భీమ్నా !

*(భీమన్న శతకం నుంచి)*

## 51. పేరడీ సిద్ధులు

భగవద్గీతను కృష్ణుడే నుడివెనో,
వ్యాసర్షి భావించెనో ?
భగవద్వాణి ని దేవుడే పలికెనో,
ప్రజ్ఞాను లూహించిరో ?
భగవ ల్లీలలు దేవుడే సలుపునో,
భక్తుల్ ప్రపంచింతురో ?
భగవత్సిద్ధులు పేరడీలు ప్రకృతి
స్వైర క్రియా క్రీడలన్ !

## 52. పనే జీవితం

కూటి కొరకు కొడుకు కొంపకు పోరాదు
వృద్ధ ఆశ్రయాలు వేలు కలవు ;
చివరి శ్వాస దాక చేయాలి పని యేదో,
బ్రతు కనంగ చేయు పనియె, భీమ ?

## 53. రాతిని నాతిని జెసెనె ?

రాతిని నాతి జేసెనొ కొ

రాముడు ? నమ్మెనొ కో గుహుండు ? శ్రీ

సీతను పుట్టినింటి కని

చే కొని పోయెనొ. రావణుండు ? ప్రా

చేతసు రామగాథ నిటు

చీల్చి భుజింత్రు మషాళ లద్ది ! ఈ

స్వాతి శయా లుదాహరణ

లౌ గద భక్తుల పేరడీలకున్ !

## 54. తల్లి దండ్రులు

తల్లి దండ్రి మీద దయ కాదు ముఖ్యమ్ము,

తిండి పెట్ట వలయు తిట్ట కుండ !

తిండి గలుగ తిట్లు తినవచ్చు నెన్నైన

విసుగు చూప బోకు, ముసలి వేమ!

## 55. ఏమున్నది గర్వ కారణం

ఏ గవర్నమెం టాస్పత్రి కెళ్ళినా
ఏ మున్నది గర్వ కారణం ?
పే రున్న ప్రతి డాక్టరూ
ఇంటికి రమ్మనే వాడే
సొంత క్లినిక్కులున్నవాడే !

ఏ ప్రభుత్వ ఆఫీసు కెళ్ళినా
ఏ మున్నది గర్వ కారణం ?
ప్రతి ఉద్యోగీ తన ఉద్యోగాన్ని
డబ్బిచ్చి కొనుక్కొన్న వాడే,
తన బిడ్డలకూ కొనివ్వ వలసిన వాడే !

ఏ సర్కారీ స్కూలు కెళ్ళినా
ఏ మున్నది గర్వ కారణం ?
పరపతి గల ప్రతి టీచరూ
స్కూట రెక్కి తిరిగే వాడే
సొంత పనులు చేసుకొనేవాడే !

*(శ్రీ శ్రీ గారి గేయానికి)*

## 56. బాధా పారము

బాధా వేదన పారా వారము
పారము లంటగ చూచి వచ్చితిని
అమృత వరము లొక రెండే ఉన్నవి
అసహాయు లైన మనుజులకు,
ప్రేయసి ప్రేమా శ్లేషము మొదటిది
మృత్యు పరీరంభము రెండవది,
అది నా యవ్వన కాల మనస్థితి
ఆ ఇద్దరు ఇప్పుడు కుడి, ఎడమ !

## 57. ముసలి లక్షణం

ముసలి వాడు, మంచమును పట్టి యుండిన
వాడు, నిత్యసేవ వలయు వాడు
విసుగు కొనును, తిట్టు, విసిగించు, నాతడు
చివరి మెట్టు మీద శివుడె, భీమ్నా !

## 58. అంతా మంచి కోసమే

నా పూర్వుండు యయాతి భగ్న రథుడై
నా రీతి చింతింప, నే
దో పుత్రాకృతి నుద్ధరించె ! అది యే
దో నేడునున్ కల్గెడిన్ !
ఆపద్బాంధవి నా సరస్వతి సదా
నా చెంతనే లేదే ? ఈ
తాపం బే పరమార్థ మెంచి నను బా
ధా వహ్ని పాల్జేసెనో !

## 59. ప్రేమ X పెళ్ళి

ప్రేమించుట సుఖ మైనను
ప్రేమించిన వారి నెపుడు పెళ్ళాడకుమీ !
ప్రేమకు పెండ్లికి వైరము !
ప్రేమయు ప్రేయసియు పోవు పెండ్లి తో, భీమ్నా !

# 60. రఘుపతి రాఘవ

రఘుపతి, రాఘవ రాజా రాం
రావణ హంతక సీతా రాం
ఈశ్వర నాముడ వెపు డైనావ్ ?
అల్లా కెప్పుడు జోడైనావ్ ?

అయోధ్య లో నీ సింహాసనము ను
అల్లా భక్తుల కెపు డిచ్చావ్ ?
అజేయమౌ నీ కోదండమును
తాడు తెంచి ఎటు విసిరేసావ్ ?

తూర్పు పడమరల దోపిడి మూకలు
పొంగి పొంగి నీ పై పడుతుంటే
వంగి సలాములు చేసావో
కృంగి పారి యెట దాగావో !

*(గాంధీజీ ప్రార్థన గేయానికి)*

## 61. BROKEN 'X FALLEN

కానని వాని నూత గొని
    కానని వాడు అభీష్ట మార్గమున్
కానని భంగి, "బ్రోకె" నను
    నాయకు మాటకు "పాలె" నంచు అ
జ్ఞానులు శిష్యు లెంతయు ప్ర
    చారము చేతురు, జాతి నున్నత
స్థానము నుంచి హీన దళి
    త స్థితికిన్ పడ ద్రోచి రక్కటా !

*(పోతన్న గారి పద్యానికి)*

## 62. మెదకు లో మంజీర

ఏడు పాయల గంగా జనీ, భవాని !
జీవనాధార, మెదకు మంజీర ధార !
గైకొనుము మా నమస్సులు లోక వంద్య !
రాజ మౌళీశు నీ నేటి పూజ కొరకు !

*(మెదకులో మంజీర తీరములోని*
*ఏడు పాయల గంగాభవానీని ఉద్దేశించి)*

## 63. పెద్దపులి - ఎద్దు

పెద్దపులీ, పెద్దపులీ ! ఎద్దా, ఎద్దా !
మీ తండ్రొకడే అంటే, అందు నిజం కద్దా ?

మీ ఇద్దరికి ఒకడే తండ్రయితే,
ఒక కొడుకు మరొక కొడుకుకు తిండైతే,
తండ్రి వద్దు తిండ్రి వద్దు
ముష్టి సృష్టి మన కొద్దు !

తెలుగు నేల అయ్యలెల్ల
దానకర్ణు లయితే !
తెలుగు గడ్డ అమ్మలెల్ల
అన్నపూర్ణ లయితే !

దుష్ట చతుష్టయం లోని కర్ణుడే
దుర్గమ్మకు మగ డయితే
అమ్మ వద్దు, అయ్య వద్దు,
అనుచిత కవితలూ వద్దు !

తెలుగు కవిత్వ హంతకులు కవులే అని
అన్నా డంట అజంతా,
నిజమేనోయ్ అది కొంత !
ఆదినుంచి నేటి వరకు
అందరికీ అదే వింత, అదే చింత !

*(నారాయణ, నారాయణ, అల్లా, అల్లా అనే కృష్ణ శాస్త్రి గారి గేయానికి)*

## 64. వంకాయ వంటి

వంకాయ వంటి రాణులు,
పంకజముఖి సీత వంటి పనిపిల్లలు, మా
టెంకాయ వంటి దైవము
లింకెక్కడ దొరుకు తెలుగు యింటన్ తప్పన్ ?

*(వంకాయ వంటి కూరయు అనే చాటువుకు)*

## 65. గాలిపటం తోకవు

నాల్గు వర్ణాల జన పతంగమ్ము చివర
పంచమ మ్మగు తోకవు, పరభృతమువు ;
వరమనోహర పంచమ స్వరము నీది !
ఇష్టమౌ రీతి పాడు కోవే పికేంద్ర !

*(ఏకాంత సేవలోని ఒక పద్యానికి)*

# 66. దేవుడు - బిగ్ బ్యాంగ్

సృష్టికి కర్త దేవుడు అనడం
ఎంత అసంబద్ధమో
బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం కూడా
అంతే అసంబద్ధం !

దేవుడ్ని ఎవరు సృష్టించారు ?
అంతకు ముందేముంది ?
దా న్నెవరు సృష్టించారు ?
లాంటి ప్రశ్నలన్నీ
బిగ్ బ్యాంగ్ కూ వర్తిస్తాయి.

ఈ సిద్ధాంతా లన్నీ అజ్ఞానులైన ప్రవక్తలూ
అవిశ్రాంత పరిశోధకులైన సైంటిస్టులూ
కల్పించినవి, కల్పిస్తున్నవీ !

సృష్టికి మూలం కాలగమనం
కాలగమనం లోని నిత్య సంచలనమే
గోళ చలనాలకు సాపేక్ష ధర్మం !

# 67. ధర్మక్షేత్రే కురుక్షేత్రే

కురుక్షేత్రం ధర్మ క్షేత్రం ఎలా అయ్యింది ?
ధర్మం అంటే ఏ ధర్మం ?
సహజ మైన ప్రకృతి ధర్మమా ?
కృతక మైన మానవ ధర్మమా ?
ఇక్కడ ఉద్దేశ్యం మానవ ధర్మం అయితే
కురుక్షేత్రం నిజంగా అధర్మ క్షేత్రం !

వ్యాసుడు కానీనుడు
వివాహ వ్యవస్థకు వెలుపల కన్యకు పుట్టిన వాడు
అక్రమ సంతానం !

తనకోసం కాక
పనికి మాలిన తన తమ్ముల కోసం
స్వయంవర కన్యకలను
బలవంతంగా ఎత్తుకు రావడం
భీష్ముడికి ధర్మ మేనా ?

వితంతువులకు పర పురుషుడి ద్వారా
కలిగిన అక్రమ సంతానమే కదా
ధ్రుతరాష్ట్ర పాండు రాజులు ?

జూదం ఆడవచ్చు, తప్పు కాదు
ధర్మ రాజు ఆడవలసింది దుర్యోధనుడితో, శకునితో కాదు.

ప్రశ్నించే నోరు ధర్మరాజుకు లేక పోతే
ఆనాడు కర్ణుడ్ని ప్రశ్నించిన ద్రోణుడి నోరు
ఇప్పు డేమైపోయిది ?
ఇలా చెప్పుకుంటూ పోతే
మహా భారత కథే
ఒక అబద్ధాల పుట్ట !

యుద్ధం ఎలా జరిగింది
పాండవులు ఎలా గెల్చిందీ
అందరకూ తెల్సిన కథే !

మానవ నీతి నియమ ధర్మాలన్నీ
ధిక్కరించ బడ్డ చరమాంకం కురుక్షేత్రం
బహుశా వ్యాసుడు ధర్మక్షేత్రం అన్నాడంటే
అది సహజ ప్రకృతి ధర్మం అని !

*(గీత లోని ఒక శ్లోకానికి)*

## 68. గత సాహిత్యం

శోధింపన్ బడె సర్వ శాస్త్రములు, ర
    క్షో వీర నాశం కృతుల్,
గాథా బద్ధ పురాణముల్, నృపుల రా
    గ ద్వేష కావ్యాలు, దు
ర్మే ధోన్మత్త ప్రవక్త లల్లినవి లా
    రీ లుండె ! ఇన్నింట నా
బాధల్ తీర్చెడి దొక్క టైన కలదా ?
    బావా ! నిజం చెప్పవా ?

*(పోతన్న గారి పద్యానికి)*

## 69. అమర ప్రోక్తం

మన పూర్వుడు బ్రహ్మణ సుతు
డని అమర నిఘంటు వనును, అదె సత్యము చె
ప్పు నిరుద్ధ భారతమ్మును ;
మన చరితలు చదువ రేల మామా యువకుల్ !

## 70. రూట్సు

త్రవ్వె నాఫ్రికానె తన జాతి రూట్సు కై
తెల్ల నేల నల్ల పిల్ల డొకడు
భరత జాతి నీది, భారతమే నీది
చదివి చూడు వ్యాస చరిత, దళిత !

## 71. లంచ లక్ష్మి

ఇందు గల, దందు లేదను
టెందుకు లంచమ్ము ? రాముడే గొనె చంద్రున్ !
అందరును లంచ లక్ష్మికి
అందలమున్ బట్టు, డేల అవమానింపన్ ?
*(పోతన్న గారి పద్యానికి)*

## 72. బకాసురులు

అకవులు కుకవులు పైబడి
సుకవిన్ అస్పృశ్యు డంద్రు శుభముల కెల్లన్ !
బకుల వలె తామె తిందురు
సకల పురస్కారములును, సత్కారములున్ !

## 73. బెదురు గొడ్డు మనసు

నాలో కలిగే ప్రతి నొగులూ గుబులు పుట్టించి,
ప్రతి అనారోగ్యమూ ప్రాణాంతకమే అనుకొంటూ
దిగులు పడిపోతుంది నా మనస్సు !
దిగంతాలకు పారి పోతుంది మతి చెడి
వట్టి చెదురు గొడ్డు నా మనస్సు !

## 74. కుక్క మనసు

కుక్క బోలు మనసు కోరిన పని చేయ
నేర్ప వలయు ముందె ఓర్పు తోడ,
లేని యెడల సంతకై నను పోదది
రంతు చేయుచుండు రాత్రి పగలు !

## 75. పైరవీ ప్రైజులు

పైరవీలకు తప్ప ఏ ప్రైజు రాదు
పలుకుబడి తోడ తప్ప అవార్డు లేదు
వ్యక్తి గతములు రాజకీయమ్ము లెల్ల !
కవితకును, సృష్టికిని కలుగదు విముక్తి !

# 76. తాతా మనమల తీర్థ యాత్ర

తాతయ్యా ?

ఏమిట్రా గాడిదా ! మళ్ళేమయ్యింది ?

తాతయ్యా ! నీకు విసుగెక్కువ, కోపం మరీ ఎక్కువ !

ఏడ్చావు గానీ, ఏమిటో చెప్పు ?

తాతయ్యా ! మనిద్దరం కలిసే ప్రయాణం చేస్తున్నాం కదా ?

అవును !

అదెలా ?

మన గమ్యం పడమటి తీరంలోని

పుణ్యక్షేత్రం, అక్కడి జాతర !

నువ్వు జాతర చూసుకొని తిరిగి పోతున్న వాడివి

నేను జాతర చూడడానికి ముందుకు పోతున్న వాడిని

మరి, మనం ఇద్దరం కలిసే ప్రయాణం చేస్తున్నాం ఏమిటి ?

అదంతేరా,

అది కాలగమనంలోని సహజ లక్షణం !

## 77. రౌడీ చేతి కత్తి

తోకే కుక్కనాడిస్తున్నది
పులిమచ్చ లద్దుకుని !
రౌడీ చేతి కత్తే రాజ్యాలు కొల్ల గొడ్తున్నది
చంపుతా నని బెదరించి, తాను చావడానికి సిద్ధపడీ !

## 78. అక్కరకు రాని హితులు

దిన మెల్ల వచ్చి పోయెడి
ఘనులం దిపు డొక్కడేని కనపించడు, షా
పున కేగ, మందు లేవో
కొని తేవగ నెవడు లేడు, కూతురు తప్పన్ !

## 79. పంది అవార్డులు

నంది అవార్డులు వలెనే
పంది అవార్డులును కూడా ప్రజ లిచ్చినచో
నందులు పందుల ఉమ్మడి
సుందర బందర సమాజ సుధ పుట్టదొకో !

## 80. హక్కులు

హక్కులు మైనార్టీలకె,
కుక్కలు యజమాన్ల దొడ్డి గుమ్మమ్ములకే,
బొక్కలు గుడిసెలకే, ఈ
లెక్కలు బుక్కులకె, ముష్టి లీలలు భీమ్నా !

## 81. ఆశే ఈశ

దేశ మేలు నాశ దిల్లీకి గొంపోయి
పార్లమెంటు చేర్చి పదవి నొసగె
అన్ని సంపదలకు ఆశయె మూలమ్ము
నేల బారు కవిత లేల ? వేమ !

*(నీళ్ళలోని చేప అనే వేమన పద్యానికి)*

## 82. మాస్కులు

అగ్ని దేవు భార్య అన్ని మోములు మార్చి
భర్త నెట్లు తృప్తి పరచ గల్గె ?
కామ రూప విద్య కా, దవి మాస్కులే !
నేడె కాదు, నాడు కూడ కలవు !

# 83. జీవితం లో స్థిరపడడం

ఒక గ్రామంలో నల్గురు మిత్రులు
నల్గురూ ప్రాథమిక విద్య పూర్తి చేసారు.

అందులో ఒకడు అక్కడే ఉండిపోయి
చిన్న దుకాణం పెట్టుకున్నాడు
తక్కిన ముగ్గురూ హైస్కూలులో చేరారు.

అందులో ఒక్కడు అక్కడే
ఏదో ఉద్యోగంలో చేరగా
తక్కిన ఇద్దరు కాలేజీకి పోయారు.

ఆ ఇద్దరిలో ఒక్కడు అక్కడే
ఒక కలవారి అమ్మాయిని పెళ్ళాడి
పట్నంలో ఉండి పోగా, మిగిలిన వాడు
నగరం పోయి యూనివర్సిటీలో చేరాడు.
అలా ఆ నల్గురూ స్థిర పడ్డారు.

యూనివర్సిటీలో చేరినవాడు
చదువుల చివరంటా చూచి

చివరకు వైస్ చాన్సలరుగా రిటైరు అయినాడు,
ఒక మేడ కట్టుకున్నాడు,
ఒక పాత కారు కొనుక్కుని కాలక్షేపం చేస్తున్నాడు.

మధ్య లోని ఇద్దరి అడ్రసులూ
మనకు తెలియవు, బాగానే ఉండి ఉంటారు.

గ్రామంలోనే ఉండి పోయిన వాడు
వ్యాపారం వృద్ధి చేసుకుని లక్షాధికారి అయ్యాడు,
లక్ష్యాలను పెంచు కుంటూ పోయాడు,
ఎన్నికలలో గెలిచాడు, మంత్రి అయ్యాడు.
సాంస్కృతిక బృందాలతో కలసి విదేశాలకు
కూడా పోయి వస్తున్నాడు !

జీవితంలో స్థిరపడడం అంటే ఇదీ !
జీవ శక్తీ లక్ష్య శుద్ధీ తప్ప
పల్లె పట్టణ భేదా లుండవు.

## 84. సైరా చిన్నప రెడ్డి

సైరా, చిన్నాప రెడ్డీ ! నీ
పేరే బంగారూ కడ్డీ ! ॥సై॥

ప్రజలను దోచే దొరలను
పట్టుకు బంధించావు !
బంధా లిక తెగ వనుకుని
భద్రత ప్రకటించావు ॥సై॥

మునిసిపాలిటీ వీధు లయినా
రాజ రాజుల మేడ లయినా
రోజు కొక సారయిన గాని
బూజు దులపక తప్పదన్నా ॥సై॥

మానవులు సృష్టించు మురికి యె
దానవులు రా తమ్ముడా !
తుడిచి పోసే చెత్త కాదది
విడిచి పెడితే తీయు ప్రాణం !
కాల్చి బూడిద చేయవలె రా
కనికరము విడనాడవలె రా ॥సై॥

సూటిగా పలికావు, ముక్కుకు
సూటిగా పోయావు కానీ
నరులు ఖలులని, నర నరాన
విషము కలదని మరచినావు ॥సై॥

మనిషి మారడు, స్వార్థపరుడు,
తలలు తీసి, తలలు మార్చి
తానే ముందుకు పోవువాడు !
కొట్టి వదలకు తమ్ముడా అని
అంతగా చెప్పితిని కదరా ॥సై॥

## 85. ఇద్దరూ మహాకవులే

రాశులను మ్రింగ నన్నాడు రాళ్ళు వేమ్న ;
మ్రింగు నన్నాడు, దేశ దారిద్ర్య మెల్ల
అది యె నన్నాడు జాష్వ ! ఎయ్యది నిజమ్మొ ?
ఏది వ్యంగ్యమొ ? ఎవడు శోధించువాడు !

## 86. విడి విడి కంచాలు

నలిన భవ ప్రభాత, మజ
నాభము, హైందవ; మందు ఎవ్వరే
కులమొ వచింప, రందరును
కూడి మెజారిటి కాన ; ముస్లిముల్,
దళితుల మాత్ర మేల తమ
దైన్యము చాటుచు మొత్తుకొందురో !
కలసి భుజింప మేలు, విడి
కంచము లుండుట కష్ట మీ పయిన్ !

## 87. ఓడి గెల్చిన వాడు

పరమ శివు రొమ్ము నాటితి శరము లైదు ,
భగ్గ మన్నది ఒడలు ఎవ్వరిదో ? నాదే !
బాణముల గూడి నా పంచ ప్రాణములను
బ్రతికె నారీతి, తను వొండె భస్మమయ్యె !

అతను డనె అయ్యు గెల్చితి నతని నేను
గెల్చియును ఓడిపోయిన కీల అతడు !
నా కథయె కాదు, ఇది యెల్ల నీ కథయును,
మా కుమారుడ నేను, ఉమా కుమార !

# 88. నక్షత్ర శోభ

ఎల్ల యెడల కరెంటు పోయిన తమస్సు,
కనుల పండువ చేయు నక్షత్ర శోభ,
ముద్ద బంతులు, మందారములు, గులాబ్లు
రాశులుగ పూచి తగులు కరాగ్రములకు !

నందన వనమ్ము కిందకో, బృంద పైకో
యాత్ర కదలి వచ్చినవో ఉగాది కొరకు,
రంభలును, రాధలును పూర్ణ కుంభములతో
రస వసంతము లాడుదు రన్ని యెడల !

ఫాల్గున కుహువు, చైత్ర ప్రభాత వధువు
ప్రథమ సంయోగ మధు రోత్సవమ్ము లోన
నేను బహుధాన్యనై పరువు లెత్తినాను
తారకేశ్వర శోభ నోద్యానమెల్ల !

## 89. పదవి విలువ

ధన మిచ్చి పుచ్చు కొందురు,
చన విచ్చియు పుచ్చు కొందురు, స్వ సుఖోన్నతికై !
మనుజుల నమ్మకు పూర్తిగ
ప్రణయమ్ము కంటే విలువ పదవిది, భీమా !

## 90. గత జన్మలు

సృష్టి లోని ప్రతి సవ్వడి ఒక భాష
ప్రతి శబ్దమూ ఒక భాష
ప్రతి స్వరమూ ఒక భాష

ఏదో ఒక చెట్టు భాష
పక్షి భాష, జంతువు భాష
నాద బ్రహ్మ కదలికలే భాషలు

సర్వ భాషా సమన్వయ నిఘంటువే మనిషి మెదడు !
పునర్జన్మ సిద్ధాంతాన్ని నమ్మే ఏ మనిషైనా
తన గత జన్మను గురించి ఆలోచిస్తాడు
గత జన్మలో తాను ఏమిటి అయి ఉండవచ్చునో

ఊహిస్తూ ఉంటాడు.
ఈ ఆలోచనా సరళి అంతా పునశ్చరణ మౌతూ
అతని మెదడులో ముద్రిత మవుతూ ఉంటుంది.

ఒక మనిషిని ట్రాన్సు లోకి తీసుకు వెళ్ళి నపుడు
వెనక్కి బాల్యం లోకి, తల్లి గర్భంలోకి,
ఇంకా అవతల వైపుకు తీసుకు వెళ్ళినపుడు
తాను అప్పుడు ఆ భాషను కూడా మాట్లడతాడు.

తాను పిచ్చుక అనుకుంటే కిచ కిచ అంటాడు.
కుక్క అనుకుంటే భౌభౌ అంటాడు.
రష్యన్ అనుకుంటే రష్యా భాష మాట్లాడతాడు.
జర్మన్ అనుకుంటే జర్మను భాష మాట్లాడతాడు.

ఇదంతా తాను ఊహించు కొన్నదే
మెదడులో ముద్రించు కొన్నదే.

మనో విలాసం, ఇంద్రజాలం.
వాస్తవంగా ఇవి గత జన్మలు కావు.

గత జన్మల భావన దేవుడు లాంటిదే
ఒక ఊహ !

## 91. పత్తి తోట రాజకీయం

ఆకటి కన్నవు లోటా,
లేకికి కట్నాల మూట, లేబరు బస్తీ
మూకకు జనతా కోటా,
కాకుండిన, పత్తి తోట ! కవి చౌడప్పా !

*(ఒక కవి చౌడప్ప పద్యానికి)*

## 92. తోడేలు – గొర్రె పిల్ల కథ

బల వంతులు వెంట్రుకను పూజిస్తే
అది ఒక పవిత్ర దైవ పూజ;
బలహీనులు స్వర్ణ విగ్రహంలో దైవాన్ని దర్శించినా
అది అపవిత్ర నీచ కార్యం.
మానవ చరిత్ర పొడుగునా ఇదే కథ
ఈ తోడేలు – గొర్రె పిల్ల కథే !

## 93. వలపుల వలలు

తొలి వలపు లమృత మధువులు
కల బోసిన కళలు, కలలు, కల హంసలు ; ఆ
వల వలలు, గాలి వానలు,
అలకలు, పంచాయితీలు, అమవస నిశలున్ !

## 94. దేహ ముండేనా ?

తినిన అరగ కుండు, తిన కున్న నీర్సమౌ,
పూర్తి బెడ్డు రెస్టు పుణ్య మిదియె !
దెబ్బ మాను సరికి దేహ ముండునో లేదో
ముఖ్య అతిథి నయ్యు మూల బడితి !

చూడ వత్తు మనుచు సొంత చారుల చేత
మాట పంపి నట్టి మహితు లకును
జ్ఞాపకమ్మె లేని జన నాధులకు కూడ
శుభము లిందు కలవు, చూచు కొండు !

## 95. గాయం x ఆయం

గాయ మింతె అయిన కల కాల మున్నచో
ఆయ మెంత దైన ఆరి పోవు,
దాట వేసి పోవు ధన్వంతరియె యైన
విశ్వ జనని కూడ విసిగి పోవు !

## 96. అంతా తప్పే

వద్దనిన తప్పు, తప్పు కావలయు ననిన
పిలువ తప్పేను, ముప్పేను పిలువ కున్న
నిస్సాహాయత పడి యున్న నిర్ధనునకు,
యోగ నిద్రేశు డెరుగ డీ రోగి పాట్లు !

## 97. సహజ వైరము

నక్క నూత బడిన నలుగురు నాలుగు
రాళ్ళు రువ్వి పోదురనుట నిజము,
గోవుగోత బడిన గోమాయువులు నట్లె !
సహజ వైర మెట్లు చచ్చు ? భీమ్నా !

## 98. నోటి తీట

మంచి నీరు కాని, మజ్జిగ యే కాని
ఐసు క్రీము గాని, జ్యూసు గాని
నోటి తీట తీర్చు ఊటేదో అందిమ్ము!
లేవ లేను, నీవే లేపు కొమ్మ!

## 99. నోరు -ఊరు

నోరు మంచి దైన ఊరు మంచి దౌను
అనెడి మాట బిచ్చ కొనెడి మాట !
ఊరు తీరు బట్టి నోరు తీరును నుండు,
ఊరు నేలు నొక్క నోరె , భీమ్నా !

## 100. భజామ్యహం

ఆపదాం అప హర్తారం
దాతారం సర్వ సంపదాం
సత్యం సుందరం శివం తాం
భూయో భూయో భజామ్యహం !

## 101. కవిని నేను

కవిని నేను , నా చుట్టును కలుగు వారు
నాగరీకులు , నవ్వరు , నవ్వు కోరు !
అందుకే కంద కూన లానంద మీయ
ఆట వెలదుల గూడి నే నాడుకొందు !

## 102. కాంత లే అర్హులు

నిండు మనంబు నవ్య నవ
నీత సమానము , పల్కు దారుణా
ఖండల శస్త్ర తుల్యము , జ
గజ్జన వంద్యులు కాంతలందు , ఈ
రెండును పుర్షు లందు విప
రీతము కావున , నేటి భగ్న భూ
ఖండము నేల నర్హు లొక
కాంతలె , పుర్షులు వ్యర్థులన్నిటన్ !

( నన్నయ గారి పద్యానికి )

## 103. బంకనేలలు

రామ నవమి నాడు రామ దండొక యేడు
విశ్వ జనకు డిడిన విందు గుడిచి
పానకము తాగి పరిగెత్తె గంగకు
గంగ నాటి నుంచి గౌతమి గా మారె

## 104. కావ్య నాయకులు

కావ్య నాయకులకు దివ్యత్వమును గూర్చి ,
దేవ గణము జేర్చి , దీప ముంచి
బలులు పెట్టి తామె భక్షింత్రు కడుపార
ఈశ్వరత్వ గాథ ఇదియె భీమ్నా !

## 105. చుక్క బొట్టు

అడ్డ బొట్టు దారి నడ్డి ధర్నా చేయ
నిలువు బొట్టు బస్సు నిలిపి కాల్చె
చుక్క బొట్టు చుట్టు చూచి దోచుకు పోయె
సూర్య చంద్రు లెల్ల చుక్క బొట్లె !

## 106. యుద్ధము

ఆయు మధికార పక్షము ,
గాయము ప్రతి పక్ష , మెంత కాలమొ ఈ గా
డాయుధ సమరము నా ఈ •
కాయము పై ? స్పర్థ కేమి కతమో , భీమ్నా !

## 107. వోట్ల గొడ్లు

పదుగు రాడు మాట పాడియై ధర జెల్లు
నేటి ప్రజల రాజ్య నీతి అదియె !
గొల్ల వా డొకండు , గొర్రెలు పదివేలు
గొర్రె లనగ వోట్ల గొడ్లు , వేమ !

## 108. ప్రజల వోట్లు

అవని నే ప్రవక్త యైన నొక్కొక్కడె
ఒక్కడాడు మాట ఎక్కె నెందు ?
ప్రజల వోట్ల రాజ్య పదవులే మొదవులు
పాలు వెన్న జున్ను చాలు , వేమ !

## 109. సెక్సు కారణం

శాంతి ఛిద్రమై కొట్టుకు చచ్చి రనిన
ఛిద్ర హేతువు తరచుగా సెక్సె అవును ,
కుల మతమ్ముల బురదను పులిమి దొరలు
శాంతిని సమాధి చేతురు శాశ్వతముగ !

## 110. కలి కాలమా ?

కుల మతములు , కుడి ఎడమలు
కలుములు లేములును కలవు కల కాలముగా
కలిసుండరె నరు ? లంతః
కలహము లిపుడేల పెరిగె ? కానవె , భీమ్నా !

## 111. రవి చంద్ర

కవిత చెప్పగ వచ్చు లేఖకులు గలుగ ,
ప్రెస్సు  కాపీ తయారీ నాపెను ముఖారి
నా యదృష్టము రవిచంద్ర , వ్రాయ గలిగె !
అతడు రాకున్న ఈ గ్రంథ మచ్చు కాదు !

## 112. కటి క్షతము

తగిలిన వెన్నో క్షతములు
నగు మోమును మార్చ లేదు నఖ దంతాదుల్
వగలాడి కటి క్షత మిది
సగ మైతిని మూడు నెలల సాంగత్యముతో !

## 113. విగ్రహ ప్రతిష్ఠ

ప్రతిభ గల్గు వాని భరియింప రెవ్వరు ,
హత్య చేసి విగ్రహముగ నిల్పి
అగ్ర పంక్తి ఫలము లారగించుచు నుంద్రు
సంఘ నీతి సర్వ సమతె , భీమ్నా !

## 114. మేటి మణులు

రాజకీయ రంగరాజు సంజీవయ్య
ప్రాభవ ప్రధాని మాధవుండు
బోయి భీమ్న కావ్య భూస్వామి , ముగ్గురు
నేటి భారతమున మేటి మణులు

## 115. తల నొప్పి

స్త్రీలు, దళితులు, మైనారిటీలు నేటి
భారతమ్మ కు తలనొప్పి కారణములు,
సుగుణములె మారి దోషము లగును, కాన
కటు కముల కషాయములె అన్నిటికి మందు !

## 116. నరకంలో విందులు

ఆత్మకాల దనెను ఆ కృష్ణ దేవుడు,
కాలు ననిరి తన్మతాల వారు !
మంట లందు కాల్చి, వంట నూనెల వేల్చి
నరక విందులందు నంజు కొందురు !

## 117. అంబేడ్కరు శిష్యులు

అంబేడ్కర దిన కార్యము
లంబేడ్కర జనులె చేయు, డరి పక్ష ప్రభు
త్వంబులు చేయుట తగునే ?
అంబేడ్కరిజంబు దాన నంతము కాదే ?

## 118. అంబేద్కరు పై హక్కు

ముంబై కి మాత్రమేనా,
అంబేద్కరు మీద హక్కు అవనికి లేదా ?
అంబేద్కరు మాటల క
ర్థంబులు మార్చంగ తగున తత్ శిష్యులకున్ ?

## 119. పెన్సిలు పైకెత్తి

వెల్లకిల పండుకొని, పైకి పెన్సిలూని
తేనె తీయుదు, ఇది మీకె, తీసుకొండు !
గొప్పవారి వంటల కేగు గొర్రెలార !
జీవ గమ్యము గూర్చి యోచించు కొండు !

## 120. కూర బ్రతుకు

పూట కూళ్ళ తిండి, హోటళ్ళ ఘన విందు
గొర్రె కేది యైన కూర బ్రతుకె !
నమ్మి వెంట బడుట, నంజుకు తిన బడుటె
వారసత్వ మింక వదలు, భీమ్నా !

## 121. మెర్సీ కిల్లింగ్

మెర్సీ కిల్లింగ్ అను నొక
వెర్సింపులు సూత్ర ముండు వెజ్జులు ! నాపై
మెర్సీ చూపగా లేరా ?
పర్సెంతయో లేదు గాని, ప్రాణము లిత్తున్ !

*(వెర్సింపుల్ = వెరీ సింపుల్)*

## 122. సీతా రాముల కొడుకు

సీతమ్మా మా అమ్మా
శ్రీ రాముడు మా తండ్రీ !
ఎవరు నాయనా అదీ ?
నేను, తల్లీ
అడుక్కొనే వోణ్ణి !
సీతా రాముల కొడుకువా,
మరి, అడుక్కు తింటున్నావేమి ?

## 123. పున్నయ్య గారి ఆజ్ఞ

రోజులు బాగుండియే జారి పడితి నే
మో అంటి వప్పు, ఏమో కాదు, సత్యమే !
తెలుగు కవితకు కొత్త వెలుగిమ్ము, భీమనా
అనిరి పున్నయ గారు ఆజ్ఞ అంటిని నేను !

## 124. బ్రహ్మ జిజ్ఞాస

బ్రహ్మ జిజ్ఞాస ఫలితమే బ్రహ్మ విద్య,
తెలుసుకోవలె నను కుతూహలమె అద్ది,
తత్వ నైజము గూర్చి ఇంతటి రిసెర్చి
లేదు ఆనాడు, ఈనాడు లేదు జగతి !

## 125. నక్క నాయకత్వం

నరుడు పేడి అయ్యె, నక్క నాయకుడయ్యె,
చీకు బొక్కలయ్యె క్షేమ నిధులు,
త్యాగ ధనుల విగ్రహపు రాళ్ళె రాశులు
మింగుచున్న, నేమి ట్రిక్కొ ? వేమా !

## 126. బెంగ - భయము

ఉనికి జేర భయము, ఉద్యోగమున కేగ
బెంగ, నడుమ నెంత ప్రెషరు, టెన్సు !
బాధకంటె నన్ను పల్లవి గూర్చిన
చింత వంత లెంతో ఛిద్ర పరచు !

## 127. పల్లవి

చింత దాచు కొన్న చిరు నవ్వు దేవత,
నిత్య సేవ లొసగు నేల తల్లి,
శ్రీ సితారు పైనె సింధూర పల్లవి
త్యాగ రాశి, హిమ సుతా కుమారి !

## 128. ఒకే తల్లి

అందరికే ఒకే తల్లి
భారత మాత !
    అని చెప్పిన మహా కవీ
    చెప్ప వేమీ తండ్రు లెవరో ?
తల్లి ఒకతె అన్నావు
తండ్రు లెందరో చెప్పవు,
    మతాని కొక డున్నాడా ?
    భాషకు నొక డుంటాడా ?
పతి వ్రతల జాతి నెంత
పతితను గావించావు !
    బాస్టర్లుగ సిగ్గు మాలి
    బాంచవు గా బ్రతికేవా ?

## 129. నేనూ మనిషినే

నరుడ నేను, నైజ గుణాలు నాకు నుండు,
అహము సింహము, తిని వేయు నాగ్రహింప !
రాకు డెవ్వరు నను బిల్వ, బ్రతికి యున్న
నేనె వత్తును బిల్వ కుండినను, భీమ్నా !

## 130. ముద్దిచ్చే భార్య

కోప తాపాల కంతు లేకున్నగాని
ఒట్లు తిట్లును హింసించు చున్నగాని
మరచి యైనను ముద్దిచ్చు మగువ గలుగు
భర్త భరియించ గల డెన్ని బాధ లైన !

## 131. ఆడి తప్పడం

నను వీడిన వారికి తమ
పను లుండవె తమకు ? తప్పు పట్టను ; ఎవరై
నను మాట తప్పనేలా ?
నను మోసము చేయ నేల ? న్యాయమె ? భీష్మా !

## 132. కాకర కాయల గంప

సాత్వి కేతర గుణ మెంత శాత మున్న,
కొంప కాకర కాయుల గంపె అయిన,
గుండె ప్రమిదలో ఆర్ద్రత యుండె నేని
పత్ని యగు నిరంతర రసాద్వైత మూర్తి !

## 133. అందరితో పోలిక

అందరితో నను బోల్చుట
సందులతో రాచబాట సరి పోల్చుటయే
కుందనపు బొమ్మ కీడే
బెందులు పది వేలు ? ప్రజలు బిక్కులు, భీమ్నా !

## 134. తల్లి దండ్రుల తలపులు

తలి దండ్రుల కుండు నెవో
తలపులు, తీర్చుకొననెంత్రు తనుజుల ద్వారా ;
సెలగకుడు వెర్రి తలలని
మలి సంధ్యకు పోవ తొలియు మలగును, భీమ్నా !

## 135. ఎనభై దాటిన

ఎనభై దాటిన వృద్ధుడు
చని పోవలె కాని, బ్రతికి జగమేలు నుకో ?
అనుకోకు నన్ను గూర్చియు
అనుభవములు నావి గ్రోలు మమృతము, భీమ్నా !

## 136. పనిలో పని

తానే చేయక తప్పని
హీనపు పను లెన్నో కల్గు, నేడ్వకు మీ ! నా
కే నేను చేసు కొనుచు
న్నా ననుకొన నెల్ల నయమగు, భీమ్నా !

## 137. గుత్త రాజకీయం

కల్లు సార నేర గాడికి వోటిచ్చి,
(అధి) కార మిచ్చి, కొత్త కారు నీయ
ప్రాజ్ఞు లైన వారి పడ గుద్దు కొని పోవు !
కొత్త రాజ నీతి గొప్ప భీమ్నా !

*(1966 ప్రాంతంలోని కారే మంత్రులు అనే పద్యంతో పాటు)*

## 138. కృతఘ్నత

ఆపదలోలోన నా సహాయము బ్రతికి,
ఇపుడు ననుచూచి బెదురుదు రే లొ సఖులు ?
నా సరస్వతి కోస మే నగనో తెచ్చి,
ఊడ బెరుకుక పో నెంతు రున్నదియును !

## 139. పైపై మాటలు

దూర మందుండి, నను గూర్చి దుఃఖ పడుచు
ఫోను చేతురు ; వత్తురె పో, క్షణమ్ము
చూచి పోదురు, పని చెప్ప లేచి పోదు,
రతి విచిత్రము కొందరి మతము, భీమ్నా!

## 140. ఏ పనైనా బ్రతకడానికే

ఏ పుణ్యము, లే పాపము,
లే పనులకు ఫలములగునో యెరుగను ; పశ్చా
త్తాపము లే దే పనులకు,
ఏ పని చేసినను మనుటకే కద ? భీమ్నా !

## 141. నిద్ర లేపడం

నిన్ను నిద్ర లేపుట ఒక చిన్న యుద్ధ
రంగమే, కాన నీ జోలి రారు ఎవరు
మేము నంతియు ! కాని నీ మోము చూడ
ఉదయ రవి చంద్రికలు వచ్చి, రిదిగో, లెమ్ము!

## 142. కవితా చోరులు

బైబిలు సూక్తులు పేర్కొని
నోబెలు ప్రై జొకడు పొందు, నూత్నము లని ఏ
వో బాసల విలువల తో
జేబులు నింపుకొను మరొక సిద్ధుడు, భీమ్నా !

## 143. హృదయమున్న వాళ్ళు

తనదు బావ మాట తప్పిన, తా నెంతో
కలత పడెడు వాడు కలడె నేడు ?
ఒక నరేంద్ర నాము డుండెను ! ఎపు డైన
నుంద్రు మంచి మనుషు లుర్వి, భీమ్నా

## 144. ఎవరో ఉంటారు

కాయ ముండియు లేనట్లె గాయ పడుట !
కవిత చెప్పెద, వ్రాయు వా రెవరు తల్లీ !
లేరే ఎవరును ? రవిచంద్ర లేడే నీకు ?
వ్రాయుటయే కాదు, అచ్చును వేయ గలడు !

## 145. భయ మెందుకు

లేడికి పులి భయమున్నది,
కోడికి యజమాని భయము ; కోకిల కేమౌ ?
పాడుకొను నేదొ నిత్యము
ఆడుట పాడుటయే బ్రతుకు కర్థము, భీమ్నా !

## 146. నాది తిన్న వాళ్ళే

నీ కెందుకు తోడ్పడ వలె ?
మా కేమిటి లాభ మనెడి మహితులు, తామే
దో కొంచె మ్మైన గతమున
నా కలిమిని తిన్న వాళ్ళే, నవ్వకు, భీమ్నా !

## 147. బ్రతికి లేనా ?

బ్రతికి యుండగనే నన్ను బ్రతికి యున్న
వారి లిస్టు నుండియె కొట్టి వైచినారు !
రావు ఇన్విటేషనులు సర్కారు వేని,
లేవు అంబేడ్కరు జయంతి లేఖ లేని !

*(14. 4. 98 అంబేడ్కరు జయంతి)*

## 148. నా గొప్పతనము

పనికి రా నేను నాకైన ననగ వలదు ,
ఆస్ట్రియా నుంచి ఆహ్వాన మదిగో చూడు !
రమ్మనగ వచ్చు స్వయముగా రంభ రేపు !
చెప్పు కొని ఏడ్వ గలరు నా గొప్ప తనము !

## 149. అంతా నాదే

శ్రీ కాకుళము నుండి చిత్తూరు మీదుగా
మెదకు దాక నాదె , మిత్రు లార !
ఈ త్రిలింగ దేశ మెల్ల నాదే, నేను
బోయి భీమ్న, సిన్రె భాయి భీమ్నా !

*( భీమ్న= భీమన్న, సిన్రె=సి.నా.రె )*

## 150. అమ్మ, కొమ్మ , రెమ్మ

బాల్య మెల్లను అమ్మ, ఆపైని కొమ్మ
కొమ్మ పై రెమ్మ, రెమ్మల గుమ్మ లొసగు
బృంద గానమ్ము ఇది, పల్లవీ స్వరోక్తి !
నా పున శ్శక్తి, తుది బాల్య నవమ తల్లి !

## 151. అం ధేం దూదయముల్

అం ధేం దూదయముల్, మహా బధిర శం
ఖా రావముల్, మూఢ సత్
గ్రంథాఖ్యాపనముల్, నపుంసక వధూ
కాంక్షల్, కృతఘ్నావళీ
బంధుత్వంబులు , భస్మ హవ్యములు , లు
బ్ధ ద్రవ్యముల్ , మూక సత్
గంధంబుల్, మనుజత్వ వర్జితుల గు
ప్త స్వార్థ సౌభాగ్య ముల్ !

*( పోతన గారి పద్యానికి )*

## 152. నా సర్వస్వం

నా సేవకె పుట్టిన యటు ,
నా సర్వము తామె యగుచు , నా స్వస్థత యే
నా సాహితిగా మెలగెడి
నా సతియును సుత లు నాకు నానార్థ కృతుల్ !

## 153. బుర్రె కథ

(బుర్ర కథను ముగ్గురు వ్యక్తులు చెపుతారు, ఇక్కడ నేను మూడు పాత్రలనూ విడివిడిగా పేర్కొనడం లేదు . స్వర భేదాలను బట్టి గుర్తించాలి. )

వినరా , భారత బీర కుమారా
విజయం నీదేరా !

బీర కాదురా బాబూ , సై
బీరు అనాలిరా , తందానా !
నీదే అన గూడదురా , బాబూ
మనదే అనవలె రా !

వినరా, భారత బీరు కుమారా
విజయం నీదేరా !

నాది అనుటయే సబబురా, సై
నీది సెక్యులరు పార్టీ రా, సై
గెల్చిన పార్టీయే నీదిరా, సై
నీకు ఓటమియె లేదురా, సై
అందుకె , విజయం నీదేరా ! ॥విన॥

## 2

అనగనగా ఒక దేశ మున్నదీ
దాని పేరు బురద
దాని నేలెడు రాజొక డుండె
అతడి పేరు దురద ॥విన॥

అదేం పేరురా భాయి ?
అసలు పేరు చెప్ప వోయీ !

భళా భళా నోరి తమ్ముడా !
మేలు భళా నోరి తందాన,
అడిగావు కాబట్టి చెపుతున్నారా
అసలు పేరు ఆషాడ భూతిరా ! ॥భళా॥

బురద లోన జన్మించెరా, సై
బుద్ధి కలిగి వర్తించెరా, సై
రాజు కొలువులో చేరెరా, సై
రక్షక దళపతి ఆయెరా, సై
రాణీ గారిని వలలో పట్టి సై
రాజే అయి కూర్చుండెరా ॥భళా॥

రాజు కొలువులో చేరినాడు
రాజే కావడ మంత సులభమా ?

## 3

దురద బిరుదు గల వానికి, సై
దుస్తర మనునది లేదురా, సై
అసలైన ఆషాడ భూపతితకి, సై
అసాధ్య మే ఉండ బోదురా ॥విన॥

పంచ తంత్రములు తెలిసిన వాడు
బడా చోరు మన ఆషాడ భూతి,
నిర్విరామ గురు దేవ సేవలో
నిద్రాహారాల్ మానిన వాడు,
విశ్వ నరుల కందరికీ తనపై
విశ్వాసం కలిగించిన వాడు,
గురువు గారి కాసుల కంబళిని
గుట్టుగా కొట్టేసిన వాడు ! ॥విన॥

## 4

కాకులను కొట్టి గద్దలకు వేసి
మేకలను కోసి మెకములను పెంచి
దొంగలను ప్రోత్సహించెను , సై
తోకకు మేకకు వర్గ పోరాటం
విదేశాల కెగుమతులు పెంచెరా !
స్వదేశమే లేకుండా జేసెరా ॥భళా॥

బందులు, సమ్మెలు, బాంబు దాడులు
జిందా బాదులు, చితక బాదుటలు
అరుపులు, కేకలు అన్నీ తానై
అందరికీ తానే నాయకుడై
ప్రజా స్వామికపు ప్రభువైనాడు
ప్రతి పక్ష భయంకరు డైనాడు ॥విన॥

## 5

నిరు పేదలకు అన్న దానాలు
నిండుగ చేయించి, భళా భళి !
నిరుద్యోగులకు ముష్టి పైసలు
మెండుగ యిప్పించె భళా భళి !
గుడిసె వాసులకు చవుక బియ్యము
గొప్పగ అమ్మించె, భళా భళీ !
కోళ్ల ఫారములు, బర్రెల దొడ్లు
బ్యాంకు అప్పులు, వృత్తి పన్నులు
కుల కలహాలు, గూండా దాడులు
రిగ్గింగులతో, బెగ్గింగులతో

జాతిని ముక్కలు చేసీ, ఆ
ముక్కలు మూటలు గట్టీ ,
విదేశాల కెగుమతులు పెంచెరా !
స్వదేశమే లేకుండా జేసెరా ॥భళా॥

## 6

కథ చెప్పర, బాబు, కథ చెప్పరా
ఖాళీ కుర్చీ లిటే కదలి వస్తున్నాయి ! !

కథ లిప్పు డెక్క డున్నాయి రా, సై
కవితలు కూడా లేవురా, సై
పత్రికలు సైతం కాలే కడుపు కు ॥విన॥
మండె బూడిద వేస్తున్నెరా

తీరిక సమయం, తిండీ, కొంపా
వుండి నపుడే కదరా బాబూ ,
కమ్మని కలలూ, కళలూ, కాంతులు ?
సుఖ శాంతులు, బహు సౌందర్యాలు ?

ఆకటి చావులె కథలు, నేడు
ఆత్మ హత్యలే కవితలు !
రాజకీయాలు, లంచాలు, అబలల
పై దౌర్జన్యాలు వార్తలు ఏదిర సత్యం, శివం ?
ఎక్కడుందిరా సుందరం ? ॥విన॥

## 154. జన్మభూమికి జయము

జయము జయము
జయము జయము
జన్మ భూమికి జయము జయము,
జాతి ప్రగతికి జయము జయము ॥జ॥

జహ్ను సుతకు కవేర తనయకు
స్తన్య మొసగిన తెలుగు తల్లీకి ,
తెలుగు తల్లికి జయము జయము
వెలుగు వెల్లికి జయము జయము ॥జ॥

తెలుగు వెలుగుల తెలివి పండిన
దివికి జయము, భువికి జయము
సేతు శీత నాగేంద్ర రాజ్య
శ్రీ కి, ఆంధ్ర శ్రీ కి జయము ॥జ॥

## 155. బహుధాన్య

సిక్కు బెడ్డు పైనుండి చూచితిని, ఆ ర
వీంద్ర భారతి బహుధాన్య వేడుకలను !
వరియు, గోధుమ లేవందు, వరుస నెల్ల
గడ్డి ధాన్యాలె లేచి స్వాగతము పలికె !

*(28-3-98, ఉగాది)*

## 156. ఆ రోజులు మరి రావా ?

ఆనందమ్మున, అర్ధరాత్రముల, చం
ద్రా లోకముల్ కాయగ
నానా సైకత వీధులన్ వనములన్
నల్దిక్కులన్ శంభు, గౌ
రీ నాథున్, తరుణేందు శేఖరు, శివున్
శ్రీకంఠునిన్ పాడుచున్
ఆనందించిన రోజు లింక మరి రా
వా ? కోనసీమా మణీ !

## 157. సారా సంత

విశ్వాసం గల కుక్కలో
కే స్వామిని నమ్ముకొంద్రు ; కేసరి కొకటే
ఐశ్వర్యము ; నేడున్న ప్ర
జా స్వామ్యము కల్లు సారా సంతర భీమా !

## 158. లక్ష్మయ్య సూరి

ఇచ్చకము లాడి పోదురు హితులె అయ్యు ,
అవరసరార్థము లేమని అడుగ బోరు ;
సాధు ముదిరాజ మౌళి లక్ష్మయ్య సూరి
పంపిన యునాని కొంత నా బాధ తీర్చె !

## 159. సుగరు బ్రతుకులు

గుడ్డు ముట్ట రాదు, లడ్డూలు తినరాదు ,
నోట బెట్ట రాదు నూనె వంట !
సుఖము లేని వెతలు, సుగరున్న బ్రతుకులు
మేలు బ్రతుకున్న మృతియె, భీమ్నా !

## 160. సిపాయిల తిరుగుబాటు

అరయ నాడు సిపాయీల తిరుగుబాటు
గెలిచియున్న, భారతి తుగ్లకీ అయెడిది !
సమయమున కే మతంగుడు సాయ పడెనో
ఆంగ్ల హస్తము గెలుపొంది అభయ మిచ్చె !

## 161. ఆడుతూ పనేమిటి ?

ఆడుతు పాడుతు పని చేస్తుంటే
అలుపూ సలుపే మున్నది ?

కానీ – పైనొక ఖాయం దుంటే
తన్నులకు కొదవే మున్నది ? ॥ఆ॥

భూస్వాముల పిల్లలు సినిమాలలో
గెంతుట కాదోయ్ పని అంటే ! ॥ఆ॥

కండలు పిండి గుండెలలో తిం
డిని పండించుట పని అంటే ! ॥ఆ॥

గడి గడి గండం, నూరేళ్ళాయుసు
కార్మిక బ్రతుకుల నెరుగుదువా ?

ఆటలతోనె కడుపు నిండితే ?
ఆకలి ప్రశ్నే మున్నదీ ? ॥ఆ॥

*( ఒక సినిమా పాటకు )*

## 162. మాతంగ తనయ

దాస్యమే సుఖమైన హైందవ కులాలు
చింతిలవు రాజు లే విదేశీయు లైన ;
ఆత్మ గౌరవమే ప్రాణమైన భరత
మాత, మాతంగ తనయ ఏ రీతి నోర్చు ?

## 163. జాతీయ విధానము

రెండె జాతీయ పక్షము లుండ వలయు ,
నేత నందరు కలిసి ఎన్ను కొన వలయు ,
జాతి కొక దేశమై స్థిర స్థావరముగ !
కావలయు సోషలిజమె లోక వ్యవస్థ !

## 164. రాజధానికి నీరు

శ్రీ రామ సాగ రోర్మిలు
మా రాజ పురమ్ము చేరు మార్గము లేదా ?
హే రామ ! ఎందు బోతివి ?
క్షీరాబ్ధియు నెండిపోయె, క్షేమ మికేడన్ ?

## 165. జాతి కొక దేశం

జన్య సంబంధ శిష్ట లక్షణము లున్న
ప్రతి సమాజము జాతియై వరలు గాక
అట్టి ప్రతి జాతి ఒక దేశ మగుత, అట్టి
వెల్లను స్వతంత్రములుగ గణించబడుత !

## 166. పాదుకల నీడ

పాదములు దాసు లనగా
పాదాంగుష్ఠములు కినిసి ప్రళయము తేగా
పాదుకల నీడ బ్రతికెడి
వేదన మా భరత చరిత ; వినవె, నృసింహా !

*(నృసింహ శతకం లోని పద్యానికి)*

## 167. గాడిద లెవరో ?

మా కేమి వ్రాసె నని రట
కాకులకును అంటరాని గాడిద లెవరో ?
ఏ కాలపు పాలేళ్ళో ?
ఈ కొంచెపు చదువు కూడ ఎచటిది ? భీమ్నా ?

## 168. కృతక నీతులు

మ్రొక్కిన వరమిడు దేవత
లెక్కడ నున్నారో చెప్పు, మేగెద నటకున్ !
ఇకృతక నీతు లెందుకు ?
క్రక్కెదవో విషపు కన్య కరణిన్, సుమతి !

## 169. జాతీయ సోషలిజము

పెరగదు కులమ్ము, వర్గ మస్థిరము, కనుక
పనికి రావని జాతీయ పక్షములుగ ;
ఎల్ల కుల వర్గములు కూడి ఎల్ల పనులు
చూడు, డద్దియె జాతీయ సోషలిజము !

## 170. చిత్త వృత్తులు

వృత్తులే వర్గములు, చిత్త వృత్తు లవ్వి ;
మతములను నంతె ; కావున మనుజులార !
జాతి కొక దేశమ్మై సమస్యలను తీర్చి
విశ్వ మానవ జాతిగా విరిసి మనుడు !

## 171. యజ్ఞ నారాయణుడు

పూర్వ పరిషత్తు హితుడు, జూపూడి వంశ
యజ్ఞ నారాయణుడు పోయెనన్న వార్త
చదివి, తడి తడిగా తదక్షరము లుడుగ,
చదవ లే నైతి వార్త వట్టి దనుకొంటి !

## 172. ఎస్.ఎన్. బూసి

శ్రీ సారస్వతు డెస్సెన్
బూసి, సుభామణి సమర్థ భోజుడు నాకున్
ఈ సూక్తి ముక్త వెలుగును
చూసిన దన తద్వదాన్య శోభయె, భీమ్నా !

## 173. మూఢులతో వాదం

మూఢులతో వాద మేల ? న
వోఢలకున్ సరస మేల వృద్ధులతో, ఆ
రూఢ మనస్కుల కేలా
గూఢాచారుల తో పొత్తు ? కూడదు, భీమ్నా !

## 174. జై జననీ

జై జననీ !
జై భారత జననీ,
    జై జై జై జన్మ భూమి,
    జన్మ భూమి జయ భూమి ॥జై ॥

నీ చక్రం సుదర్శనం
నీ అస్త్రం పాశుపతం
    శివ కేశవ విజయరథం
    ప్రకృతి పురుష ప్రాణ పథం ॥జై ॥

నీది ఆది మానవతా
నీది వేద నాగరికత
నడుమ నడుమ ఎడమున్నా
నవ నిత్య జ్యోతి నీవు ॥జై ॥

తూర్పు పడమర వివేక చూడామణీ
ఉత్తర దక్షిణ ధ్రువాగ్ర క్రీడా ఘ్రుణీ
లోక జ్ఞానోదయ రవి కిరణా
ప్రాకృత విజ్ఞాన సర చ్చరణా ॥జై ॥

## 175. కొందరు ఖలులు

లోకములోన కొందరు ఖ
లుల్ సమతన్ భరియించ లేక అ
స్తోక బలాఢ్యు లైన దళి
తుల్ తమ ఆస్తుల బొంద కుండ, తా
టాకుల లోన వ్రాసిరి ప
రార్థము దొంగిల దోష మంచు ! ఆ
ఆకుల పాట నాపి, సక
లావని కిమ్ము శశాంక సౌఖ్యముల్ !

*(తారా శశాంకం లోని ఒక పద్యానికి)*

## 176. నిష్ఠ

కష్టము లందర కుండును ,
కష్టములే తలచు కొనుచు కలగకు, దృష్టా
దృష్టములయ్యవి, కావున
ఇష్టేష్టుల నిష్ఠ నుండు, మెప్పుడు, భీమ్నా !

## 177. చచ్చినా పైసలీయకు

జరయు, మృతియు లేని జననేత వలె నెల్ల
ధనము కొల్ల గొట్టి దాచు కొనుము !
యముడె వచ్చి ధర్మమడిగిన, ప్రాణమ్ము
లిమ్ము కాని, పైస లీయ వలదు !

*(భర్తృహరి పద్యానికి)*

## 178. పున్నయ్యగారి కోరిక

పున్నయార్యు కోర్కె పూర్తి అయినది, రెండు
వందలకును మించె పద్యరాశి,
పరిమళించు నిందు వాసియు రాశితో,
వంక లెన్ను జబ్బు వలదు, భీమ్నా !

## 179. భ్రమలు

ఎచటనో చూచినట్లున్నదిది అనంగ
ఎచటనో విన్న యట్లున్నదిది అనంగ
పోలికలు తెచ్చి భ్రమ పెట్టు పూర్వ స్మృతులు ;
భ్రమలపై కట్టకుడు సూత్ర భవనములను !

## 180. హారతులు

కాలక్షేపము కాదిది,
హేళన కావ్యమును కాదు, హృద్ధిత పద్య
శ్రీ లలితా హారతు లివి !
గ్రోలుము పూర్ణాయు రమృత గుళికలు, భీమ్నా !

## 181. పద్యమొక కావ్యము

ఈ మహా కావ్య వనములో ఋతువు లెల్ల
బృంద నృత్య గానముల నానంద పరచు,
పద్య మొక్కొక టొక కావ్యముగ విరియు
భ్రమర హృదయము లుండిన భావుకులకు !

## 182. ఆకటి యాత్ర

ఆయుష్షు పెరిగెనా ? అయి
నా, యెందుకు ? హింస తరిగెనా ? సుఖ సంతోష
శ్రేయములు విరిసెనా ? మరి ,
ఈ యాకటి యాత్ర లక్ష్యమేదిర ? భీమ్నా !

## 183. ఏమి వ్రాసావు ?

నిరుప హతి స్థలంబు, రమ
ణీ ప్రియ దూతిక తెచ్చి ఇచ్చు, క
ప్పుర విడె, మాత్మ కింపైన
భోజన, మూయల మంచ, మొప్పు త
ప్ప రయు రసజ్ఞు, లూహ తెలి
యంగల లేఖక పాఠకుల్ సదా
దొరికిన నీవు ఎన్ని సుకృతుల్
రచియించితి వయ్యా ? పెద్దనా !

## 184. కొడుకు కోసము

కొడుకు కోస మంచు కూడ బెట్టుచు నుంద్రు
భూమి ధనము యిరుగు పొరుగు దోచి !
పోరు విస్తరిల్లె, పోటీలు మిన్నంటె
కూటి కోస మెంత గోడు ! భీమ్నా !

## 185. సెక్స్ సినిమాలు

చోసీతి బంధములతో
తీసిన సిన్మాలు కొంప తినివేయ నెయిడ్స్
మేసేసె యువక ధాతువు !
పైసలె నిరయాగ్ని పూల పరుపులు, భీమ్నా !

కుక్క సంత కెళ్ళి కూలిన దాస్పత్రి,
నరులు పుట్టి కూలె నరక మందు !
సింహ పీఠమెక్కి, సెక్స్ సిన్మా తీసి
రెడ్డు లైటు జేరె రేడొకండు !

నివురు కోక గట్టి నిప్పు సంతకు పోవ
సిగ్గు చెదరి సంత భగ్గు మనియె!
వర్తమాన యువ ప్రవర్తన మిట్లుండె,
బొగ్గులగుచు నుండె బుద్ధి, శుద్ధి !

## 186. రాజ్యలక్ష్మి

కుసుమ రాజ్యలక్ష్మి కువలయమును వీడి
బైటపడుట వింటి, బాధపడితి ;
సుబ్బరావు భార్య , సోదరి మూర్తికి,
బయ్యవారి బిడ్డ, బంధు నాకు !

*(మూర్తి = బి.ఎస్. మూర్తి)*

## 187. సద్య స్ఫూర్తి

ఎవ్వడెవ్వ డెప్పుడే పనులను చేసి
ఖ్యాతి గనును చెప్పగాదు, కనుక
ఇష్టమైన దాని నేమర కుండుము !
చేతి కందు దాని జేసు కొమ్ము !

## 188. పాత పెరడు

పేరడీల కొరకు పెల్లగించితి పాత
పెరడు కొంత, వింత పిచ్చి రేగి ;
రాగి బిందె లందు రత్నాలు దొరికెను !
పెరడు నిండ కొత్త సిరులు విరిసె !

## 189. సనాతన అణుశక్తి

పాశు పత చక్ర ముఖ్య దివ్యాస్త్ర చయము
మాయమయ్యె కురుక్షేత్ర మైన పిదప
నాటి కీనాడు తిరిగి సనాతనాణు
శక్తి భారతి అభయ హస్తమున కెక్కె !

నింగి నేల నీట నిత్య యానము చేయు
నెల్ల వాహనముల ఇంధన మిది !
ఇంటి మింటి కంటి చంటి పాప అణువు
విక్రమింప, దెసల విరియు బ్రహ్మ !

అణు మహా సూర్యు డుదయించె, హద్దు మీరి
చొచ్చు కొని వచ్చు చీకట్లు విచ్చి పోయె
మానవ చరిత్ర నావర్తమాన చరిత
చివర విరసిన భారత శ్రీ ప్రకీర్తి !

*(13.5.98 అణు పరీక్ష)*

# 190 ఆరుద్ర పురుగులు

మోసగించె డబ్బు, మోసగించెను మబ్బు
మోస పోతి నంచు మొత్తు కొనకు !
ఆర్ద్ర కైన రావె ఆరుద్ర పురుగులు ?
పద్మ రాగ మణులు, పచ్చ నోట్లు ?

# 191. ఇల్లు X పెళ్ళి

ఇల్లు కట్టుటయును, పెళ్ళి చేయుటను,
నరుని రెండు జీవ నాడులివ్వి
చేసి తీరు నరుడు, గాసిల్లు చును నుండు
బ్రహ్మ వ్రాత లోని పంక్తులివ్వి !

# 192. హిప్నొటిజం కంటే

తాగు బోతు చేత తప్ప తాగించిన
కడుపులోని కుళ్ళు కక్కి వైచు
హిప్నొటిజము కంటె ఇది మేలు, న్యూటనా !
బ్రాన్సు బదులు భంగు బ్రాపి చూడు !

## 193. హింస నైజము

గిల్ల కజ్జాలు సహజము పిల్లలందు,
పెత్తనపు పోరు లుండును పెద్దలందు,
రాజ్య విస్తరణలు కల్గు రాజులందు,
హింస కెవడును తొలగి జీవించ లేడు !

హింస హింస యటంచు ఏమొ ఏమొ వగచి
మల్లె పువ్వునె త్రుంచుట మానినావు,
కాని, అది నేల రాలుట మానలేదు !
పూవు బ్రతుకెంత వృధ చేసినావు, సఖియ !

*( నా మధుగీత కావ్యమునుంచి )*

## 194. డాక్టరు మిత్ర

గురు కులమ్ము కాని, గోకులమో కాని
ఇంటి పేరులోనె ఎంతొ కలదు
అశ్వినులకు సాటి ఆక్యు – హోమియొ డాక్టు
మిత్ర, నాకు ప్రాణమిత్ర, భీమ్నా !

## 195. విశ్వసాహితి

చెలిమిలోన సాంబశివరావు చెలి నాకు
పోతుకూచి విశ్వ ధాతు సూచి
సతము ఫోను చేయు, సంక్షేమ మారయు,
విశ్వసాహితులకె విలువ, భీమ్నా !

## 196. తల్లి ఋణము

గర్భము ధరించి మోయుట, కనుట,బాల్య
మెల్ల పెంచుట సైజమే తల్లి కైన !
తల్లి పట్ల ప్రత్యేక బాధ్యతయు లేదు
తల్లి ఋణమను మాట కర్థమును లేదు !

## 197. పద్ధెనిమిది

ఎంటి యారు మింటి కేగిన నెల, తేది
భారతేతిహాస పర్వ సంఖ్య,
నేను తూలిపడ్డ నెల డేటు నొక్కటే
యగుటలోన గల రహస్య మేమొ !

## 198. పనిమాలిన పనులు

గొణుగు కొనుచు, మూల్గు కొనుచు, అదృష్టము
తిట్టు కొనుచు, నెత్తి కొట్టు కొనుట
ప్రజ్ఞ లేని వాని పనికి మాలిన పన్లు !
విశ్వయోగ ధామ, వినుర భీమ్నా !

## 199. భార్య భర్త

భార్య చిన్నదైన భర్తను సేవించు,
భర్త చిన్న యైన భార్య గొల్వ
తప్పు, దట్టి దాని తప్పించు కొనుటకై
వధువు చిన్నగుండ వలయు నంద్రు !

## 200. ఎవర్ని గొలిచినా

ఒకడు తండ్రి గొల్చు, ఒకడు కొడుకును గొల్చు
అకల వికల సకల నొకడు గొల్చు !
కొలుపు లెన్ని ఎవరి కొరకైన కానిమ్ము
కూడొకండె మనుజు గుణము, భీమ్నా!

## 201. శశిరేఖ

లేఖక పాఠకులను శశి
రేశా శేఖరుడు నాకు ప్రీతి నొసగె ; ఈ
లేఖన ఈ అభ్యుదయ సు
రేఖలు ఫాలమున నిడుత శ్రీ భారతికిన్ !

## 202. శ్రీ మిశ్రా

భీమన్న దళ మనన్ విని,
భీమన్నను నను దలంచి, ప్రీతిన్ యోగ
క్షేమము లరసె కలెక్టరు
శ్రీ మిశ్రా హృదయ మెంత మృదువో ! భీమ్నా !

## 203. పాడేటి జాన్సను

పాడి పోదు నంచు పాడేటి జాన్సను
పాడ దొడగె మేటి పర భృతముగ !
పికమె ఏల నయ్య ? శుఖ శారికలు – లేవె ?
పంచమమును విడిచి పాడు మంటి !

## 204. లక్ష్మీ కామేశ్వరులు

గంటి ఇంటి లక్ష్మి కామేశ్వరీ దేవి
అన్న పూర్ణ మాకు అమ్మ తల్లి !
చిన్న వాణి తల్లి శ్రీలక్ష్మి మరియొక
తల్లి మాకు తినెడి వెల్ల పుంపు !

## 205. కుమార స్వామి బాబా

మరచి పోవ లేదు, వరలక్ష్మి సావిత్రి
క్షణము క్షణము మాకు సాయ పడుట;
ప్రేమ జల్లు జల్లి శ్రీరామ మూర్తి ది,
స్వాదు హృత్కుమార స్వామి బాబ !

## 206. వాస్తు

వాస్తు అనగ వస్తు సంబంధి, వ్యక్తి స్వాభి
రుచిని బట్టి గేహము నమర్చు కొను రీతి !
వ్యక్తి గత మయ్యు మారగ వచ్చు నదియు
కాల చక్రాను వర్తు లే క్రమములైన !

## 207. భూత భయము

హే భగవాన్, హే భగవాన్
హే భగవాన్ అనుచు హుంకరించిన నంతన్
ఏ భూతమ్మైన మన్నొ !
ఏ భీతియు తొలగి, అభయమే పల్లవిలున్ !

## 208. భీతే భూతము

దయ్య ముండిన వెను వెంట దైవముండు,
భీతిచెందిన మనసె ఏభూతమ్మైన ;
ఉన్నదేని నిన్నెదొ యేచు చున్న భీతి
అంత హే భగవా నంచు అరచి పిలువు !

## 209. మునియప్ప

నీవు ఫోనులో చేసెడి సేవ లెల్ల
చేసెదను నేను భావ వీచికల తోడ ;
నీవు మునియప్ప, ముని నేను భావలయకు !
కేబులున్నది నీకు, నాకేమి కలదు ?

## 210. నిప్పులతో కాపురం

ఎప్పుడు కాల్చుక తినియెడి
నిప్పులతో కాపురంబు నిర్మలమె సుమీ !
సప్పముల నీడ బ్రతికెడి
కప్పల స్వర్గములు చూచి కలగకు, సుమతీ !

## 211. రాళ్ళ వడలు

పూరీల పిల్ల బూరెలు
గారెలు తెచ్చినది, ఎంత కని ఆ లడ్డాల్
ఆ రాళ్ళ వడలు నమిలెదు ?
లేరా ఇక తిందు గాని, లేటేల ప్రభూ ?

## 212. నిన్ను చంపే అవకాశం

చంప దగిన యట్టి శత్రువు నీచేత
చిక్కెనేని కీడు చేయ బోకు,
అతనికిచ్చి వదలు ఆ అవకాశమ్ము !
అన్న మదియె, సున్న మదియె, వేమ !

## 213. స్మృతి x విస్మృతి

గతము జ్ఞప్తి యుండటయె జీవితము, జ్ఞప్తి
పూర్తిగా లుప్త మగుటయె మృత్యు వగును ;
స్మృతికి విస్మృతి పగటికి రేయి ; నాట్య
దేశ మొకటైన, పాత్రలు దేని కదియె !

## 214. భగవాన్ అంటే

ఈశా వాసము సృష్టి క్రి
యా శీలక శక్తి, పలుకు నంతన విను నా
కాశము భగవా ననగ ; ప్ర
కాశించును, అణచు నంధకారము, భీమ్నా !

## 215. ఎవరిదృష్టి వారిది

పురుషుడటు చూచి దైవము పురుషుడనియె,
స్త్రీయు పరికించి దైవము స్త్రీయె అనియె,
వ్యాసుడు వచించె అది పరమాత్మ అనుచు
ప్రకృతి పురుషైకతా సమైశ్వర్య మద్ది !

## 216. సర్వం స్మృతి మూలం

స్మృతియే శ్రుతులకు ప్రాణము,
స్మృతియే ప్రేమాను రాగ జీవిత మెల్లన్,
స్మృతియే సంస్కృతి, చరిత్ర,
స్మృతి లేనిది ఏమి లేవు సిద్దులు, భీమ్నా !

## 217. బడుగు వెంకటు రెడ్డి

బడుగు వెంకట రెడ్డి నాబాల్య సఖుడు
పోయెనను వార్త ఇప్పుడె ఫోను చెప్పె ;
సంద్ర మొక్కటి, అలల మందరము, నైన
కలిసి నడిచిన స్మృతి తెచ్చు కంట నీరు !

*(1.5.1998)*

## 218. చింతా X నిశ్చింత

చింతా శ్రీరామమూర్తి
సొంతము అంబేడ్కరైటు, సర్వ జనైక
స్వాంతుడు, సివిలింజనీరు,
ధ్వాంతము పోగొట్టి వెలుగు బరపును నాపై !

## 219. చిరునీడల చీకటి

అరుణోదయ రవి ఆజ్ఞకు
తిరుగే లేకుండు; కాని, దశ మారు తరిన్
చిరునీడలె పెరిగి నిశా
చరమాబ్ధిని ముంచివేయు జగమునె, భీమ్నా !

## 220. చరమాంక తళుకులు

పరువమును తలుచు కొనుచున్
దుర పిల్లకు, హింస పడకు దుర్ వ్యాఖ్యలకున్,
చరమాంక తళ త్తళలవి
కరవైనన్ బ్రతుకు పూర్తి కాదుర, భీమ్నా !

## 221. జ్ఞాపకము రారు

అంతవరకు నజేయులౌ అతి రథులకె
సమయమున కస్త్ర మంత్రముల్ జ్ఞప్తిరావు ;
అట్లె కావచ్చు ఎంతటి ఆప్తులకును
జ్ఞాపకము రారు మిత్రులు, శంక లేల ?

## 222. అమ్మ

అమ్మ ప్రేమను బిడ్డల కంద జేయు
వీలు లేదు నేడని విలపించ వలదు
వీలు లేకనె ఈ పాటి మేలు కలిగె,
చెత్త వారసత్వము నుండి స్వేచ్ఛ కలిగె !

అమ్మ ఉన్నది దొంగకు, హంతకునికి,
సూత సుతునకు, శుకునకు మాత కలదు
ధరణిలో ప్రతి వెధవకు తల్లి కలదు
ప్రకృతి కర్మల కాడంబరమ్ము లేల ?

పాలు గలయంత కాలమే పసువు తల్లి,
పక్షములు వచ్చువరుకునె పక్షి తల్లి,
తల్లి చాటు బిడ్డగ జీవితమ్మునెల్ల
నాశనము చేసుకొను వాడు నరు డొకండె !

*(10.5.98, అంతర్జాతీయ మాతృదినం సందర్భంలో)*

## 223. సత్యము X మిథ్య

స్మృతియె సత్యము, స్మృతి లేని దెల్ల మిథ్య
స్మృతికి విస్మృతికి ని భేదమేమి లేని
స్థితియె నా రసాద్వైత సంబుద్ధి, అదియె
యోగ రాగ పాదాత్మ్య సంసిద్ధి, భీమ్నా !

## 224. శ్రీ కరుణ

చిత్ర సీమకు, దూరదర్శినికి వెలుగు,
కార్య సాధన కళలోన ఘటికురాలు,
తన పనులు మానుకొనియు నాపనులు చేయు
శ్రీకరుణ, మా ఆవిడ శిష్యురాలు !

## 225. పంపన సుమిత్ర

కాలెజీలో మా పిల్లల క్లాసుమేటు ;
చిత్ర నక్షత్ర వనములో చిగురు తార,
పంపన సుమిత్ర అపుడప్పు డింస్సు కొచ్చి
అన్నమును తినిపించిన దాదరమున !

## 226. స్మృతి పథంలో

రేఖ, సూర్య, రూదేంజిల్, నరేన్, నృసింహ,
పద్మ, పద్మజ, తేజ సుభామణి బూసి,
న్యూట నాదులు నాస్మృతి ద్యోవనాన
చంద్ర తారకలై వెల్గు చుంద్రు సతము !

## 227. జనవరి 18 x మే 18

గతము లేదు, ఎరుంగ నాగామి ఏమొ
నాకు గల వర్తమానము నాల్గునెలలె !
జన్యువరి లోన పర్వాల సంఖ్య మొదలు
సరిగ మే నెలలో అదే సంఖ్య వరుకు !

## 228. తారకం

రాజకీయము నకును ఆర్ద్రతకు పడదు
సరస జీవిత మార్ద్రత సాధు జనత,
బొజ్జ తారక మిందుకు మూర్తి నేడు !
ఏలను రసజ్ఞులకు రాజకీయ రభస !

## 229. హత్య

ప్రాణ మాన విత్త భంగ త్రయము నందు
బొంక వచ్చు మానవుండు, కాని
ఔషధమును తెత్తు నని చెప్పి రాకుంట
హత్య కన్న తక్కువగునె, భీమ్నా!

## 230. మాధవరావు

కాకి మాధవరావు సత్కార్య దీక్ష
నా ప్రకృత కావ్యమునకు ప్రాణ ప్రతిష్ఠ
మాధవత్వము మానవతా ధరిత్రి
కవికి చేసిన మేలెల్ల భువికి మేలు !

## 231. వడ్డి శాస్త్రి

వెంకన్న, శాస్త్రి, తదుపరి
వెంకట శివరావు ; న్యాయ విద్వాన్, అయినన్
శంఖేదో చంద్రు నిన్ ఒలె
గ్రంథిచెను గాక, రవి యగున్ కద కవులన్ !

## 232. జ్వర తరంగిణి

నిమ్స్ డైరెక్టరు మహా మనీషి, లోక
సుప్రసిద్ధుడు కాకర్ల సుబ్బరావు
"జ్వర తరంగిణి" నాకిచ్చి చదువు మనియె
దుత్త బాబ్రావు దొక రోగి దుఃఖ చరిత !

*(జ్వర తరంగిణి దుత్త బాబూరావు గారి రచన)*

## 233. ధర్మన్న గారి ఫోటో

జయ భేరి పాత ప్రతులే
మై పోయెనో, కుసుమ ధర్మ నార్యు ఫొటోయే
దియు దొరకక వగవగ, పు
న్నయ గారే వెదికి పట్టినా రొక దానిన్ !

## 234. అణువు x హనుమ

అణువు పెట్రేగి హనుమ య్మై అడర, నేను
తత్ భుజాలెక్కి రామ భద్రత వహింతు
మూఢ విశ్వాసముల నెల్ల ముంచి వేసి
భూమి సేవింతు సుఫల సుశ్యామ జేసి!

## 235. మన్ను x వెన్న

మన్ను తిన్న నోట వెన్నను తిను టెట్లు ?
వెన్న దొంగ అనుట వెర్రి కాదె !
కూడు తినెడి నరులు కూసెద రారీతి
అనుచు గొణుగు కొనును ఆవుదూడ !

## 236. సినారె

గతములో ఎవ్వ రెందరు కలరొ ఏమొ !
నవ యుగాకాశ మందు సినారె ఒకడె
నిత్య వైశాఖ సూర్యుడై నిల్చినాడు
ప్రగతి వాణీ ప్రవీణా ప్రపంచమునకు !

## 237. చంటి భూమయ్య

న్యాయమె తోడుగ పుట్టెను
ప్రాయమ్మును దళిత సేవ పర మొనరించెన్ ;
ఆయనయె చంటి భూమయ
గేయమె తత్ చరిత వీరగీతమె, భీమ్నా !

## 238. జస్టిస్ పున్నయ్య

ఘన్తు న్యాయమూర్తి జస్టిస్ పున్నయ్య
వీర గాథ లెన్నొ వేలు కలవు ;
శైశవమ్ము నుండి సప్తతి వరకవే !
వినుటలేదు వ్రాసి పెట్టు మనిన !

న్యాయ పాలనమున, న్యాయ నిర్ణయమున
పరిధులుండు, నుండు పద్ధతులును ;
ఉపరి గంగ తెచ్చి ఉర్విని పండించె
పండినంత తెచ్చి ప్రజల కిచ్చె !

కులము లేదు, వర్గములు లేవు ప్రభుతలో
సమత చూప వలయు సర్వ దిశల ;
ఉన్న పరిధిలోనె ఉపకారములు చేయు
ప్రజ్ఞ కలుగు వాడె ప్రభువు, భీమ్నా !

## 239. ఊట్ల కొండయ్య

బావగారూ అనుచు నన్ను పలకరించు
పద్యకవి ఊట్ల కొండయ్య పరము చేరె
అందు శ్రీనాథుడున్న ఆనంద పడుచు
భావ కవి మిత్రులకు చాకిరేవు పెట్టు !

*(చాకిరేవు ఊట్ల కొండయ్య గారి కావ్యం)*

## 240. మచ్చా శ్రీరాములు

మచ్చా శ్రీరాములు కన
వచ్చు ననున్ తరచు, మానత్వము గల శ్రీ
మచ్చరితుడు, ఏదో ఒక
టిచ్చుచునే యుండు విందు లిల నందరకున్ !

## 241. గతమే నయం

రమ్య మున్యాశ్రమముల, ఆరణ్యకముల
ఋక్కులను పాడు కొనుచు జీవించు నాడు
నేటి కంటెను సుఖము లుండి నని కావె ?
నరకమున కంటె ఘోరమీ నాగరికత !

## 242. నాల్గునెలల సాహిత్యము

లేదు గతము, భవిష్యతు లేదు నాకు,
నాకు గల వర్తమానము నాల్గునెలలె !
ఇందుగల గేయ పద్య సాహిత్య మెల్ల
నాల్గు నెలల సిక్ బెడ్ కే అంకితమ్ము !

## 243. మా ఊరి నూకాలమ్మ

నూకలమ్మకు దూడలు,
మేకలు మాన్పించి పాలు మీగడ లీయన్
చే కొన్న జగన్నాథము
నాకిపుడు జ్ఞప్తి వచ్చి నైనా లదిరెన్ !

*(సంవత్సరాది నాడు మాఊరి నూకాలమ్మకు జరిగే జాతరలో జంతు బలులను మాన్పించటానికి నామిత్రుడు నైనాల జగన్నాథం చేసిన ప్రయత్నం జ్ఞప్తికి వచ్చి)*

## 244. సంజీవ రెడ్డి వర్ధంతి

సంజీవ రెడ్డి వర్ధం
తిం జేయుచు నన్ను పిలిచె కృష్ణకుమారీ
సంజీవని డాక్టరు ; నే
నంజలి ఘటియిస్తి సభకు నాల్గు నెలల కున్ !

*(1-6-98)*

## 245. వీర ద్రౌపది

కర్ణుపైని మనసు కలదన్న ద్రౌపది
పోర నతని గెలుపె కోరు కొనదె ?
ఎవడు మోపె నట్టి హీనాప నిందను
విజయు చేతి వీర విశిఖ పైనె !

అన్న భార్య తమ్ము లందరి భార్యగా
వరుస వావులున్న తరము లవ్వి !
పంచ భర్తృక అని పాంచాలి నెవడను
అంధ కవుల నటుల యావ తప్పు ?

## 246. బ్రతికున్నపుడే

బ్రతికి యున్నపుడే ఎంత వానికైన
గౌరవమ్ములు, విందులు, కవులు, రవులు;
ఆగిపోయిన ప్రతివాని నధిగమించి
పోవు లోకము, గంజియు పోయలేదు !

## 247. నియంత్రితము

రవి కుటుంబమునకు నేత రవియె, కాని
గ్రహ గతులు వ్యక్తి గతములు ; కాల గతియు
దేనికదె ; దేని మనుగడ దానిదె యగు ;
నిత్య నియమానుకత నియంత్రితము సృష్టి !

## 248. రోజు చచ్చేవాడు

నిత్యమును చచ్చు నరు కేడ్వనేల నంచు
ఏడ్వ మానిరి అను నిత్య మేడ్చువారు ;
ఏడ్వ మానిరి ఇక చావ నేల నంచు ;
చావ మానెను నావంటి జడుడు, భీమ్నా !

## 249. ముగ్గురు ప్రొఫెసర్లు

యడ్ల సింహాద్రి, ఈనాకు, ఆపదరావు
ప్రాభవము గల ప్రొఫెసర్లు, వా క్సుమణులు ;
వత్తు రపుడప్పు, ఫోనులో పలకరింత్రు
వాణి పలుకుటయే నాకు వారిపలుకు !

## 250. పర్మనెంటు అడ్రసు

జీవ లవ మొక ముక్త , కించిత్తు మెరుపు ,
దాని చుట్టు అనంత బ్రహ్మాణు శక్తి ;
ప్రతి అణువు కేంద్రమే, దేని పరిధి దాన్ది ;
పర్మనెం టడ్రసదియె యే ప్రాణికైన !

## 251. పురిటి గది

వర్త మాన మేదో బాధించు నప్పుడు
గతము శాంత పరచు స్మృతికి వచ్చి ;
వ్యక్తి బ్రతుకులోన వర్తమానము భార్య
గతము తల్లి, పురిటి గదియె బ్రతుకు !

## 252. సూర్య విశ్వనాథు

సూర్య విశ్వనాథు, సూపరెంటెక్స్పెజు ,
దివికి చేరె నెపుడొ దీప సభకు ;
అన్ని పండగలును ఆతడే, మాహోలు
నిండ మెరయు నాతని కెమెరాయె !

## 253. రుద్ర భూమి

గత ఎనుబదేండ్ల ఎపిసోడ్ల శత పథముల
దూర దర్శిని కథనంబులై లమించు !
భూమి తనదన్న ఆ రుద్ర భూమి యెల్ల
నాదిగా వచ్చు చున్న దీనాడు వలచి !

*( ఆరుద్ర భూములన్ని నాకే అన్నాడట ఆరుద్ర ఎప్పుడో )*

## 254. మోహన

పాడుతా తీయగా అను బాలు రాగ
ఝరికి జడ్జిగా చిత్తరంజనుడు వచ్చి
మోహనకు లక్ష్య మనుచు నుదాహరించె
నా లలిత గేయమును, ఆయనకు నమోస్తు !

*( చిత్త రంజనుడు = ఆకాశవాణి సంగీత దర్శకుడు )*

## 255. కవి ప్రత్యేకత

కవి, రవి, భువి, దివి నాలుగు
ఇవి అవి, అవి ఇవిగ జీవ సృష్టికి మూల
చ్ఛవులగుట, రవి దివిగ ,
కవియె భువిపై చరించు కాలము లెల్లన్ !

## 256. ఇల్లు కడగడం

కవికి సంఘసేవ కర్తవ్య మనరాదు,
కవిత లోక సేవికయును కాదు
పసిడి పాలతోడ పాయసమ్ములు గాక
ఇల్లు కడుగు కొంద్రె ఎవరైన

## 257. దైనిక కార్యక్రమం

నా దైనిక కార్యక్రమ
మేదైన సదా నినున్ స్మరించుటయె యగున్ ;
నాదైన దెల్ల నీదే ,
నాదైవము నీవే క్షణ క్షణమ్మును, వాణీ !

## 258. సహన దేవత

నాకున్ కూతుం డ్రెందరొ,
లోకమె ఒక పెద్ద కూతురుగ సేవించున్ ;
మేకొన్న సహన దేవత
ఈ కూతురు, విజయ వీణకే పల్లవి యౌ !

## 259. హింస X అహింస

హింసకులని తిట్టకుము, అ
హింసకు లెవ్వరును లేరు సృష్టి చరిత్రన్ ;
కంసుని హింసకు ఆత్మ
ధ్వంస భయంబొకటె హేతువౌ కద, భీష్మా !

## 260. నిగమసీమ

జన్మతో నిరుద్ధుడను, నైజమ్ము తోడ
నేను అనిరుద్ధ డను, నాది నిగమ సీమ ;
గౌతమీ ద్వీపమున సామ గానములతొ
వేద వేదాంత రచన జీవితము నాకు !

*( నిరుద్ధుడు = నిరోధించబడిన వాడు )*

## 261. పోలీసులు

పోలిసుల పట్ల నెదొ సానుభూతి నాకు,
ఆయు వెన్నేళ్ళొ, గండాలె రేయి పగలు ;
కొట్ట గూడదు, కొట్టక గుట్టు రాదు !
ధర్మ రాజులు బ్రతికింత్రు తాము చచ్చి !

## 262. ఎవరు నగ్జల్సు ?

ఎవరు శాంతి కాము, లెవ్వరు నగ్జల్స్ ?
దొడ్డ వార లెవరు, దుష్టు లెవరు ?
వారె వీరు గాలి వాటమె నిర్ణేత
కోటి వృత్తులైన నోటి వరకె !

## 264. కుటుంబమే లోకం

తన కుటుంబమె లోక మెవ్వనికి నైన,
తానె కేంద్రము, దానికి తానె బ్రహ్మ !
అఖిల బ్రహ్మాండ భాండమ్ములందు తానె
బహు విధమ్ముల భాసించు భాస్కరుండు !

## 264. మంచాల నిజం

మంచమున పడక ముందే
మంచిగ పోవలయు నంద్రు మందులు ; అసలీ
మంచాల నిజము గానక
పంచత్వము నందు టేమి ఫలమొ, భీమ్నా !

## 265. దిక్కు లేని విధులు

కథ లెల్ల కంచి కేగును,
వ్యథ లెల్లను కాశి కేగు, ఆపద మొక్కుల్
నిధులెల్ల అలక కేగును,
విధులే ఒక దిక్కు లేక వీధుల తిరుగున్ !

## 266. ఎలుకలు

ఎన్ని వంటిళ్ళ నేమేమి తిన్న గాని
ఎలుక ఎలుకయె సరిగాదు ఏనుగునకు ;
నెరసు లెన్నయిన, అసువు లెన్నిటిని తిన్న
సాధు సంసార రసనకు సాటికావు !

## 267. సర్వ జనీనత

దళితోద్ధరణకు తామున్
దళితులు కారాదు కవులు, నాయకు లెవరున్ ;
దళితులొక వర్గమో, ఒక
కులమో కారాదు ; కోట గోడలె తామున్ !

## 268. నెల్లి x పొల్లు

సంస్కృతము కన్న హీబ్రు విశ్వ జనని యగునె ?
ఉపనిషత్ః చింతనల మించు నుర్వి నేది ?
సీత వంటి ఐశ్వర్య మేసీమ గలదు ?
మేలు నెల్లి మునిగి, పొల్లు తేలె గాక !

## 269. వృద్ధ శయ్యా చుట్టూ

ఎంత తిట్టిన ఫీల్గారు, సుంత చేసి
విసుగు కొందురు, శపియింత్రు ; వేళ లెరిగి
ప్రియ పదార్థములను తినిపింత్రు ; ఇట్లు
వృద్ధ శయ్యను సేవింత్రు వివిధ హితులు

## 270. హక్కులు

ఇచ్చునవి కావు హక్కులు
పుచ్చు కొనెడివియును కాదు ; పోరాడి మరీ
తెచ్చు కొనవలసి నట్టివి !
చచ్చులురా హక్కులడుగు జాతులు, భీమ్నా !

## 271. పేడ కడులు

నల్ల దొరల స్వరాజ్య బృందావనమున
దూడ లుండవు, ఎల్లెడ పేడ కడులె !
నలుపు వద్దన్న ధర్మన్న నల్ల బడెను
తెలుపు వద్దన్న గరిమెళ్ళ తెల్ల బడెను !

## 272. వణుకుతున్నా

ఒడ లెల్ల వణకుచున్నను
సడలదు వ్యామోహ మేదొ సభలకు పోవన్ ;
నడిపింతు రెవరు నన్నిక
కడు గూర్చెడు నీవు గాక గణ యతి ప్రాసా !

## 273. గణేశు కుమారు

అడపా దడపా వచ్చును
అడపా గణేశ కుమారు ఆమ్రాదులతో
ఎడనెడ నుందురు జగతీ
జడతను తొలగించు ఇట్టి జ్ఞానేశు లిలన్ !

## 274. అడిగితేనే ఆదరణ

ఆశ్రయించిన వారినే ఆదరించు
శ్రీనివాసు డైనను, కల్ప వృక్షమైన ;
పైరవియే లేని ఏపూర్ణ ఫాల్గుణమ్మొ
అడగకే నాకు అందించు అవసరములు !

## 275. చింతలే చింతనలు

గొంతెత్తి పాడ దలతును,
గంతులతో ఆడ దలతు, కదలవు ప్రాణాలు
చింతలె మిగిలెను, ఇవె తుది
చింతనలై కలిసి పోవు సృష్టి స్థితులన్ !

## 276. కవిత ఛందస్సు

వస్తువును బట్టి, వస్తు తత్వమును బట్టి
వివిధ ఛందస్సు లమరు కవిత్వ మందు
వచన కవితయు తగు కొన్ని వస్తువులకు
తేనె ముఖ్యము పూలు వేరైన గాని !

## 277. నిత్య యత్నం

ప్రశ్న దేని కైన ప్రత్యుత్తరము గల్గు
శవము కైన బ్రతుకు ఛాన్సు గలుగు ;
ముడులు కలవె ఎందు విడదీయ రానివి ?
నిత్య యత్న మొకటె సత్య పథము !

## 278. మూటే మారణాయుధం

ఇన్ని భాషలేల, ఇంత వాంగ్మ యమేల ?
మౌన సుఖమె గమ్యమైన మహిని
మాట మాట కన్న మారణాయుధమేది ?
పిక నిఘంటు వొక్క పేజి కాదే ?

## 279. పాలక ప్రజ్ఞలు

జుట్టు చేత బట్టి చుంబించ వలె మోము
తిండి చూపి పొదుగు పిండగ వలె !
చేత గదను బట్టి స్వాతంత్ర్య మీ వలె
ప్రభుత చేయ గల్గు ప్రజ్ఞ లివియు !

## 280. భీమ్న నామము

భీమ నామ మేని, భీమన్న పేరేని
కవిత కీడు జోడు కాదు నిజము !
అంద గించ విట్టి అభిదానములు నాకు,
పిసరు మేలు కాదె భీమ్న అనుట ?

పేరు మార్చు కొమ్మని నన్ను పెక్కు మంది
చెలులు కోరిన నాటికే చేరు కొనెను
అన్న లందు నాపేరు భీమన్న అనుచు !
భేద మేమిటి భీమన్న భీమ్న య్యైన ?

## 281. నీ గుణమె సృష్టి గుణం

తల్లి తండ్రి, గురువు, దైవంబు అని గాక
పాప మనుచు జాలి పడియు గాక
అనుసరించవలయు ఆత్మీయ ధర్మంబు !
గుణము నీదె సృష్టి గుణము, భీమ్నా !

## 282. పోషకాహారము

ఈ రచన ఇంత పెరిగిన కారణమ్ము
అదును కందిన పోషకాహార బలమె !
కన్న వారలు పెంచ లేకున్న గాని
పెంచువా రున్నవారైన పెరగ కేమి !

## 283. పదును

నా రచన లెంత యేని మా నారి నిత్య
నిర్దయా వ్యాఖ్యలకు పదునెక్కి నవియె !
తిట్టు కొలదియు మెుండి కెత్తెడి గుణమ్మె
ధనియమ్మె, కొత్తిమీరయునై తనుపు నన్ను !

*( మా నారి=మా ఆవిడ )*

## 284. కొబ్బరి నీరు

తాగుమనె నొక డాక్టరు ; తాగ గూడ
దనె మరొక్కడు, కిడ్నీకి హాని అనెను ;
చర్చ కొబ్బరి బొండాల చర్య గూర్చి !
అమిత మపకారము దేని కైన, నిజము !

## 285. మూఁడు కన్నుల పురాణం

శ్రీ మహావిష్ణు వొక సారి శివుని కొండ
కేగె వైశాఖ మాసపు టెండల బడి,
స్వాదు శీతల వారితో సేద దేరి,
అడిగి మరి త్రాగి మురిసె తదమృతరుచికి !

ఆ పరమ సన్నివేశపు జ్ఞాపికలను
నాటు కొనె తెచ్చి తన పాల తోట లోన ;
కల్పతరు లవ్వి, ముక్కంటి కాన్కలయ్యె
కొబ్బరియు, తాటి చెట్టును కువలయముకు !

## 286. పనికి తిండి

బ్రతక లేడు మనిషి పని యేదొ చేయక
చేయు పనికి మంచి చెడ్డ లేల ?
పనికి తిండి రాని బ్రతుకెండి పోవును !
ఎండనున్న బ్రతుకులే దుండగీండ్రు !

## 287. నాపై జాలి ఉంటే

నాలుగు మాసముల్ నరక
    నందన వాసము ; నిత్య పంక శై
వాలము లోన పాల్కడలి
    వైనము ; బ్రహ్మముఖాన కచ్ఛ పీ
లీలల రాసమున్ ; పెనిసి
    లిన్ పయికెత్తిన నావిచార ధా
రాలస తారకా మృదుల
    హాసము ; నీ కిపుడేనినా పయిన్
ఏలవమేని జాలి గల
    దేని విదల్ప గదమ్మ, భారతీ !

## 288. తగ్గని నొప్పి

ఎన్ని నెలలకైన, ఎన్ని మందులకైన
తూలి పడ్డ నొప్పి తొలగ లేదు ;
బైటి కేగ గలను, బల్ల గుద్ద లేను !
ఏగనేల ? ఏల నేగ కున్న ?

## 289. మహా భూపతి

భూపతి రామ మోహనుడు
    మోరి పాలమ్ము తదాది, బళ్ళవం
శీ పురుషోత్త మాదులగు
    మిత్రులగూడి పఠించు వాడు,
నేనాపద జిక్కి పడ్డ కబు
    రందిన వెంటనె జాబు వ్రాసె ! నా
జ్ఞాపక వర్తులంటె గత
    చైత్రము లర్వది ఆరు దివ్వెలన్ !

## 290. వేస్లీ

అద్దంకి వారి బిడ్డడు,
విద్దెల కాణాచి, పేరు వేస్లీ ; నన్నే
పొద్దు పరామర్శించును ఎద్దెస
నుండినను, దూర మెంతుండిననున్ !

## 291. వ్యాస ప్రోక్తం

వ్యాసు డనగ నెవడు ఆనాటి మనుజుడే
తనకు తెలిసినంత మనకు తెలిపె ;
వ్యాస ప్రోక్త మెల్ల పరమ సత్యము కాదు
పరమ సత్యమెదియు ధరణి లేదు !

## 292. కర్మ అనుభవించే దెవ్వరు ?

దృష్టి మందగించె, ధీశక్తి చల్లారె
చెవులు వినుట మానె, చవులు చచ్చె
ప్రాణ మేగ సిద్ధపడి యుండె ; మిగిలిన
కర్మ బాధ్యులెవరు ? కర్మ లేవి ?

## 293. అవసరానికి

ఉన్న పెన్నొ పెన్ను, లొకటియు వ్రాయదు
అందరకును నాదె అవసరమగు ;
కొత్త భావమేదొ కోరివచ్చిన వేళ
స్వీకరించ బోయి సిగ్గుపడుదు !

## 294. బృంద హత్యా

శంఖమూడదీయ శంఖ చూడుడు చచ్చు
సతిని మోసగించి చంపనేల ?
దేవ దేవుడైన దేవేంద్రుడే యైన
అన్య కాంత పట్ల అడవి మృగమె !

## 295. మూర్ఖ మహిమలు

కన్య కొకడు పుట్టె, గాలి కొకడు పుట్టె
చేపకొకడు, లేడి పాప కొకడు
ఎపుడొ పుట్టి నంద్రు ఇపుడేల పుట్టరో
లేవు నాటి మహిమలిపుడు, భీమ్నా !

## 296. పెండ్లి వయస్సు

ఇరువదేండ్ల పెండ్లి ఇంటికి దీపమ్ము
పాతి కేండ్ల పెండ్లి పాలవెల్లి ;
ముప్పదేండ్ల పెండ్లి ముల్లోక విజయమ్ము
నలుబదేండ్ల పెండ్లి నాగమల్లి !

## 297. వస్తు వేదైన

సహజ చాపల్యముల నెల్ల సంస్కరించి
తనయులను పెంచు తండ్రి విధాన కవియు,
బండరాతిని కావ్యశిల్పముగ మలచు
వస్తు వేదైన సరస కావ్యముగ తీర్చు !
శ్రావణము నీవు, నేను భాద్రపద ; మిర్వు
రమును దివిమూసి, భువి ముంచు ప్రాణ ధార
ప్రకృతి కంతకు నిత్య పోషకులు మనము
నాల్గు మేఘాల దౌత్య కేంద్రమ్ము మనము !

## 298. కవీ మనిషే

ఫేను వేయ మరతు, వేసి తీయ మరతు,
యతిని మరతు, పద్య గతిని మరతు
పరిచయులను మరచి పడుచుందు మాటలు
కాల కేళి లోన కవియు మనిషె !

## 299. చాలు అనకు

సరకు చేయగ వలె వృద్ధ జనుల ననుచు
చాల సార్లు చెప్పితి, వింక చాలు ననకు
వృద్ధులే లోక మన, మెజార్టీయు వారె ;
పిల్ల కాకుల బ్రతుకులు పిట్ట కథలె !

ఉడుకు నెత్తురు రోడ్లపై కురికి పారు
ఓట్ల మంటలు సలసల పొంగి పొరలు
ప్రొద్దు వాలిన మీదనే బుద్ధి పొడచు
నైజమిది కాన, వృద్ధుల నాదరించు !

## 300. అన్నపూర్ణమ్మ

అన్నపూర్ణమ్మ ఒక పద్య మాలకించి
అడరి, అక్షర లక్షలంచు అభినుతించె ;
తాను అక్షర నూర్లు ఇచ్చు దానననియె ;
మెచ్చుకొన చాలు, పదిలక్షలిచ్చినట్లు !

## 301. సారస్వత కాక్‌టెయిల్

గోపాలుడు నిను వలచి
నీపాటను మదిదలచి
ఏ వంచను పొంచిపొంచి
విను చున్నాడని ఎంచి
పాడవేల రాధికా
ప్రణయ నిశా గీతిక

*(సంగీత సాహిత్యాలు కలిపి కాక్‌టెయిల్ చేసి రసిక లోకానికి అందిస్తున్న ఈగేయం ఎవరి రచన ? ఎంతోమందిని అడిగి అడిగి ఇంటికి వచ్చిన నాకు మా ఆవిడ జవాబిచ్చింది - ఆ రచయిత శ్రీ శ్రీ అని ఓహో సారస్వత మూర్తి )*

## 302. ఇల్లు కడగడం

కవికి సంఘ సేవ కర్తవ్య మనరాదు,
కవిత లోక సేవికయును కాదు,
పసిడి పాలతోడ పాయసమ్ములు గాక
ఇల్లు కడుగు కొంద్రె ఎవరైన ?

## 303. మన డెమోక్రసి

ప్రభు వొకండె భూమి పతియైన కాలాన
వ్యక్తి ఒకడె బాధ్యుడన్నిటికిని
ప్రజల రాజ్యమందు ప్రతివాడు భూపతె
తలొక ముక్కకొరకు తన్ను కొంద్రు !

కుక్కలు చింపిన విస్తరి,
నక్కల పాలైన నంది, నాయకులు తలో
ముక్కను తినగా మిగిలిన
బొక్క సుమీ జాతి ఈ డెమోక్రసి లోనన్

## 304. లేదు వంటమనిషి

పొన్నగంటి, అరటి పూవు, తెలగ పిండి
కందిపప్పు లోన కలిపి వండి
ఆవగాయ నూనె నద్దుక తినవలె !
వంట మనిషి లేదు వస్తువున్న !

## 305. వృద్ధ ప్రయోగ శాల

తిరిగి చిన్న నాటి తిండి పెట్టుదురేని,
ముద్దు చేతురేని, ముసలి వాడు
బాలు డగుట నిజము, ప్రౌఢుడు నగు నేమొ ;
వృద్ధ యోగ శాల పెట్టి చూడు !
వృద్ధులకు బాల్య రుచులపై బుద్ధి పోవు,
పిచ్చి కోరికలని చిన్న బుచ్చ వలదు ;
చిన్నప్పుడు తల్లి చేసెడి జొన్న పిసరె
నేటి చాక్లెట్ల కంటె సంతృప్తి పరచు !

## 306. చివరి గూడు

గతము లేదు నాకు గర్వింప దగినది,
ఊహ చేయలేము ఉపరి గతిని ;
శీతకాల మిద్ది చివరిది, శివరాత్రి ;
చిత్త వృత్తు లెల్ల చేరు గూడు !

## 307. యజ్ఞ ఫలం

జంగురెడ్డిగూడెమున, ఏజన్సిలోన
లవ కుశల ఏక రూపమ్మై అవతరించె
రవియు చంద్రుడు, రవిచంద్ర ; రాత్రి పగలు
వచ్చి లాలించినాడు నా వాగ్విపంచి !

నాకొరకె పుట్టి నట్టు పొన్నాడ వారి
ఇంట బుట్టిన వ్రేపల్లె కొంటెవాడు
ముద్రణకు పూనుకొనకున్న నిద్ర లేచి
అడరి ఈవాణి వెలుగు చూచెడిదికాదు !

## 308. క్రొత్త పెన్ను

తిరిగి కూర్చుండి వ్రాయు శక్తి సమకూరి
నందు కట మా సవిత్రి నా కంద జేసె
క్రొత్త పెన్నిది, కవితకు క్రొన్నిధి ఇది !
ఇప్పుడీ లేఖినిదియె ఈకృతి ముగింపు !

## 309. గళమెత్తవే

గళ మెత్తవే, కోకిలా !
లేచి, గళ మెత్తవే కోకిలా
  దళిత మావల ద్రోసి
  దళ వాయిగా లేచి ॥గళ॥

కుహు కుహు అంటావు
కుహు వెక్కడుం దిపుడు ?
  చిమ్మా చీకటి కుహువు
  ఛిద్రమై పోలేదా ? ॥గళ॥

అరుణో దయ మ్మయ్యె
తరుణో దయ మ్మయ్యె
సరిగమల బృందం తో
గురు వొచ్చి వున్నాడు ||గళ||

కో అంటె నీ వెనుక
కోటి మం దున్నారు
ప్రజ్ఞాన కాంతులతో
పరవళ్ళు ద్రొక్కెరు
పంచమ స్వరముతో
ప్రతిభా భారతిపై ||గళ||

* * *